


నిష్పక్షపాత కర్తవ్య నిర్వహణం

22ND ANNIVERSARY

# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక



ఆదివారం 26-07-2026 పేజీలు : 12 CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES సంపుటి : 22 సంచిక : 110 రూ॥ 6.00





చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

## ఆంధ్రప్రదేశ్ కి వరంగా మారిన

# కాళేశ్వరం దుస్థితి

# కాళేశ్వరం చుట్టూ తెలంగాణ రాజకీయం



- కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల మధ్య ఈగో సమస్య
- వృధాగా పోతున్న నీటితో తెలంగాణకు నీటి ఎద్దడి సమస్య
- లిఖితపూర్వక సూచనలు రాకుండా ముందుకెళ్లమంటున్న కాంగ్రెస్
- కేసీఆర్‌కు పేరొస్తుందని కాంగ్రెస్‌కు కుళ్లు: హరీష్‌రావు
- కాంగ్రెస్,బీఆర్ఎస్‌లపై విమర్శల దాడిచేస్తున్న బీజేపీ
- నీటి విడుదలపై తమకు సంబంధం లేదన్న ఎన్‌డీఎస్ఏ
- ఎన్‌డీఎస్ఏ వెల్లడితో ఇరకాటంలో కాంగ్రెస్
- రేవంత్‌పై వత్తిడి పెంచిన విపక్షాలు
- రాజకీయ ఒత్తిళ్లకు లొంగకూడదని ప్రభుత్వ నిర్ణయం

హైదరాబాద్, నేటిధాత్రి:
ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ తిరుగుతున్న తెలంగాణ రాజకీయాలు, యుద్ధ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్ ఏ) ఇచ్చిన తాజా వివరణ, కేంద్ర జలశక్తి శాఖ మంత్రుల వ్యాఖ్యలు, రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ ఎస్ మరియు బీజేపీల మధ్య సరికొత్త రాజకీయ చదరంగానికి తెరలేపాయి. టెక్నికల్ లోపాల కంటే ఇప్పుడు పొలిటికల్ మైండ్ గేమ్‌లే ప్రాజెక్టును నడిపిస్తున్నాయి. ఇటీవల ఆస్ట్రేలియాకు చెందిన ఒక ప్రవాస భారతీ యుడు వేసిన అర్జీకి స్పందిస్తూ, కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోయాలా లేదా అనే అంశంతో తమకు ఎలాంటి సంబంధం లేదని, ఆ నిర్ణయం పూర్తిగా తెలంగాణ ప్రభుత్వ పాలసీపరిధిలోనిదని ఎన్‌డీఎస్‌ఏ స్పష్టం చేసింది. ఈ వివరణతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇకపై కేంద్రం లేదా ఎన్‌డీఎస్‌ఏ నివేదికల వెనుక దాక్కోవడానికి వీల్లేకుండా పోయింది. నిర్ణయాధికారం పూర్తిగారాష్ట్ర ప్రభుత్వానిదేనని తేలిపోవడంతో కాంగ్రెస్‌పై ఒత్తిడి పెరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని పంపింగ్ చేయడంపై జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్ ఏ)కు అర్జీ సమర్పిం చిన ఆ ప్రవాస భారతీయుడి (ఎన్ ఆర్ ఐ) పేరు తీర్థాల లక్ష్మీ నరసింహ గుప్తా. ఆయన ప్రస్తు తం ఆస్ట్రేలియాలో నివసిస్తున్నారు. తెలంగాణలో నెలకొన్న వర్షాభావ/కరవు పరిస్థితుల నేపథ్యంలో, కాళేశ్వరం ప్రాజెక్టు భద్రతను సాంకేతి కంగా అంచనా వేసి, రైతుల ప్రయోజనాల కోసం దానిని సురక్షితంగా ఎలా వాడుకోవాలో మార్గదర్శకాలు ఇవ్వాలని ఆయన ఎన్‌డీఎస్ ఏను కోరారు. డ్యామ్ సేఫ్టీ యాక్ట్-2021 ప్రకారం ప్రాజెక్టుల భద్రత, పర్యవేక్షణ మాత్రమే తమ పరిధిలోకి వస్తుందని.. కరవు సమయంలో నీటిని ఎక్కడకు, ఎంత మేర ఎత్తిపోయాలి అనే నిర్ణయం పూర్తిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాలసీ పరిధిలోనిదని ఎన్‌డీఎస్‌ఏ ఆయనకు స్పష్టం చేసింది.

## కాంగ్రెస్ వ్యూహం

రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతఅత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో చాలా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. రాజకీయ ఒత్తిళ్లకు లంగి, ఎలాంటి ముందస్తు భద్రతా చర్యలు లేకుండా మోటార్లు ఆన్ చేసి బ్యారేజీలు కొట్టుకుపోతే ఆ నింద తమ పై పడుతుందని కాంగ్రెస్ భయపడుతోంది. అందుకే అన్నారం ఫౌండేషన్‌లో ఖాళీలు (రంధ్రా లు) ఏర్పడ్డాయని, ప్రస్తుతం మూడు బ్యారేజీలను 'ఫ్రీ-ఫ్లో' (నీటిని నిల్వ చేయకుండా వదిలేయ డం) స్థితిలోనే ఉ ంచుతామని చెబుతోంది. ఎన్‌డీ ఎస్‌ఏ పంపింగ్‌పై క్లారిటీ ఇచ్చినా, రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ కేంద్ర జలశక్తి శాఖకు లేఖ రాయాలని నిర్ణయించింది. స్పష్టమైన లిఖితపూర్వక గైడ్‌లైన్స్ వచ్చే వరకు తాము ఎలాంటి రిస్క్ తీసుకోబోమని కాంగ్రెస్ తేల్చేసింది. ప్రాజెక్టు డిజైన్ లోపాల వల్లే ఈ దుస్థితి వచ్చిందని బీఆర్ఎస్‌పై నింద వేస్తూనే, విచారణ కమిషన్ల ద్వారా కేసీఆర్ ఫ్యామిలీని కార్నర్ చేయడం వీరి ప్రధాన వ్యూహం. అయితే బీఆర్ ఎస్‌ను కార్నర్ చేయడంలో రేవంత్, ఉత్తమ్ కుమార్‌రెడ్డిలు ఎవరి శైలిని వారు అనుసరిస్తున్నారు. ఉదాహరణకు రేవంత్ బీఆర్ ఎస్‌నేతలపై అత్యంత దూకుడుగా విమర్శలు చేస్తున్నారు. అబద్ధాలు చెబితే "బెల్ట్ ట్రీట్‌మెంట్" ఇ స్తామని, కేటీఆర్, హరీష్ రావు కాళేశ్వరంలో దూకితే రాష్ట్రానికి శని వదులుతుందని పొలిటికల్‌హీట్ పెంచుతున్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి పూర్తిగా రూల్ బుక్, ఫ్యాక్ట్స్ అండ్ ఫిగర్స్‌తో మాట్లాడుతున్నారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ల ద్వారా గత ఐదేళ్లలో కాళేశ్వరం వల్ల కేవలం 55 టీ ఎంసీల నీరు మాత్రమే వాడారని నిరూపించే ప్రయత్నం చేశారు. ఎన్‌డీఎస్‌ఏ క్లారిటీ ఇచ్చినప్పటికీ, కేంద్ర నిపుణుల అధికారిక అనుమతులు లేకుండా తాము ఒక్క అడుగు కూడా ముందుకు వేయబోమని, ఒకవేళ ఏదైనా జరిగితే కేంద్రానిదే బాధ్యత అనేలా రేవంత్ రాజకీయంగా కార్నర్ చేస్తున్నారు. కేంద్ర జల్ శక్తి శాఖకు, ఎన్‌డీఎస్ ఏకి నిరంతరం టెక్నికల్ నివేదికలు పంపుతూ, భవిష్యత్తు నిర్ణయాలన్నీ అధికారిక రికార్డుల్లో ఉండేలా ఉత్తమ్ కుమార్ రెడ్డి చాలా జాగ్రత్తగా అ డుగులు వేస్తున్నారు. మోటార్లు ఆన్ చేయాలని సూచించిన కొందరు రిటైర్డ్ ఇంజనీర్లను గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో చేతులు కలిపిన "దోషులు"గా అభివర్ణిస్తూ జైల్లో పెట్టాల్సిందంటూ రేవంత్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇక ఉ త్తమ్‌కుమార్ రెడ్డి ఐఐటీ ముంబై, ఇతర జాతీయ నిపుణుల సల హాలతో ఆగస్టు-సెప్టెంబర్ నాటికి మేడిగడ్డ పునరుద్ధరణ డిజైన్లు, వ్యయ అంచనాలు సిద్ధం చే యించే అడ్మినిస్ట్రేటివ్ పనులపై దఅష్టి పెట్టారు. ప్రభుత్వంలో కీలకమైన ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రుల మధ్య నిర్ణయాల పరంగా ఎలాంటి బేధాభిప్రాయాలు లేవు. అయితే, రేవంత్ రెడ్డి ఈ వివాదాన్ని కేసీఆర్ ఫ్యామిలీని రాజకీయంగా దెబ్బకొట్టే "పొలిటికల్ వెపన్" లాగా వాడుకుంటుంటే... ఉత్తమ్ కుమార్ రెడ్డి మాత్రం రేపు ప్రాజెక్టుకు ఏ చిన్న నష్టం జరిగినా ఆ నింద కాంగ్రెస్ ప్రభుత్వంపై పడకుండా ఉ ండేందుకు "సేఫ్ అండ్ లీగల్ టెక్నికల్ గేమ్" ఆడుతున్నా రు. అంటే రేవంత్‌ది 'పొలిటికల్' పంచ్.. ఉత్తమ్‌ది 'టెక్నికల్' డిఫెన్స్!

## బీఆర్ ఎస్ ఎదురుదాడి

కాళేశ్వరం ప్రాజెక్టు నీటి పంపింగ్‌పై జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీ ఎస్‌ఏ) ఇచ్చిన క్లారిటీతో ప్రతిపక్ష బీఆర్ ఎస్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తన కౌంటర్ అటాక్‌ను ముమ్మరం చేసింది. ఈ వివరణను అస్త్రంగా చేసుకుని బీఆర్ఎస్ శ్రేణులు, ముఖ్యంగా మాజీ మంత్రి టి. హరీష్ రావు, మాజీ ఎంపీ బి. వినోద్ కుమార్, గంగుల కమలాకర్ తదితర నేతలు కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు. ప్రాజెక్టు దెబ్బతినడం వెనుక కాంగ్రెస్ కుట్రఉ ందనే రీతిలో క్షేత్రస్థాయిలో దాడిని ఉధఅతం చేశారు. "కేంద్ర సంస్థ (ఎన్‌డీఎస్ ఏ) అనుమతి ఇవ్వడం లేదు, మోటార్లు ఆన్ చేస్తే బ్యారేజీలు కొట్టుకుపోతాయి" అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఆడిన నాటకాలన్నీ ఎన్‌డీఎస్‌ఏ క్లారిటీతో బట్టబయలయ్యాయని బిఆర్ఎస్ ఆరోపి స్తోంది. నీటిని ఎత్తిపోయాలా వద్దా అనే నిర్ణయం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానిదేనని కేంద్రం తేల్చేయడంతో, కాంగ్రెస్ ఇన్నాళ్లు చెప్పినవన్నీ అబద్ధాలని స్పష్టమైందని విమర్శిస్తోంది. గోదావరి నదిలోకి భారీగా ఇన్‌ఫ్లో (వరద నీరు) వస్తున్నా, కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీటిని లిఫ్ట్ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని హరీష్ రావు మండిపడ్డారు. దాదాపు 75 టీఎంసీల నీరు వఅథాగా సముద్రంలోకి కొట్టుకుపోతుంటే, ప్రభుత్వం చేతులు ముడుచుకు కూర్చుందని.. ఫలితంగా లోయర్ మానేరు, మిడ్ మానేరు ఆయకట్టు పరిధిలో వనకాలం (ఖరీఫ్) పంట లు ఎండిపోతు న్నాయని బీఆర్ ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. కేసీఆర్ నిర్మించిన ప్రాజెక్టుకు మంచి పేరు వస్తుందనే కుళ్లుతో, రాజకీయ కక్ష సాధింపు కోసం తెలంగాణను కాంగ్రెస్ "కఅత్రిమ కరవు" లోకి నెట్టిందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ సీనియర్ నేత బి. వినోద్ కుమార్ మాట్లాడుతూ,ఎన్‌డీఎస్‌ఏ అనేది కేవలం ఒక సలహా ఇచ్చే సంస్థ మాత్రమేనని, అది శాసించే రెగ్యులేటరీ అథారిటీ కాద ని గుర్తుచేశారు. ప్రాజెక్టుల యాజమాన్య హక్కులు ఎప్పుడూ రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోనే ఉంటాయని, ఈ విషయం తెలిసినా సీఎం, ఇరిగేషన్ మంత్రి ఢిల్లీ వెళ్లి ఎన్‌డీఎస్ ఏను సాకుగా చూపించడం వెనుక రైతులను మోసం చేసే కుట్ర ఉందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టును, కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీయడానికి కాంగ్రెస్ మరియు బీజేపీలు చేతులు కలిపాయని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టు కొట్టుకుపోయినా కేంద్రం అక్కడ ప్రత్యేక శ్రద్ధ పెట్టి నిధులు ఇస్తుంటే, తెలంగాణలోని కాళేశ్వరంపై మాత్రం ఎన్‌డీఎస్‌ఏ రిపోర్టుల పేరుతో కాంగ్రెస్‌తో కలిసి డ్రామాలు ఆడుతోం దని విమర్శించింది. కాళేశ్వరం ప్రాజెక్టును ఎ లా నడపాలో, దెబ్బతిన్న మేడిగడ్డకు చిన్న చిన్న తాత్కాలిక మరమ్మతులు చేసి నీటిని ఎలా ఎత్తి పోయాలో మాజీ సీఎం కేసీఆర్‌కు, బీఆర్ఎస్ ఇంజనీర్లకు బాగా తెలుసని హరీష్ రావు సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాలు కాపాడటం చేతకాకపోతే, ఇరిగేషన్ శాఖబాధ్యతలను లేదా కాళేశ్వరం నిర్వహణను కొన్ని రోజులు తమకు అప్పగించాలని, తామే రైతులకు సాగునీరు అందించి చూపిస్తామని బహిరంగ సవాల్ విసిరారు. ఎన్‌డీఎస్‌ఏ ఇచ్చిన వివరణతో కాంగ్రెస్ ప్రభుత్వానికి సాంకేతిక రక్షణ కవచం పోయినట్లయింది. బిఆర్ఎస్ దీనిని పూర్తిస్థాయి ప్రజా క్షేత్రంలోకి తీసుకెళ్లి, "రైతు వ్యతిరేక కాంగ్రెస్" అనే ముద్ర వేయడానికి పాదయాత్రలు, ఆందోళనలతో (ఉదాహరణకు చిన్నకోడూరు రైతుల పాదయాత్ర) పొలిటికల్ హీట్ పెంచుతోంది. తాజా పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం జూలై 24న మళ్లీ కేంద్రానికి లేఖ రాయడం ద్వారా డిఫెన్స్‌లో పడిందనే సంకేతాలు ప్రజల్లోకి వెళ్లేలా బిఆర్ఎస్ తన కౌంటర్ వ్యూహాన్ని సక్సెస్‌ఫుల్‌గా నడుపుతోంది.

## రెండు పార్టీలనూ టార్గెట్ చేస్తున్న బీజేపీ

కాళేశ్వరం ప్రాజెక్టు-ఎన్‌డీఎస్‌ఏ వివాదంలో బీజేపీ ఇటు అధికార కాంగ్రెస్, అటు ప్రతిపక్ష బిఆర్ఎస్ రెండు పార్టీలనూ సమానంగా లక్ష్యంగా చేసుకుంటూ 'డబుల్ అటాక్' వ్యూహాన్ని అమ లు చేస్తోంది. తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, కేంద్ర బగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, రఘునందన్ రావు నేతఅత్వం లో పార్టీ తన వైఖరిని స్పష్టం చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండు పార్టీలు కలిసి ప్రజలను, రైతులను మోసం చేయడానికి "రాజకీయ నాటకాలు" ఆడుతున్నాయని బీజేపీ ఆరోపిస్తోంది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అవినీతిపై సీఎం రేవంత్ రెడ్డి కేవలం నామమాత్రపు చర్య లు తీసుకుంటున్నారని, దోషులను కాపాడటానికి కాంగ్రెస్ మెతక వైఖరి అవలంబిస్తోందని విమర్శిస్తోంది. రెండు ప్రాంతీయ పార్టీల మధ్య లోపాయి కారీ ఒప్పందం ఉందని, అందుకే ఈ డ్రామాలు అని బీజేపీ ప్రజల్లోకి తీసుకెళ్తోంది. గత కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరాన్ని తమ పార్టీ నేతలకోసం ఏటీఎం లాగా వాడుకుని విచ్చలవిడి అవినీతికి, నాణ్యతా లోపాలకు పాల్పడిందని బీజేపీ గట్టిగా పునరుద్ఘాటించింది. అయితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ అవినీతిని సాకుగా చూపి స్తూ, కనీస మరమ్మతులు కూడా చేయకుండా కాలయాపన చేస్తోందని మండిపడుతోంది.

తెలంగాణ బీజేపీ నేతలు ఈ వివాదంలో రెండు ప్రాంతీయ పార్టీలను లక్ష్యంగా చేసుకున్నారు. గత బీఆర్ ఎస్‌ప్రభుత్వం కాళేశ్వరాన్ని తమ "ఏటీఎం" లాగా వాడుకుని అవినీతికి పాల్పడిందని ఒకవైపు ఆరోపిస్తూనే... మరోవైపు, ఎన్‌డీఎస్‌ఏ సిఫారసులు ఇచ్చి ఇన్ని నెలలైనా కాంగ్రెస్ ప్ర భుత్వం కనీస మరమ్మతులు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శిస్తున్నారు. కాంగ్రెస్ కేవలం "చిల్లర రాజకీయాల" కోసమే రైతులను ఇబ్బంది పెడుతోందని, కాంగ్రెస్-బీఆర్ఎస్‌ల మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్‌డీఎస్‌ఏ పంపింగ్‌పై క్లారిటీ ఇవ్వడానికి ముందే, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు సీఎం రేవంత్ రెడ్డికి ఒక బహిరంగ లేఖ రాశారు. కేంద్ర పరిధిలోని ఎన్‌డీఎస్‌ఏ సంస్థ 2023, 2024, 2025లలోనే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ , జియోటెక్నికల్ అధ్యయనాల కోసం స్పష్టమైన సిఫారసులు/మార్గదర్శకాలు ఇచ్చిందని ఆయన గుర్తుచేశారు. ఆ సిఫారసులను సకాలంలో అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని.. ఒకటి లేదా రెండు వర్కింగ్ సీజన్లలో పూర్తి చేయాల్సిన తాత్కాలిక మరమ్మతులను కూడా చేయకుండా నిర్లక్ష్యం వహించిందని బీజేపీ ఆరోపించింది. కాంగ్రెస్ కేవలం తమ "చిల్లర, మురికి రాజకీ యాల" కోసం గోదావరి వరద నీటిని వాడుకోకుండా వదిలేసిందని బీజేపీ ధ్వజమెత్తింది. దీనివల్ల తెలంగాణ వ్యాప్తంగా సాగునీరు, తాగునీటి సరఫరా నిలిచిపోయి, వర్షాభావ పరిస్థితుల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కూడా రైతుల ప్రయోజనాలే ముఖ్యమని, వఅథాగా పోతున్న నీటిని సాగుకు ఉ పయోగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర బగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి నేతఅత్వంలో తెలంగాణ బీజేపీ ఎంపీల బఅందం (ఈటల, రఘునందన్ రావు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు) ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్‌ను కలవడం తాజా పరిణామం. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రస్తుతం జరుగుతున్న సీబీఐ విచారణ పరిధి చాలా పరిమితంగా ఉందని, దీని పరిధిని మరింత పెంచి లోతుగా విచారణ జరిపించాలని కేంద్ర మంత్రిని కోరారు. అలాగే కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి పంపింగ్ నిలిచిపోవడం, రిపేర్లలో జరుగుతున్న ఆలస్యంపై కేంద్రానికి ఫిర్యాదు చేశారు. బీజేపీ ఈ వివాదంలో చాలా తెలివిగా వ్యవహరిస్తోంది. కేంద్ర సంస్థ అయిన ఎన్‌డీఎస్‌ఏ ఇచ్చిన నివేదికలను కాంగ్రెస్ తన రాజకీయ రక్షణ కవచంగా వాడుకోకుండా నిరోధించడమే బీజేపీ వ్యూహం. "గత ప్రభుత్వం అవినీతి చేసింది నిజమే, కానీ ప్రస్తుత ప్రభుత్వం చేతకాక రిపేర్లు చేయకుండా రైతులను ఎండబెడుతోంది" అనే బలమైన ముద్రను కాంగ్రెస్‌పై వేయడం ద్వారా, రాబోయే రోజుల్లో రైతు సెంటిమెంట్‌ను తమకు అనుకూలం గా మార్చుకోవాలని కమలదళం చూస్తోంది.

ఈ ముక్కోణపు పోరులో టెక్నికల్ సొల్యూషన్స్ వెనుకబడి, పొలిటికల్ ఈగోలు పైచేయి సాధి స్తున్నాయి. ఒకవైపు నీరు లేక వానకాలం సాగుపై రైతులు ఆందోళన చెందుతుంటే, మరోవైపు వేల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టులోని నీరు వఅథాగా సముద్రంలోకి కొట్టుకుపోతోంది. రాజకీయ లబ్ధి కోసం చూస్తున్న పార్టీలు ఇప్పటికైనా పట్టింపులు వీడి రైతాంగాన్ని ఆదుకునేలా శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఏపీకి వరప్రసాదం


తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ కాంగ్రెస్, బీఆర్ ఎస్ మరియు బీజేపీల మధ్య జరుగుతున్న ముక్కోణపు రాజకీయ యుద్ధం పరోక్షంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారీ సాంకేతిక, ఆర్థిక మరియు జల ప్రయోజ నాలను చేకూరుస్తోంది. తెలంగాణ నేతలు ఒకరిపై ఒకరు బురద చల్లుకుం టూ కాలయాపన చేస్తుంటే, ఆ పరిస్థితి ఏపీకి వరంగా మారిందనే చెప్పాలి. కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా తెలంగాణ నీటిని ఎత్తిపోయకపోవడం వల్ల, ప్రాణహిత మరియు గోదావరి నది నుంచి వస్తున్న లక్షల క్యూసెక్కుల వరద నీరు తెలంగాణ వాడుకోకుండా నేరుగా దిగువకు ప్రవహిస్తోంది. ఈ నీరంతా నేరుగా ఏపీ పరిధిలోని దవళేశ్వరం బ్యారేజీకి, అలాగే నిర్మాణంలో ఉన్నపోలవరం ప్రాజెక్టు జలాశయానికి ఉచితంగా చేరుతోంది. బీఆర్ఎస్ నేత హరీష్‌రావు ఇటీవల ఆరోపించినట్లు.. "తెలంగాణ నీటిని వదిలేస్తూ సీఎం రేవంత్ రెడ్డి ఏపీ సీఎం చంద్రబాబు నా యుడికి 'గురుదక్షిణ' సమర్పిస్తున్నారనే" విమర్శలకు ఈ జలాల విడుదలే ప్రధాన కారణం. గతంలో కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరాన్ని రికార్డు సమ యంలో పూర్తి చేసి, గోదావరిపై తమకు ఉన్న హక్కులను గట్టిగా వినిపించేది. అదే సమయంలో ఏపీలో పోలవరం ప్రాజెక్టు ఆలస్యం కావడంపై జాతీయ స్థాయిలో విమర్శలు వచ్చేవి. ఇప్పుడు తెలంగాణ లోని మూడు పార్టీలు కాళేశ్వరం డిజైన్ లోపాలు, అవినీతి, 'మ్యాన్-మేడ్ డిజాస్టర్' అంటూ అంతర్జాతీయ స్థాయిలో ప్రాజెక్టు ప్రతిష్టను దిగజార్చుతు న్నాయి. దీనివల్ల కేంద్ర జలశక్తి శాఖ మరియు జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) దఅష్టి పూర్తిగా కాళేశ్వరంపైనే పడింది. ఫలితంగా, పోలవరం ప్రాజెక్టులోజరిగిన సాంకేతిక లోపాలు లేదా ఆలస్యంపై జాతీయ మీడియా మరియు కేంద్ర సంస్థల నుంచిఏపీ ప్రభుత్వంపై ఒత్తిడి గణనీయంగా తగ్గింది. కేంద్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో ఏపీ అధికార పార్టీ (టీడీపీ) కీలక భాగస్వామిగా ఉన్న తరుణంలో ఈ వివాదం ఏపీకి మరింత కలిసివచ్చింది. తెలంగాణలోని బీజేపీ నేతలు కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరిపించాలని, అవినీతి జరిగిందని కేంద్రానికి నివేదిస్తున్నారు. ఒక ప్రాజెక్టు అవినీతి కూపంగా మారినప్పుడు దానికి కేం ద్రం "జాతీయ హోదా" లేదా అదనపు నిధులు ఇవ్వడం అసాధ్యం. ఈ గ్యాప్‌ను వాడుకుని ఏపీ ప్రభుత్వం తన పోలవరం లెఫ్ట్ కెనాల్ మరియు ఇతర అనుబంధ పనుల కోసం కేంద్రం నుంచి సులభంగా నిధులు, అనుమతులు మంజూరు చేయించుకుం టోంది. "మాకు నీటి అవసరం ఎక్కువ ఉంది, మేము రీ-ఇంజనీరింగ్ ద్వారా భారీగా నీటిని వాడుకోగలము" అని తెలంగాణ గతంలో వాదించేది. కానీ ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వమే అధికారికంగా "కాళేశ్వరం డిజైన్ లోపభూయిష్టం, ఫౌండేషన్లు సరిగ్గా లేవు, నీటిని నిల్వ చేయలేము" అని ఒప్పుకుంటోంది. ఈ అధికారిక లీకేజీలు, అంతర్గత కుమ్ములాటలు ట్రిబ్యునల్ ముందు ఏపీ లాయర్లకు బలమైన అస్త్రాలుగామారాయి. తెలంగాణ తన సొంత ప్రాజెక్టులనే సరిగ్గా నిర్వహించుకోలేకపోతోందనే వాదనను ఏపీ లీగల్ టీమ్ సులభంగా వినిపించగలుగుతోంది. తెలంగాణలోని మూడు పార్టీల (కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ) పొలిటికల్ ఈగోలు మరియు రిపేర్ రాజకీయాల వల్ల తెలంగాణ రైతాంగం వనకాలం సాగునీరు లేక ఎండి పోతుంటే... దిగువన ఉన్న ఆంధ్రప్రదేశ్ మాత్రం ఎలాంటి కష్టం లేకుండా గోదావరి వరద నీటిని, జాతీయ స్థాయి రాజకీయ సదుపాయాన్ని ఎంజాయ్ చేస్తోంది. "ఇద్దరు కొట్టుకుంటే మూడో వాడికి లాభం" అనే సామెత కాళేశ్వరం విషయంలో అక్షరాలా ఏపీకి అన్వయించవచ్చు



22ND ANNIVERSARY

# నేటిధాత్రి ®

తెలుగు వార్త పత్రిక



ఆదివారం 26-07-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 110 రూ॥ 6.00






చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888

# దీక్ష..త్యాగం నిరతికి పరీక్ష!

# ఆమరణ దీక్ష ప్రాణానికే శిక్ష!!

- హేళన చేయడం గొప్ప కాదు.
- ఒక్క పూట ఉపవాసమంటేనే ఉలిక్కిపడతాం.
- మధ్యాహ్నం వరకే ఆకలి తట్టుకోలేం.
- దీక్ష చేసేవారికి తెలుస్తుంది ఆ కష్టం.

- నిరసన అంటే మాటలు కాదు..
- శరీరం ఒక్క సారి కుసించుకుపోతే జీవితాంతం నరకం.
- అయినా తెగించి దీక్ష చేయడం గొప్ప త్యాగ నిరతికి సంకేతం.
- నిరాహార దీక్ష అంటే ముచ్చట కాదు.
- దీక్ష చేయడానికి ఎంతో దైర్యం వుండాలి.
- దీక్షల్లో కూర్చోవాలంటే దమ్ముండాలి.
- ప్రాణం పోయినా పరవాలేదు అని తెగింపు వుండాలి.
- దీక్షలను చిన్నవిగా అవమానించకండి.
- దీక్షలు చేసే వారిని హేళన చేయకండి.
- దీక్ష అంటేే భయం లేని ఆత్మ స్థైర్యం కావాలి.

- దేశం కోసం జైలులో కూడా ఆనాడు మహాత్మా గాంధీ దీక్ష చేశారు.
- తెలంగాణ కోసం కెసిఆర్ 9 రోజులు దీక్ష చేపట్టారు.
- ఇప్పుడు వాంచుంగు 23 రోజులు దీక్ష చేపట్టారు.

## దీక్ష చేసిన వాళ్లు చరిత్ర కారులు.

- చరిత్ర ను మార్చే త్యాగ ధనులు.
- తెలిసీ తెలియక దీక్షలను నిందించొద్దు.
- జనం కోసం నాయకులు చేసిన చరిత్ర ను విస్మరించొద్దు.
- దీక్షలు సామాన్యుల వల్ల కాదు..కారణ జన్ములే చేయగలరు.
- సమాజం తలరాత వాళ్లే మార్చుతారు.

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి,చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

హైదరాబాద్, నేటిధాత్రి:

ఉద్యమంటే ఉత్త ముచ్చట కాదు. పోరాటమంటే సోది చెప్పినంత సులువు కాదు. అది సామాజిక స్పృహ వున్నవారితోనే సాధ్యం. అది ప్రపంచంలో చాలా మందిలో వుంటుంది. కాని దీక్షలు చేయాలంటే తెగింపు వుండాలి. సమాజం కోసం ఆత్మత్యాగం చేసేంత గొప్ప గుణం వుండాలి. ఉద్యమాలను, పోరాటాలను చాల చిన్న చూపుగా చూసే సమాజం కూడా మన చుట్టే వుంటుంది. మాటలు చెప్పి బతికే వాళ్లకు దీక్షల విలువ, పోరాటాల విలువ తెలియదు. ఇతరులు కళ్లతో చూసేంత చిన్నది ఉద్యమం కాదు. అందుకు ఉద్యమాలు చేసే వాళ్లు సామాన్యులు కాదు. వారికి కూడా వ్యక్తిగత ప్రయోజనాలు కూడా వుండొచ్చు. అంత మాత్రాన స్వార్ధపరులు అని కూడా పోరాటాలు చేసే వాళ్లను అనలేం..అనకూడదు. ఉద్యమ కారుల్లో వుండే సామాజిక స్పృహ అందరిలో వుండదు. సమాజంలో జరిగే అన్యాయాలను అందరూ ప్రశ్నించలేదు. వ్యక్తిగతంగా ఎదురయ్యే సమస్యల మీద మాట్లాడేవారు వేరు. వ్యక్తిగత ఇబ్బందుల పడిన చేసే పోరాటం వేరు. కాని సమాజం కోసం, వ్యవస్థ కోసం చేసే పోరాటం వేరు. అందువల్ల సమాజం కోసం జరిగే ఏ పోరాటాన్ని తప్పు పట్టొద్దు. మనకు చేతనైతే వారికి తోడుగా నిలవాలి. సమాజిక బాధ్యతలో పాలు పంచుకోవాలి. అంతే తప్ప పోరాటాలను హేళన చేయెద్దు. ఎందుకంటే ఇంటి నుంచి కదల్లేని వాళ్లు కూడా ఉద్యమాల మీద నిందలు వేస్తుంటారు. సోషల్ మీడియా వచ్చిన తర్వాత ఉద్యమాలు చేసే వారు తక్కువయ్యారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి తన అభిప్రాయల్లో నీచ బుద్ది చూపించుకునేవారు కొందరు తయారయ్యారు. ఈ మధ్య జెన్‌జీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా వాన్‌చుక్ చేసిన దీక్షను కూడా హేళన చాల మంది హేళన చేశారు. రాజకీయపరంగా ఆయనపై రకరకాల అభిప్రాయాలు వ్యక్తం చేశారు. దీక్ష చేయడం అంటే ప్రాణాన్ని ఫణంగా పెట్టడమే అవుతుంది. అలాంటి దీక్షల్లో సహజంగా మరణించిన వారున్నారు. దీక్షలోనే ప్రత్యర్ధుల మూలంగా ప్రాణాలు వదిలిన వాళ్లున్నారు. వంగవీటి మోహన రంగా దీక్షలోనే ప్రత్యర్ధుల చేతిలో మరణించారు. పొట్టి శ్రీరాములు ఆంధ్రా రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణ త్యాగం చేశారు. అందువల్ల దీక్షలను ఎప్పుడూ చులకన భావం వద్దు. దీక్షలు చేయడం అంటే ప్రాణం మీద ఆశ వదులుకొని మొదలు పెట్టడమే అవుతుంది. పిరికి వాళ్లు మాటలు చెబుతారు. ధైర్యం కొన్ని కోట్ల రెట్లు వున్నవాళ్లే దీక్షలు చేస్తారు. దీక్ష అనేది త్యాగనిరతికి పరీక్ష అని చెప్పక తప్పదు. ఆమరణ దీక్ష అంటే ఒక రకంగా తనకు తానుగా తన శరీరాన్ని శిక్షించుకోవడం. ప్రజలకోసం, సమాజం కోసం ఒక వ్యక్తి నిలబడి, తనను తాను ఆత్మత్యాగం చేసుకోవడమే దీక్ష అంటారు. ఎవరూ అలా దీక్షలో ప్రాణాలు కోల్పోవాలని అనుకోరు. పాలకులు కూడా దీక్షలు చేసే వారి ప్రాణాలు పోవాలని చూడరు. ఈ మధ్య సుమారు 22 రోజుల పాటు జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేసిన వాన్‌చుక్ 23వ రోజు ప్రభుత్వం ఆయన ఆసుపత్రిలో చేర్చారు. అప్పటికే ఆయన పదిహేను కిలలో వరకు బరువు తగ్గిపోయారు. అందుకే ఆయన ప్రాణం ప్రభుత్వం నిలబెట్టింది. ఏ వ్యక్తి అయినా సరే 23రోజులకు పైగా దీక్ష చేశారంటే వారు ప్రాణాలతో బతకడం కష్టం. అందుకే ఏ ఉద్యమకారుడైనా సరే దీక్ష చేస్తే మూడు వారాలకన్నా ఎక్కువగా దీక్ష చేయనివ్వరు. మొదటి వారం రోజుల్లో శరీరంలోవుండే శక్తి అంతా తగ్గిపోతుంది. శరీరం తనలో వున్న కొవ్వును కరిగించుకొని వారం బతుకుతుంది. తర్వాత వారంలో శరీరంలో వున్న అవయవాల నుంచి శక్తిని తీసుకునే ప్రయత్నం జరుగుతుంది. అలా కీలకమైన అవయవాలు పని చేయడం తగ్గిపోతాయి. రక్తం తగ్గిపోతుంది. సోడియం, పొటాషియం లెవల్స్ పూర్తిగా పడిపోతాయి. బిపి చాలా వరకు తగ్గిపోతుంది. గుండె బలహీనమైపోతుంది. కిడ్నీలు డ్యామేజ్ అవుతాయి. ఆఖరుకు మెదడు కూడ చెడిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. రెండు వారాలకు పైగా ఒక వ్యక్తి దీక్షలో వున్నాడంటే, గట్టిగా ఊపిరి తీసుకున్నా ప్రాణం పోతుంది. ఇంతటి క్లిష్టపరిస్థితులను తట్టుకొని ప్రజల కోసం ప్రాణం ఫణంగా పెట్టే వాళ్లను హేళన చేస్తుంటారు. నీళ్లు తాగుతున్నారంటారు. ఫ్లూయిడ్స్ తీసుకుంటారంటారు. అలా వారి గురించి తప్పుడు ప్రచారం చేయడం మానవత్వం లేని వారి కింద లెక్క. పైగా పైశాచిక ఆనందం పొందాలనుకునేవారు మాత్రమే ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తుంటారు. సహజంగా మనం రోజులో ఒక్క పూట తిండి తినకపోతేనే గాబరా పడతాం. ఆగమాగమౌతుందంటాం. ఒక్క రోజు తిండిలేక, నిద్రలేకపోతే మరునాడు ఆయాసపడుతుంటాం. అలాంటిది రోజుల తరబడి దీక్షలు చేసేవారిని ఎవరూ హేళనగా మాట్లాడొద్దు. వారిని తూలనాడొద్దు. దేశ స్వాతంత్ర్యంకోసం మహాత్మా గాంధీ చేసినన్ని సార్లు ఎవరూ దీక్షలు చేయలేదు. రైతులకోసం, రకకాల సమస్యల పరిష్కారం కోసం, ఆఖరుకు జైలులో వుండి కూడా దీక్షలు చేశారు. ఆమరణ నిరసనలు సాగించి, దేశ స్వాతంత్ర్యం సంపాదించారు. ఇప్పుడు అలాంటి మహానుభావుడినే తిడుతున్నారు. ఒక రకంగా పాపం మూటగట్టుకుంటున్నారు. సరిగ్గా తెలంగాణ తెచ్చిన కేసిఆర్‌ను కూడా కొంత మంది ఇలాగే తూలనాడుతున్నారు. తెలంగాణ కోసం 1956 నుంచి 2014 వరకు రకరకాల ఉద్యమాలు సాగాయి. పోరాటాలు సాగాయి. పోలీసుల కాల్పులు జరిగాయి. కాని ఏ ఒక్క నాయకుడు ఆమరణ దీక్ష చేయలేదు. చరిత్ర మొత్తం తిరిగేస్తే ఒక్క కేసిఆర్ మాత్రమే కనిపిస్తాడు. అందువల్లనే తెలంగాణ సాధన జరిగింది. అరవై ఏళ్ల పోరాటం తర్వాత తెలంగాణ వచ్చింది. తెలంగాణ తెచ్చిన కేసిఆర్‌ను చరిత్రను చెరిపేయాలని చూసే రాజకీయ ప్రత్యర్ధులు చెప్పే మాటల వల్ల రేపటి తరం కూడా ఆ మాటలే నిజమని నమ్మే ప్రమాదముంది. పదవుల కోసం తెలంగాణ నినాదం ఎత్తుకున్నవాళ్లే ఆ సమయంలో ఎక్కువ. చెన్నారెడ్డి అయినా, చిన్నా రెడ్డి అయినా సరే పదవుల కోసం ఆశపడిన వారే. పదవులు ఇస్తామని చెప్పడంతో ఉద్యమాన్ని వదిలేసిన వాళ్లే. అయితే వాళ్లను కూడా తప్పు పట్టాల్సిన అవసరం లేదు. జనం వాళ్లకు కలిసి వచ్చినా, రాజకీయ స్వార్ధం కోసం ఉద్యమాన్ని తాటట్టు పెట్టారు. అలాంటి నాయకులు ఏనాడు ఆమరణ దీక్ష చేపట్టలేదు. తెలంగాణ వచ్చే దాకా తెలంగాణ ఉద్యమాన్ని వారి భుజాల మీద మోయలేదు. తెలంగాణ చరిత్ర మొత్తం తిరగేసి చూసినా, ఉద్యమ కారుల్లో పెద్ద ఉద్యమకారుడు, పోరాట వీరుల్లో యోధుడు, దీక్షలో ఏకైక నాయకుడు కనిపించేది కేసిఆర్ మాత్రమే. అందుకే కేంద్రం కూడా దిగి వచ్చింది. తెలంగాణ వ్యతిరేతకులు కేసిఆర్ దీక్షను ఆనాడు హేళన చేశారు. ఇప్పటికీ హేళన చేస్తూనే వున్నారు. వారి రాజకీయ పబ్బం గుడుపుకుంటున్నారు. అలా తెలంగాణకు అన్యాయం చేసింది తెలంగాణ ప్రాంతం వాళ్లే కావడం గమనార్హం. జై తెలంగాణ అని ఏ ఒక్కనాడు నినదించని వాళ్లు కూడా తెలంగాణ ఉద్యమ కారులను తిట్టిపోస్తుంటారు. తెలంగాణ రావడం వల్లనే వారికి పదవులు వచ్చినా, కేసిఆర్‌నే తిట్టిపోస్తుంటారు. ఆ నాటి నుంచి నేటి వరకు కేసిఆర్ చావును కోరుకుంటారు. కేసిఆరే స్వయంగా తెలంగాణ వచ్చుడో..కేసిఆర్ చచ్చుడో అని ఆయనే చెప్పుకున్నారు. అలాంటి కారణ జన్ముడు కేసిఆర్‌ని తిడుతూ పైశాచికానందం పొందుతుంటారు. ఎందుకంటే కేసిఆర్ వున్నంత వారిని ప్రజలు గుర్తించరు. కేసిఆర్ అనే టవర్ ముందు ఏ నాయకుడు నిలబడలేడు. పైగా బానిన రాజకీయాలకు అలవాటు పడిన వాళ్లు, స్వరాష్ట్రాన్ని జీర్ణించుకోలేరు. అందువల్ల కేసిఆర్‌ను తిట్టి వాళ్ల అక్కసును వెళ్లగుక్కుకుంటారు. అలాంటి త్యాగ మూర్తులు తిట్టడం వల్ల తాత్కాలిక ప్రయోజనాలు పొందుతారేమో కాని, చరిత్ర హీనులుగా మిగిలిపోతారు. అందుకే పోరాట యోధులను కలలో కూడా తక్కువ చేయొద్దు. త్యాగ ధనులను కలలో కూడా నిందించొద్దు. కేసిఆర్ లాంటి వాళ్లను నిత్యం కొలువలేకపోయినా తెలంగాణను గుర్తు చేసుకుంటే చాలు. అది కేసిఆర్‌ను పదివేల సార్లు గుర్తు చేసుకున్నట్లు.






నిష్పక్షపాత నిర్భయ నిరంతరం

22nd ANNIVERSARY

# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక



ఆదివారం 26-07-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 110 రూ॥ 6.00




## జంతర్‌మంతర్ ఆందోళన విరమణ

- కేంద్రంతో చర్చలు సఫలం.. కేసుల ఎత్తివేతకు అంగీకారం
- నీట్ బాధిత కుటుంబాలకు పరిహారంపై సానుకూల స్పందన

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
జంతర్‌మంతర్‌లో సీజేపీ చేపట్టిన విద్యార్థుల ఆందోళనకు తెరపడింది. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లతో జరిగిన చర్చలు సఫలం కావడంతో నిరసనలను విరమిస్తున్నట్లు సీజేపీ ప్రకటించింది. విద్యార్థులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవడంతో పాటు భవిష్యత్‌లో కేసులతో వేధించబోమని కేంద్రం హామీ ఇచ్చినట్లు తెలిపింది. నీట్ బాధిత కుటుంబాలకు రూ. 1 కోటి పరిహారం, విద్యా వ్యవస్థలో సంస్కరణలపై కూడా కేంద్రం సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించింది.

## ప్రజాస్వామ్య విజయమే: వాంగ్‌చుక్



న్యూఢిల్లీ, నేటిధాత్రి:
కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ హర్షం వ్యక్తం చేశారు. ఇది యువత పట్టుదల, ప్రజాస్వామ్యం సాధించిన విజయమని పేర్కొన్నారు. శాంతియుత ఉద్యమంతో మార్పు సాధించిన విద్యార్థులకు, యువతకు అభినందనలు తెలిపారు. ఇకపై ఉద్యమం సంస్కరణల దిశగా సాగాలని ఎక్స్ వేదికగా ఆకాంక్షించారు.

## విద్యార్థులే నిజమైన దేశభక్తులు

### ఉద్యమించిన విద్యార్థులకు హ్యాట్సాఫ్: రాహుల్
### యువత విజయమన్న ప్రియాంక



**న్యూఢిల్లీ, నేటిధాత్రి:**
కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ హర్షం వ్యక్తం చేశారు. "తమ హక్కుల కోసం పోరాడిన విద్యార్థులే నిజమైన దేశభక్తులు" అని రాహుల్ కొనియాడారు. విద్యార్థులపై దాడులకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ప్రధాని బాధిత విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇది దేశ యువత సాధించిన విజయమని ప్రియాంక గాంధీ పేర్కొంటూ, విద్యా వ్యవస్థలో పారదర్శక సంస్కరణలు చేపట్టాలని కేంద్రాన్ని కోరారు.

## ధర్మేంద్ర రాజీనామాతో జంతర్‌మంతర్‌లో ఉద్రిక్తత

### పోలీసులపై రాళ్లదాడి.. ఇద్దరికి గాయాలు
### సంబరాల్లో విద్యార్థులు



న్యూఢిల్లీ, నేటిధాత్రి:
కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రకటించగానే జంతర్‌మంతర్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. కొందరు నిరసనకారులు పోలీసులపై రాళ్లు రువ్వడంతో ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు భాష్పవాయు గోళాలు ప్రయోగించి, లాఠీచార్జ్ చేశారు. మరోవైపు విద్యార్థులు రాజీనామాను సంబరాలతో స్వాగతించారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేను భుజాలపై మోసుకుంటూ హర్షం వ్యక్తం చేశారు. "ఇది విద్యార్థుల పోరాట విజయం" అని దీప్కే పేర్కొంటూ, నీట్ బాధిత విద్యార్థులకు నివాళిగా రెండు నిమిషాల మౌనం పాటించాలని పిలుపునిచ్చారు.









# విద్యార్థుల విజయం!

## జంతర్‌మంతర్ ఉద్యమానికి తొలి ఫలితం

## నీట్ ఉద్యమ ఒత్తిడికి కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

- విద్యార్థుల్లో సంబరాలు
- మిగిలిన డిమాండ్ల సాధనే లక్ష్యమంటున్న సీజేపీ
- దేశవ్యాప్తంగా విద్యా సంస్కరణలపై చర్చకు తెర



- నేటితరం యువత ఆలోచనాపరులు
- వారిని అర్థం చేసుకుని ప్రేమగా చర్చించాలి
- ఆదేశాలతో కాదు.. అర్థవంతమైన చర్చలతో సాగాలి
- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ సంచలన వ్యాఖ్యలు



- ధర్మేంద్ర ప్రధాన్ శాఖ మార్పొచ్చు
- కేంద్రం పరిశీలిస్తోందన్న రాహుల్



- ఇది ముమ్మాటికీ విద్యార్థుల విజయం
- గాంధీ నుంచే తాము శాంతిని నేర్చుకున్నాం
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై అభిజిత్ దీప్కే

- నీట్ ఉద్యమ ఒత్తిడికి కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా
- జంతర్‌మంతర్‌లో విద్యార్థుల సంబరాలు.. కొవ్వొత్తుల ర్యాలీకి పిలుపు
- "ఇది ప్రజాస్వామ్య విజయమే" అంటూ అభిజిత్ దీప్కే వ్యాఖ్యలు
- యువతను ప్రేమతో అర్థం చేసుకోవాలన్న మోహన్ భగవత్
- మిగిలిన డిమాండ్లపై కేంద్ర నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ వ్యవహారం, దానికి వ్యతిరేకంగా నెల రోజులుగా కొనసాగుతున్న విద్యార్థుల ఆందోళనలు కీలక మలుపు తిరిగాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసినట్లు ప్రకటించడంతో దేశ రాజకీయాల్లోనే కాకుండా విద్యా రంగంలోనూ పెద్ద చర్చకు తెరలేచింది. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వేదికగా కొనసాగుతున్న ఉద్యమంలో పాల్గొన్న వేలాది మంది విద్యార్థులు రాజీనామా వార్త తెలిసిన వెంటనే సంబరాలు చేసుకున్నారు. ఈ పరిణామాన్ని సీజేపీ "ముమ్మాటికీ విద్యార్థుల విజయం"గా అభివర్ణించింది. శాంతియుత పోరాటం ఎప్పటికైనా ఫలిస్తుందనే విషయానికి ఇది నిదర్శనమని పార్టీ నాయకత్వం పేర్కొంది.

### గాంధీ మార్గంలోనే పోరాటం.. ఫలితమే ఈ విజయం

సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే స్పందిస్తూ, తాము గాంధీజీ చూపిన శాంతియుత ఉద్యమ మార్గాన్నే అనుసరించామని చెప్పారు. హింసకు దూరంగా, ప్రజాస్వామ్య పద్ధతుల్లో సాగిన ఉద్యమం ఫలితంగా ఈ రోజు వచ్చిందని అన్నారు. విద్యార్థులు నెల రోజులుగా చూపిన సహనం, క్రమశిక్షణ, ప్రజాస్వామ్య విశ్వాసమే ప్రభుత్వాన్ని స్పందించేలా చేసిందని పేర్కొన్నారు. ఈ విజయం ఏ రాజకీయ పార్టీది కాదని, దేశంలోని ప్రతి విద్యార్థి సాధించిన విజయమని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల స్వరం ఎంత శక్తివంతమో ఈ పరిణామం మరోసారి నిరూపించిందన్నారు.

### రాజీనామాతో ముగియదు.. ఇంకా రెండు డిమాండ్లు మిగిలే ఉన్నాయి

కేంద్ర మంత్రి రాజీనామాను స్వాగతించినప్పటికీ తమ ఉద్యమం ఇక్కడితో ముగిసిపోదని సీజేపీ స్పష్టం చేసింది. విద్యార్థులపై నమోదు చేసిన కేసులన్నింటినీ పూర్తిగా ఎత్తివేయాలని, ఉద్యమ సమయంలో లాఠీచార్జ్, బలప్రయోగానికి పాల్పడిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని, దేశ విద్యా వ్యవస్థలో సమూల సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేసింది. ఈ మూడు ప్రధాన డిమాండ్లలో ఒకటి మాత్రమే నెరవేరిందని, మిగిలిన రెండు అమలయ్యే వరకు ఉద్యమం కొనసాగుతుందని ప్రకటించింది. సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి దేశవ్యాప్తంగా విద్యార్థుల ఐక్యతను చాటాలని పిలుపునిచ్చింది.

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వెనుక కారణాలివే

ప్రధాని నరేంద్ర మోదీకి పంపిన రాజీనామా లేఖలో ధర్మేంద్ర ప్రధాన్ తన నిర్ణయానికి గల కారణాలను వివరించారు. నీట్ పరీక్షలో అవకతవకలు వెలుగులోకి వచ్చిన వెంటనే కేంద్ర ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించిందని, పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించడంతో పాటు భవిష్యత్తులో కంప్యూటర్ ఆధారిత పరీక్షల దిశగా నిర్ణయాలు తీసుకున్నామని గుర్తుచేశారు. 20 లక్షల మందికి పైగా విద్యార్థుల కోసం మళ్లీ పరీక్షను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. అయినప్పటికీ గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులు, విద్యార్థుల ఆందోళనలు, రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని తాను పదవికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు.
దేశ వ్యతిరేక శక్తులు ప్రస్తుత పరిస్థితులను దుర్వినియోగం చేసుకోకుండా చూడడం, విద్యార్థుల భవిష్యత్తు న్యాయపరమైన చిక్కుల్లో పడకుండా కాపాడడం, వారు మళ్లీ చదువులపై దృష్టి పెట్టే వాతావరణాన్ని కల్పించడమే తన రాజీనామా వెనుక ప్రధాన ఉద్దేశమని లేఖలో వివరించారు. తనపై విశ్వాసం ఉంచిన ప్రధాని మోదీకి, కేంద్ర మంత్రివర్గానికి, విద్యాశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. దేశసేవే తన జీవిత లక్ష్యమని, భవిష్యత్తులో కూడా ప్రజాసేవ కొనసాగుతుందని పేర్కొన్నారు.

### యువతను ఆదేశాలతో కాదు.. చర్చలతో నడిపించాలి: మోహన్ భగవత్

నీట్ ఉద్యమం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన సమయంలో ఆరెస్సెస్ సర్‌సంఘచాలక్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. నేటి యువత ఆలోచనాపరులని, వారు ప్రతి అంశంపై ప్రశ్నలు వేస్తున్నారని అన్నారు. అలాంటి యువతను కేవలం ఆదేశాలతో నడిపించడం సాధ్యం కాదని, వారికి కారణాలు వివరించి, ప్రేమతో, చర్చల ద్వారా నమ్మకం కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. కుటుంబాల్లో సంభాషణలు తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయం గడపాలని సూచించారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని భయపడకుండా మానవ శ్రేయస్సు కోసం వినియోగించాలని పిలుపునిచ్చారు.

### రాహుల్ గాంధీ స్పందన.. శాఖ మార్పుతో సరిపోదు


కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ కూడా ఈ పరిణామాలపై స్పందించారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను కేవలం మరో శాఖకు మార్చే ప్రయత్నం చేస్తే దేశ విద్యార్థులు అంగీకరించబోరని హెచ్చరించారు. విద్యార్థుల మూడు ప్రధాన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా అమలు చేయాల్సిందేనని అన్నారు. ఉద్యమాల సందర్భంగా విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్, బలప్రయోగానికి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసిన వ్యవస్థపై సమగ్ర విచారణ జరిపి విద్యా వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

### విద్యార్థుల ఉద్యమం దేశ రాజకీయాలపై ప్రభావం


నీట్ పేపర్ లీక్ వ్యవహారం కేవలం పరీక్షల అంశంగానే కాకుండా దేశ రాజకీయాల్లోనూ కీలక చర్చకు దారి తీసింది. విద్యార్థుల ఉద్యమం, కేంద్ర మంత్రి రాజీనామా, విద్యా సంస్కరణలపై పెరుగుతున్న డిమాండ్లు, రాజకీయ పార్టీల స్పందనలు వరుసగా చోటుచేసుకోవడంతో దేశ దృష్టి మొత్తం విద్యా వ్యవస్థపై కేంద్రీకృతమైంది. ఒకవైపు విద్యార్థులు తమ డిమాండ్లు పూర్తిగా నెరవేరే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ప్రకటిస్తుండగా, మరోవైపు కేంద్ర ప్రభుత్వం తదుపరి ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందన్న ఆసక్తి దేశవ్యాప్తంగా నెలకొంది. విద్యార్థుల భవిష్యత్తు, పరీక్షల పారదర్శకత, విద్యా వ్యవస్థలో సంస్కరణల అంశాలు రానున్న రోజుల్లో జాతీయ రాజకీయాల్లో కీలక చర్చగా మారే అవకాశం కనిపిస్తోంది.

# రౌడీ షీట్... అందరికీ ఒకేలా వర్తిస్తుందా?

- 'కొంతమందికి నిఘా... మరికొందరికి నిర్లక్ష్యమా?
- "రౌడీ షీట్లలోనూ... ప్రత్యేక కేటగిరీ ఉందా?









- చట్టం అమలులో వివక్షకు తావివ్వొద్దు. అందరికీ ఒకే నిబంధనలు అమలు చేయాలి.
- ప్రజల్లో విశ్వాసం పెంచేలా పోలీసులు వ్యవహరించాలి.
- రాజకీయాలకు అతీతంగా చట్టం పనిచేయాలి.
- రౌడీ షీట్ అంటే రౌడీ షీటే... మినహాయింపు కాదు.
- ఒకే చట్టం... ఒకే అమలు... అదే న్యాయం.

నేటిధాత్రి, వరంగల్ :
రౌడీ షీట్‌లో పేరు ఉండటం అంటే పోలీసుల పర్యవేక్షణలో ఉన్నట్టే. అలాంటి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించడం, అవసరమైనప్పుడు హాజరు నమోదు చేయించడం పోలీసు వ్యవస్థలో భాగం. అయితే ఈ నిబంధనలు ప్రతి రౌడీ షీటర్‌కు ఒకే విధంగా అమలవుతున్నాయా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కొందరిపై నిరంతర నిఘా కొనసాగుతుండగా, మరికొందరి విషయంలో అదే స్థాయి పర్యవేక్షణ కనిపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చట్టం ముందు అందరూ సమానమే అయితే... రౌడీ షీట్ ఉన్న ప్రతి వ్యక్తికీ ఒకే ప్రమాణాలు వర్తించాలి. వ్యక్తి ఎవరు? ఏ వర్గానికి చెందినవారు? ఏ సంస్థలో లేదా ఏ రాజకీయ పార్టీలో ఉన్నారు? అన్నది కాకుండా, చట్టం ఒకే విధంగా అమలవ్వాలి. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నూతన పోలీసు కమిషనర్ ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, రౌడీ షీటర్ల పర్యవేక్షణలో ఒకే విధమైన ప్రమాణాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.
ఒకే చట్టం... ఒకే నిబంధనలు... ఒకే అమలు ఉంటేనే పోలీసు వ్యవస్థపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## "టాస్క్" లు లేని "టాస్క్ ఫోర్స్"...
### పూర్తి వివరాలు మీ "నేటిధాత్రి" లో...



## విద్యార్థుల పోరాటానికి కాంగ్రెస్ అండ

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నేపథ్యంలో అభిజిత్ దీప్కేకు రాజ్యాంగం అందజేసిన డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ

- జంతర్‌మంతర్‌లో విద్యార్థి ఉద్యమానికి సంఘీభావం
- కాంగ్రెస్ అండగా ఉంటుందని హామీ
- దేశవ్యాప్తంగా యువత ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని పిలుపు

12 లో




నిష్పక్షపాత వార్తల నిజరూపం

# నేటిధాత్రి

తెలుగు వార్త పత్రిక

22ND ANNIVERSARY



ఆదివారం 26-07-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 110 రూ॥ 6.00


22th ANNIVERSARY 2004-2025 వసంతాల అక్షరోద్యమం

నిష్పక్షపాత వార్తల నిజరూపం

నేటిధాత్రి

22ND ANNIVERSARY

# 22వ వసంతపు తోరణం

## చరిత్రను చెప్పాలన్నా , ఆ చరిత్రను నిక్షిప్తం చేయాలన్నా కావాల్సింది “అక్షరం”

“నేటిధాత్రి” అక్షర ప్రయాణంలో “21 మైలు రాళ్లు ” దాటుకొని ముందుకు సాగుతూ , తెలుగు రాష్ట్రాల గుండెను నింపుకొని , తడి ఆరని అక్షరాలు మోసుకుంటూ పత్రికా ప్రయాణం సాగిస్తూ **“22 వ వసంతం”** లోకి దిగ్విజయంగా అడుగిడుతుందని సగర్వంగా చెబుతున్నాము.

## “నేటిధాత్రి” అక్షర ప్రయాణంలో

**మీరు ఇప్పటివరకు అందించిన , అందిస్తున్న సహాయ , సహకారాలు మునుముందు కూడా ఇలాగే కొనసాగాలని మనసూర్తిగా కోరుకుంటూ....**



మీ
కట్టా శివ సుబ్రహ్మణ్యం
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444

22ND ANNIVERSARY
వసంతాల అక్షరోద్యమం



మీ
కట్టా రాఘవేందర్ రావ్
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
9908658888, 8297779999


Corporate Office Address :

Srinivasa Nilayam 3rd Floor UBI Colony Road no: 03
Near TV9 Office Banjara Hills Hyderabad Pin Code : 500034

# చింతలపేట హత్య బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

**బాధిత కుటుంబానికి ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం పరిహారం, అన్ని ప్రభుత్వ సహాయాలు అందించాలి...**

**నిందితులకు జీవిత ఖైదు పడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ చేపట్టాలి...**



**మెట్‌పల్లి, నేటిధాత్రి:** చింతలపేట గ్రామంలో హత్యకు గురైన బాధితురాలి కుటుంబానికి న్యాయం జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని, నిందితులకు చట్టప్రకారం జీవిత ఖైదు పడేలా అధికారులు సమర్థవంతంగా వ్యవహరించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శనివారం రోజున మెట్‌పల్లి మండలం చింతలపేట గ్రామంలో హత్యకు గురైన కర్రె సునీత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, ఈ హత్య అత్యంత దారుణమైనదని, సభ్య సమాజం మొత్తం ఇటువంటి ఘటనలను ఖండించాలని అన్నారు. పరువు హత్యలు జుగుప్సాకరమైనవని, సమాజంలో ఇటువంటి ఘటనలకు ఏమాత్రం తావు ఉండకూడదని పేర్కొన్నారు. అనంతరం హత్య కేసు దర్యాప్తు పురోగతిపై సంబంధిత పోలీసు, రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసు దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి, ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ చేపట్టి నిందితులకు జీవిత ఖైదు పడేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిందితులు ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోకుండా, వారికి జీవిత ఖైదు పడే వరకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఈ కేసును పర్యవేక్షిస్తుందని స్పష్టం చేశారు. బాధితురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారని, వారి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. కుటుంబానికి ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం ప్రకారం అందాల్సిన పరిహారం, పునరావాసం, ఇతర ప్రభుత్వ సహాయాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో పాటు అవసరమైన అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గత వారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ , సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బాధిత కుటుంబానికి తక్షణ సహాయంగా రూ. 4,12,500/- పరిహారం అందజేశారని తెలిపారు. చార్జిషీట్ దాఖలు చేసిన అనంతరం ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం ప్రకారం మిగిలిన పరిహారం కూడా విడుదల చేయడంతో పాటు బాధితురాలి పిల్లలకు రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగానికి సంబంధించిన నిబంధనల మేరకు సహాయం, ఇందిరమ్మ ఇల్లు, ప్రభుత్వం తరఫున అందాల్సిన ఇతర అన్ని సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం క్షేత్ర పర్యటనలో ఉన్న జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, మెట్ పల్లి లోనీ విధిత్ రెడ్డి గార్డెన్ లో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత, ఆర్.డి.ఓ. నరసింహారావు, డీఎస్పీ రాములు ,ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు, ప్రవీణ్, నీలాదేవి, రాంబాబు, శంకర్, ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజకుమార్, ఈడి ఎస్సీ కార్పొరేషన్ కిషోర్, తాహసిల్దార్ నీతా, స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# వరంగల్ సబ్ డివిజన్ కు ఏసీపీ ఎప్పుడూ

**ఇన్‌చార్జితోనే పాలన పోలీసు సిబ్బంది, ప్రజలకు ఇబ్బందులు..**

**పూర్తిస్థాయి అధికారిని నియమించాలని విజ్ఞప్తి....**

**మూడు నెలలుగా ఖాళీ పోస్టు..**

**వరంగల్, నేటిధాత్రి:**
వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వరంగల్ సబ్‌డివిజన్‌కు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) పోస్టు గత మూడు నెలలుగా ఖాళీగా ఉండడం చర్చనీయాంశంగా మారింది. గతంలో విధులు నిర్వహించిన ఏసీపీ బదిలీపై వెళ్లిన అనంతరం ఇప్పటివరకు ఆ స్థానంలో పూర్తిస్థాయి అధికారిని నియమించకపోవడంతో పరిపాలనా వ్యవహారాలు ఇన్‌చార్జి ఆధారంగానే కొనసాగుతున్నాయి.




ప్రస్తుతం హనుమకొండ ఏసీపీకి వరంగల్ సబ్‌డివిజన్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అయితే రెండు సబ్‌డివిజన్ల బాధ్యతలు ఒకే అధికారిపై ఉండడంతో రోజువారీ పరిపాలన, నేరాల పర్యవేక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం, శాఖ సమన్వయం వంటి అంశాలపై ప్రభావం పడుతున్నట్లు పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.
వరంగల్ నగరంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పలు కీలక కేసుల పర్యవేక్షణ, ప్రత్యేక బందోబస్తు, ప్రజా వినతుల పరిష్కారంలో ఏసీపీ పాత్ర కీలకమని అధికారులు చెబుతున్నారు. పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో కొన్ని ఫైళ్లు, పరిపాలనా నిర్ణయాల్లో ఆలస్యం జరుగుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసు సిబ్బందికి మార్గదర్శకత్వం, ప్రజలకు అందుబాటులో ఉండే ఉన్నతాధికారి అవసరం ఉన్న నేపథ్యంలో వరంగల్ సబ్‌డివిజన్‌కు శాశ్వత ఏసీపీని తక్షణమే నియమించాలని ప్రజలు, పోలీసు వర్గాలు కోరుతున్నాయి. పెరుగుతున్న పరిపాలనా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఈ ఖాళీని వీలైనంత త్వరగా భర్తీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# జన్మదినం ... జనహితానికి అంకితం!



**సేవా సందేశం చాటిన టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు లాయక్ పాషా.....**

**రోగులకు చేయూత.. ప్రకృతికి తోడుగా....**



**వేములవాడ, నేటిధాత్రి:** నేటి సమాజంలో జన్మదినం అంటే కేక్ కటింగ్‌లు, పూల బొకేలు, శుభాకాంక్షల సందడి అనే భావన బలపడుతున్న వేళ... ఆ వేడుకకు సామాజిక బాధ్యతను జోడించి ఆదర్శంగా నిలిచారు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు సయ్యద్ లాయక్ పాషా తన జన్మదినాన్ని వ్యక్తిగత సంబరంగా కాకుండా సేవా దినోత్సవంగా మార్చి, సమాజానికి అవసరమైన రెండు ముఖ్యమైన సందేశాలను ఆచరణలో చూపించారు ఒకటి మానవసేవ...మరొకటి పర్యావరణ పరిరక్షణ.

**రోగుల ముఖాల్లో చిరునవ్వులు......**

వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బాధలో ఉన్న వారికి ఓదార్పు, ఆప్యాయత కూడా ఒక మందులాంటిదేనని నిరూపిస్తూ ప్రతి రోగిని పరామర్శించారు. లాయక్ పాషా చేపట్టిన ఈ సేవా కార్యక్రమం ఆసుపత్రి వాతావరణంలో ఆత్మీయతను నింపింది.



**మొక్క నాటితేనే భవిష్యత్తుకు భరోసా...** అనంతరం జర్నలిస్టు కాలనీలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం చుట్టారు. “వృక్షో రక్షతి రక్షితః” అనే భారతీయ సూక్తిని గుర్తు చేస్తూ, చెట్లను కాపాడితే అవే మానవాళిని కాపాడతాయని పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, అడవుల క్షీణత వంటి సమస్యలను అధిగమించాలంటే ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రతి జన్మదినాన్ని ఒక మొక్కతో ప్రారంభించే సంస్కృతి రావాలని ఆకాంక్షించారు.

**వేడుకల కంటే విలువైన సేవ...** సహచర జర్నలిస్టులు, స్నేహితుల సమక్షంలో అగ్రహారంలోని ‘శ్రీ’ కన్వెన్షన్ ఫంక్షన్ లో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించినప్పటికీ, ఆ వేడుకలకు అసలైన అందాన్ని తీసుకొచ్చింది సేవా కార్యక్రమాలే వ్యక్తిగత ఆనందాన్ని సమాజంతో పంచుకోవడమే నిజమైన వేడుక అనే సందేశాన్ని లాయక్ పాషా తన ఆచరణతో చాటిచెప్పారు.

**జర్నలిస్టు బాధ్యతకు నిలువెత్తు నిదర్శనం...** వార్తలను ప్రజల ముందుకు తీసుకురావడం మాత్రమే కాదు... సమాజంలో మార్పుకు మార్గనిర్దేశం చేయడం కూడా జర్నలిస్టు బాధ్యతేనని లాయక్ పాషా మరోసారి నిరూపించారు. ప్రజా సమస్యలపై కలం పట్టే జర్నలిస్టు, సమాజ హితానికి చేతలు కూడా కలపాలనే సందేశాన్ని ఆయన కార్యక్రమాలు స్పష్టంగా తెలియజేశాయి.

**సేవతో స్ఫూర్తి... సమాజానికి సందేశం...** జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా యువతకు, సామాజిక సంస్థలకు లాయక్ పాషా స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలోని ప్రత్యేక రోజులను సమాజానికి ఉపయోగపడే విధంగా మార్చుకుంటే సామాజిక మార్పు మరింత వేగంగా సాధ్యమవుతుందని ఆయన కార్యక్రమాలు చాటిచెప్పాయి. ఈ కార్యక్రమంలో వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొలిపాక నరసయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ, సీనియర్ పాత్రికేయులు తాహెర్ పాషా, రేగుల రాంప్రసాద్, కార్యవర్గ సభ్యులు, పెద్ద సంఖ్యలో పలువురు జర్నలిస్టులు పాల్గొని లాయక్ పాషాకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థి యువత విజయం!.

**కాంగ్రెస్ సోషల్ మీడియా జిల్లా ఇంచార్జి మక్కెన కార్తీక్.**



**చిట్యాల, నేటిధాత్రి:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాలి దేశవ్యాప్తంగా విద్యార్థుల ఐక్య పోరాటానికి దక్కిన విజయం. ఇది ఒక్క వ్యక్తి రాజీనామా కాదు, విద్యార్థి శక్తి ముందు అహంకార రాజకీయాలు తలవంచిన సందర్భం. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాలి కేంద్ర బీజేపీ ప్రభుత్వం గద్దె దిగడానికి తొలి మెట్టువిద్యార్థుల ఉద్యమం, ప్రతిపక్షాల పోరాటం, ముఖ్యంగా లిలోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నిరంతర ఒత్తిడి కారణంగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. ప్రజాస్వామ్యంలో విద్యార్థుల గొంతును అణచివేయాలని చేసిన ప్రతి ప్రయత్నానికి ఈ పరిణామం గట్టి సమాధానం. విశ్వవిద్యాలయాలపై ఆంక్షలు, విద్యార్థుల నిరసనలను అడ్డుకోవడం, ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడం చివరకు ప్రభుత్వానికే నష్టాన్ని మిగిల్చింది. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడితే దేశ యువత తగిన సమాధానం చెబుతుందని ఈ ఉద్యమం నిరూపించింది.

# విద్యార్థుల నమోదులో రాష్ట్రంలో మంచిర్యాలకు తొలి స్థానం

**కలెక్టర్ కుమార్‌దీపక్**



**మంచిర్యాల, నేటిధాత్రి:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపులో మంచిర్యాల జిల్లా రాష్ట్రంలోనే తొలి స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గత విద్యా సంవత్సరంతో పోలిస్తే జిల్లాలో ఇప్పటికే 2,278 మంది అదనపు విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరడంతో, 10 శాతం అదనపు నమోదు లక్ష్యంలో 95.72 శాతం సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానం దక్కించుకున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ప్రస్తుతం 45,350 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారని, 275 పాఠశాలలు గత ఏడాదికంటే 10 శాతం కంటే ఎక్కువ నమోదును సాధించాయని తెలిపారు.
మందమర్రి,జైపూర్ మండలాలు 100 శాతం లక్ష్యాన్ని చేరుకోగా, ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్య, మెరుగైన మౌలిక వసతులు, నాణ్యమైన బోధన కారణంగా ప్రైవేట్ పాఠశాలల నుంచి కూడా విద్యార్థులు చేరుతున్నారని పేర్కొన్నారు.
తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# పేదల ఆకలి తీర్చేందుకే అన్నదానం: హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్

**ప్రతి శనివారం 3 వేల మందికి ఉచిత భోజనం...**

**క్రమశిక్షణ, పరిశుభ్రతతో నిర్వహణపై స్థానికుల ప్రశంసలు...**




**శేరిలింగంపల్లి, నేటిధాత్రి:** ఆకలితో అలమటిస్తున్న బడుగు, బలహీన వర్గాల ప్రజలు, దినసరి కూలీలు మరియు పాదచారులకు అండగా నిలవడమే ధ్యేయంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్ కుమార్ తెలిపారు. చందానగర్ లోని గంగారం వద్ద హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బృహత్తర అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండ విజయ్ కుమార్ మాట్లాడుతూ... సమాజంలో నిరుపేదల ఆకలి తీర్చడంలో లభించే తృప్తి మరెందులోనూ ఉండదన్నారు. ఇందులో భాగంగానే ప్రతి శనివారం చందానగర్ గంగారంలోని వివిధ షోరూమ్‌లలో పనిచేసే సిబ్బంది, పాదచారులు మరియు నిరుపేదలతో కలిపి సుమారు 3,000 మందికి పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నామని వెల్లడించారు. తగిన నియమ నిబంధనలు పాటిస్తూ, ఎవరికీ అసౌకర్యం కలగకుండా పక్కా ప్రణాళికతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకులను స్థానిక ప్రజలు, వ్యాపారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యులు అన్నె అపర్ణ, అన్నె సందీప్, విష్ణు మూర్తి, రవి, పీటర్, మారం ప్రసాద్, శంకర్, షర్ఫుద్దీన్, విజయ్, ప్రకాష్, దత్తు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కరీమాబాద్‌లో ఘనంగా బీరన్న బోనాలు

**వరంగల్, నేటిధాత్రి:**
వరంగల్ నగరంలోని కరీమాబాద్‌లో బీరన్న బోనాల వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ మేయర్ గుండు సుధారాణి కూడా వేడుకల్లో పాల్గొన్నారు. మంత్రి కొండా సురేఖ సంప్రదాయబద్ధంగా బోనాన్ని తలపై ఎత్తుకుని బీరన్నకు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకల్లో పోతురాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి భక్తులను అలరించాయి. సంప్రదాయ వాయిద్యాల నడుమ ఉత్సాహంగా సాగిన బీరన్న బోనాలు గావు క్రతువుతో ప్రారంభమయ్యాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.





# భూపాలపల్లి బీరప్ప బోనాలలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎస్ఆర్



**భూపాలపల్లి, నేటిధాత్రి:**
శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన బీరన్న బోనాల మహోత్సవంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు.
గొల్ల,కురుమ సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన బీరన్న బోనాల ఊరేగింపులో ఎమ్మెల్యే పాల్గొని భక్తులతో కలిసి బోనం ఎత్తుకొని కొంత దూరం ర్యాలీగా నడిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీరన్న స్వామి గొల్ల,కురుమల ఆరాధ్య దైవమని, తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఇలాంటి ఆధ్యాత్మిక, సాంస్కృతిక వేడుకలు సమాజంలో ఐకమత్యాన్ని పెంపొందించడంతో పాటు యువతకు మన సంప్రదాయాల గొప్పతనాన్ని తెలియజేస్తాయని పేర్కొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని బీరన్న స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బట్టు కర్ణాకర్ భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్ వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్ గొల్ల కురుమ అధ్యక్షుడు కుమార్ ప్రజాప్రతినిధులు, సంఘ నాయకులు,భక్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నల్లబెల్లికి విద్యుత్ సబ్‌స్టేషన్

**త్వరలోనే పనుల ప్రారంభం.. స్థల పరిశీలన పూర్తి**



**టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ అన్నిమల్ల ఆనందం వెల్లడి**

**గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ కృషికి ప్రశంసలు**

వర్ధన్నపేట, నేటిధాత్రి:
వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామంలో ప్రతిష్ఠాత్మకంగా ప్రతిపాదించిన విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు అడుగులు వేగంగా పడుతున్నాయి. శనివారం టీజీఎన్‌పీడీసీఎల్ వరంగల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ అన్నిమల్ల ఆనందం ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ అధికారులు సబ్‌స్టేషన్‌కు ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.
స్థల పరిశీలన అనంతరం ఎస్‌ఈ అన్నిమల్ల ఆనందం మాట్లాడుతూ.. సబ్‌స్టేషన్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించామని, అవసరమైన సాంకేతిక ప్రక్రియలు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. సబ్‌స్టేషన్ ఏర్పాటుతో నల్లబెల్లి గ్రామంతో పాటు పరిసర ప్రాంతాలకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.
గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ మాట్లాడుతూ.. నల్లబెల్లి గ్రామానికి విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు కోసం నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. అధికారులు సానుకూలంగా స్పందించి స్థల పరిశీలన చేపట్టడం సంతోషకరమన్నారు. సబ్‌స్టేషన్ ఏర్పాటు గ్రామాభివృద్ధికి కీలకమని, పనులు త్వరగా ప్రారంభమయ్యేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.
ఈకార్యక్రమంలో టీజీఎన్‌పీడీసీఎల్ డీఈ దానయ్య, ఏడీఈ నటరాజ్, ఏఈ తరుణ్, ఉపసర్పంచ్ మేకల దేవేందర్, లైన్ ఇన్‌స్పెక్టర్ ఐలయ్య, లైన్‌మెన్ లక్ష్మణ్, ప్రవీణ్, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి : డిఎల్పిఓ.



**నడిగూడెం, నేటిధాత్రి:**
గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కోదాడ డివిజనల్ పంచాయతీ అధికారి పార్థసారథి అన్నారు. మండలంలోని నడిగూడెం, నారాయణపురం గ్రామాలను సందర్శించారు.
ఈ సందర్భంగా పంచాయతీలకు సంబంధించిన శానిటేషన్,ఇతర రికార్డులను పరిశీలించారు. నారాయణపురం గ్రామంలో నర్సరీలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాలలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గ్రామాభివృద్ధిలో ప్రజల సహకారం తీసుకోవాలని ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. రికార్డుల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ఆంజనేయులు,పంచాయతీ కార్యదర్శులు యలక ఉమారాణి,ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 1,న (టి పి యు ఎస్) ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ.




**మునగాల, నేటిధాత్రి:** తెలంగాణా ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయ సంఘశీ ఆధ్వర్యంలో ఆగష్టు 1 న నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ (టి పి యు ఎస్) మహా ధర్నా గోడపత్రిక పోస్టర్ ఆవిష్కరణను శనివారం మునగాల మండల పరిధిలోని ఉన్నత పాఠశాల గణపవరం, మునగాల మోడల్ స్కూల్, కస్తూరిభా గాంధీ స్కూల్ వివిధ స్కూల్లలో కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణా ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయ సంఘశీ రాష్ట్ర కన్వీనర్ జమలాపురం రామకృష్ణ సార్, తపస్ రాష్ట్ర బాద్యులు సుందరి శ్రీనివాస్ సార్,పోకల వెంకటేష్ సార్,నాగార్జునపు రాము సార్ పాల్గొనటం జరిగింది ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడిగా జన్నె యుగేందర్ ఏకగ్రీవ ఎన్నిక.



**చిట్యాల, నేటిధాత్రి:** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చిట్యాల మండల అధ్యక్షుడిగా జన్నె యుగేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ నందగిరి రజనీకాంత్ ఆదేశాల మేరకు నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర సహాయ కార్యదర్శి మండల రవీందర్ రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ పైడిపల్లి రమేష్, జిల్లా నాయకులు పున్నం రవి, కత్తి సంపత్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం ఫోరం నిరంతరం పనిచేస్తుందని పేర్కొన్నారు. ఉద్యమ స్ఫూర్తిని భావితరాలకు చాటుతూ ఉద్యమకారులను ఏకం చేసే దిశగా నూతన కమిటీ కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన కమిటీలో గౌరవ అధ్యక్షులుగా సాద మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా కన్నెబోయిన అశోక్, ఉపాధ్యక్షులుగా సంగ రాజేందర్, మర్రి నరేష్, జాలిగపు కృష్ణయ్య, కార్యదర్శులుగా పువ్వాటి హరికృష్ణ, దొడ్డి శంకర్, బయగాని గణపతి, సాదరాజు, గుర్రపు రమేష్, వేముల శ్రీనివాస్, కోశాధికారిగా కంచర్ల కుమారస్వామిని ఎన్నుకున్నారు.



కార్యవర్గ సభ్యులుగా జంబుల చంద్రమౌళి, పల్లె శేఖర్ రెడ్డి, గోల్కొండ చక్రపాణి, మోత్కూరు సంతోష్, బుర్ర రవీందర్, కాట్రేవుల రాజయ్య, చెక్క నర్సయ్యలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు జన్నె యుగేందర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ, చిట్యాల మండలంలోని తెలంగాణ ఉద్యమకారులందరికీ ఉద్యమ అభివందనాలు తెలిపారు. తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ఉద్యమకారుల హక్కుల సాధన, సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు ముకిరాల మధుసూదన్, కంభం క్రాంతి కుమార్ రెడ్డి, ఆరేపల్లి మల్లయ్య, కట్కూరి నరేందర్, కాట్రేవుల కుమార్, ఇజిగిరి ఆనందం, మ్యాదరి రామచందర్, బిళ్ళమట్ల మండల అధ్యక్షుడు బొడ్డు తిరుపతి, బొట్ల రవి, గురుకుంట్ల కిరణ్, మోత్కూరి సంతోష్, గొర్రె సతీష్, రాయిని శ్రీకాంత్, పెండ్లి యాదిరెడ్డి, మూసాపురి రవీందర్, ఉప్పుల కిరణ్, రాజు నాయక్, కోడెల రాజమల్లు, పుప్పులీల తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ జగద్గురు రేవన సిద్దేశ్వర స్వామి ఆలయం లో రుద్రాభిషేకం, కుంకుమార్చన

**జహీరాబాద్, నేటిధాత్రి:** ఝరాసంగం మండలం లోని ఈదులపల్లి గ్రామ శివారులోని ఆషాఢ మాసం సందర్భంగా శ్రీ జగద్గురు రేవన సిద్దేశ్వర స్వామి ఆలయం లో స్వామి వారికి రుద్రాభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. మేదపల్లి బసవరాజ్ దంపతుల చేత ప్రత్యేక రుద్రాభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. ఈ మేరకు వారు భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో ప్రతి అమావాస్య తో పాటు ప్రతి శుక్రవారం అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు శివ నీలమ్మ పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్న కేంద్రప్రభుత్వం

▸▸టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ విమర్శలు...

▸▸రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా నర్సంపేటలో కాంగ్రెస్ ధర్నా....

▸▸మోదీ దిష్టిబొమ్మ దహనం.. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్....

నర్సంపేట, నేటిధాత్రి: కేంద్ర ప్రభుత్వం రోజురోజుకు ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ ప్రతిపక్ష నాయకుల గొంతు కోస్తున్నదని టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ విమర్శలు చేశారు. పేపర్ లీకేజ్ పట్ల విద్యార్థులకు అంగీభవం తెలిపిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ నర్సంపేట పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో





శుక్రవారం భారీ ధర్నా నిర్వహించారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పంబి వంశీకృష్ణ ఆధ్వర్యంలో వరంగల్ కూడలి వద్ద నిరసన చేపట్టి ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పెండెం రామానంద్ మాట్లాడుతూ, నీట్ ప్రశ్నపత్రం లీకేజీతో విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడిందని ఆరోపించారు. వరుసగా జరుగుతున్న ప్రశ్నపత్రాల లీకేజీలకు పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కే ప్రయత్నాలను ప్రజలు సహించరని అన్నారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై ఢిల్లీలో లాఠీచార్జి, రబ్బరు తూటాల ప్రయోగం జరపడం దుర్మార్గమని విమర్శించారు. విద్యార్థులకు అండగా నిలిచిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలపై అక్రమ అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా, నర్సంపేట సొసైటీ చైర్మన్ బొబ్బల రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చింతల సాంబరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి బైరి మురళి, మాజీ ఎంపీటీసీ కాటా ప్రభాకర్, కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సొంత ఖర్చులతో సీసీ రోడ్డు నిర్మాణం..



**ఎమ్మెల్యేకు ఆలయ పూజారుల కృతజ్ఞతలు....**

**రూ.3 లక్షలతో ముత్యాలమ్మ ఆలయం వద్ద అభివృద్ధి పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్....**

**నర్సంపేట, నేటిధాత్రి:** నర్సంపేట పట్టణ ప్రజల సౌకర్యార్థం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి తన సొంత నిధులతో రూ. 3 లక్షల వ్యయంతో వరంగల్ రోడ్డులోని ముత్యాలమ్మ ఆలయం వద్ద సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడంపై ఆలయ పూజారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ వైస్ చైర్మన్ గంధం నరేందర్ తో కలిసి సీసీ రోడ్డు పనులకు ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డికి, పనులు పూర్తయ్యేలా సహకరించిన ఆయన సోదరుడు సూదిని అజయ్ రెడ్డికి ఆలయ పూజారులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణంతో ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తొలగి రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి వెంటనే స్పందిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్న ఎమ్మెల్యే సేవాభావం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో కూడా నర్సంపేట పట్టణంలో ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు మరిన్ని కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట మున్సిపల్ వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా, కౌన్సిలర్లు, పట్టణ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.


# ప్రకృతి ఒడిలో వనంపల్లి..

▸▸చిత్రీకరణకు అనువైన ఆహ్లాదకరమైన ప్రాంతం....

▸▸దర్శకులు, నిర్మాతలు దృష్టి సారించాలని గ్రామస్తుల



**జహీరాబాద్, నేటిధాత్రి;** ఝరాసంగం : మండలంలోని వనంపల్లి గ్రామం ప్రకృతి సోయగాలకు నిలయంగా ఆకట్టుకుంటోంది. ఎత్తైన కొండపై వెలసిన ఈ గ్రామం చుట్టూ విస్తరించిన పచ్చని పంట పొలాలు, చెట్లతో నిండిన ప్రాంతం, సందర్శకులను కనువిందు చేస్తున్నాయి. శివారు ప్రాంతంలో ప్రారంభమై గ్రామ సమీపము నుండి వాగు గలగల పారుతూ వనంపల్లి



ప్రాజెక్టులోకి చేరుకుంటుంది. అక్కడి నుండి మిగులు జలాలు రాయికోడ్ మీదుగా మంజీరా నదిలోకి చేరుకుంటాయి. ఎత్తైన కొండపై ఈ గ్రామం ఉన్నప్పటికీ పైన ఎక్కడ బోర్లు వేసినా పుష్కలంగా నీళ్లు లభించడం ఈ గ్రామస్తులకు వరం. వర్షాకాలంలో ప్రకృతి మరింత సోయగాన్ని సంతరించుకోవడంతో గ్రామ వరిసరాలు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. గ్రామానికి ఎత్తైన ప్రాంతం నుంచి చూస్తే దిగువన విస్తరించిన చెరుకు పొలాలు, పచ్చని వ్యవసాయ భూములు, దట్టమైన చెట్ల సమూహం ఒక అద్భుత దృశ్యాన్ని తలపిస్తాయి. మేఘాలతో నిండిన ఆకాశం, చల్లని గాలులు, సహజసిద్ధమైన పచ్చదనం కలిసి ఈ ప్రాంతాన్ని ప్రకృతి ప్రేమికులకు ప్రత్యేక ఆకర్షణగా నిలబెడుతున్నాయి. వనంపల్లి పరిసర ప్రాంతాలు సినిమాలు, షార్ట్ ఫిల్మ్, వెబ్ సిరీస్ ల చిత్రీకరణకు ఎంతో అనువైన ప్రదేశమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. దూరంగా ప్రశాంతమైన వాతావరణం, సహజసిద్ధమైన అందాలు ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపును తీసుకువస్తున్నాయి. పర్యాటక శాఖ ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించి, కనీస మౌలిక వసతులు కల్పించి ప్రచారం చేపడితే వనంవల్లి పర్యాటక కేంద్రంగా కూడా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో పచ్చదనంతో కళకళలాడుతున్న వనంపల్లి పరిసరాలు సందర్శకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. సినిమాలు,వెబ్ సిరీస్ లు చిత్రీకరించాలి. వనంపల్లి గ్రామం ప్రకృతి అందాలతో అలరారుతోందని వనంపల్లి గ్రామానికి చెందిన యువకుడు మాలి పట్లోళ్ల జగదీశ్వర్ పాటిల్ అభి వర్ణించాడు, చిత్రీకరణ కేంద్రంగా అభివృద్ధి చేస్తే గ్రామానికి ప్రత్యేక గుర్తింపు రావడంతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు.


# నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలే కీలకం



▸▸సర్పంచ్ బొంకురి రవిని సన్మానించిన దామెర ఎస్సై వీరభద్రరావు....

**పరకాల, నేటిధాత్రి:** ప్రజల భద్రత,నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని దామెర ఎస్సై ఇమ్మడి వీరభద్రరావు అన్నారు. శనివారం ల్యాదల్ల గ్రామంలో ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో గ్రామ సర్పంచ్ బొంకురి రవి 27 వేల విలువైన రెండు ట్రిపుల్ లెన్స్ సీసీ కెమెరాలను గ్రామంలో ఏర్పాటు కోసం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొంకురి రవిని ఎస్సై ఇమ్మడి వీరభద్రరావు శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నివారణతో పాటు నేరస్థులను త్వరగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ల్యాదల్ల గ్రామంలో ఇప్పటికే 11 సీసీ కెమెరాలు పనిచేస్తున్నప్పటికీ,ప్రజల భద్రతను మరింత పటిష్ఠం చేయాలనే ఉద్దేశంతో మరో రెండు ఆధునిక ట్రిపుల్ లెన్స్ కెమెరాలను అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి,ప్రజా భద్రత విషయంలో సర్పంచ్ బొంకురి రవి తీసుకుంటున్న చొరవను కొనియాడిన ఎస్సై,ఇతర ప్రజాప్రతినిధులు కూడా ఇలాంటి ప్రజోపయోగ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## 26 న నర్సంపేటలో మెగా రక్తదాన శిబిరం



**స్వచ్ఛంద రక్తదాతలు పాల్గొనాలని నిర్వాహకుల పిలుపు...**

**నర్సంపేట, నేటిధాత్రి:** సంఘమిత్ర యూత్ ఆర్గనైజేషన్ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సంఘమిత్ర యూత్ ఆర్గనైజేషన్, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 26 ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నర్సంపేట పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న పాత ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, 50 కిలోల కంటే ఎక్కువ బరువు ఉన్న ఆరోగ్యవంతులైన మహిళలు, పురుషులు స్వచ్ఛందంగా రక్తదానం చేయవచ్చని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగుల ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు."యువతరమా.. నీ నరాల్లో ప్రవహించే రక్తం మరొకరి గుండెల్లో ఆశను చిగురింపజేస్తుంది" అనే సందేశంతో యువత పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చి ప్రాణదాతలుగా నిలవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. రక్తదానం చేయదలిచిన వారు వరంగల్ పోలీస్ కానిస్టేబుల్, బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు) -- 9490115105, తోట రవి -- 8331933675, చేపూరి ప్రశాంత్ -- 8978530234, గొంగళ్ల అశోక్ -- 9963023009, కొత్తకొండ అరుణ్ కుమార్ -- 9666109108, బొట్టు కమలాకర్ -- 9951751796, ఊరటి రవికుమార్ -- 9885795510లను సంప్రదించాలని కోరారు.

# గూడ్స్ ట్రాలీ బ్యాటరీల ఇద్దరు దొంగలు అరెస్ట్.. ఒకరు పరారీ

**నర్సంపేట, నేటిధాత్రి:** నర్సంపేట పట్టణంలోని పాకాల రోడ్డులో ఉన్న బండల దుకాణం నుంచి ఇటీవల రెండు గూడ్స్ ట్రాలీల బ్యాటరీలను దొంగిలించిన ఇద్దరు దొంగలను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు నర్సంపేట సీఐ శ్రీనివాస్ తెలిపారు. అరెస్టయిన నిందితులు ఎస్‌కే (, నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌జీవో కాలనీకి చెందిన నాయాబ్ రసూల్,వడ్డెర కాలనీకి చెందిన ముద్దంగుల మహేష్, ప్రవీణ్ లు దొంగతనానికి పాల్పడ్డారని అన్నారు. మహబూబాబాద్ రోడ్డులో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒక ఆటోరిక్షాలో ముగ్గురు వ్యక్తులు వస్తుండగా, పోలీసులను గమనించి పారిపోయేందుకు ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు



ఇద్దరిని అదుపులోకి తీసుకోగా, ఒకరు తప్పించుకున్నారు. అదుపులోకి తీసుకున్న ఇద్దరిని విచారించగా, ఆటోరిక్షాలో ఉన్న రెండు బ్యాటరీలు పాకాల రోడ్డులోని బండల దుకాణం నుంచి దొంగిలించినవేనని ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి, దొంగిలించిన రెండు గూడ్స్ ట్రాలీ బ్యాటరీలతో పాటు ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. నిందితులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పరారీలో ఉన్న నిందితుడు ప్రవీణ్ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అరుణ్ కుమార్,సిబ్బంది పాల్గొన్నారు.

# మైసంపల్లిలో గుడుంబా స్థావరంపై పోలీసుల దాడి..

**30 లీటర్ల గుడుంబా, తయారీ సామగ్రి స్వాధీనం.. నిందితురాలిపై కేసు నమోదు....**

**దుగ్గొండి, నేటిధాత్రి:** దుగ్గొండి మండలంలోని మైసంపల్లి గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న గుడుంబా తయారీ స్థావరంపై పోలీసులు శుక్రవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 30 లీటర్ల గుడుంబాతో పాటు తయారీకి ఉపయోగిస్తున్న సామగ్రిని స్వాధీనం చేసుకుని నిందితురాలిపై కేసు నమోదు చేశారు. ఎస్సై రణధీర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పిట్టల సమ్మక్క తన నివాసం వద్ద అక్రమంగా గుడుంబా తయారు చేసి విక్రయిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో ముందస్తు ప్రణాళికతో గ్రామానికి చేరుకున్న పోలీసులు ఇంటిని తనిఖీ చేయగా, 30 లీటర్ల గుడుంబాతో పాటు గుడుంబా తయారీకి ఉపయోగించే బిందెలు, డ్రములు, పొయ్యి సామగ్రి, ఇతర పరికరాలు లభించాయి. వీటిని స్వాధీనం చేసుకుని నిందితురాలిపై



చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. అక్రమ మద్యం తయారీ వల్ల ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఎస్సై రణధీర్ రెడ్డి తెలిపారు. గ్రామాల్లో గుడుంబా తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ మద్యం తయారీ లేదా విక్రయాలపై సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే పోలీసులకు తెలియజేసి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో అక్రమ కార్యకలాపాలను పూర్తిగా అరికట్టేందుకు పోలీసులు నిరంతరం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై రణధీర్ రెడ్డితో పాటు కానిస్టేబుల్ రామకృష్ణ, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పరకాలలో ఏఐటీయూసీ జిల్లా మహాసభ కరపత్రం ఆవిష్కరణ



**పరకాల, నేటిధాత్రి:** ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా 2వ మహాసభ కరపత్రాన్ని శుక్రవారం పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ముందు ఆవిష్కరించారు. ఆగస్టు 5న హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించనున్న జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్ మాట్లాడుతూ కార్మికుల హక్కుల పరిరక్షణ, కనీస వేతనాల అమలు, సామాజిక భద్రత, అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమమే మహాసభ ప్రధాన అజెండా అని తెలిపారు. ఆటో కార్మికులు,హమాలీలు,భవన నిర్మాణ కార్మికులు,రైతులు,వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు బత్తిని సదానందం,ధర్ముల రామ్మూర్తి,ప్రజానాట్యమండలి నాయకులు కొట్టేపాక రవి,పరకాల వ్యవసాయ మార్కెట్ హమాలీ కార్మిక సంఘం అధ్యక్షులు లంకదాసరి అశోక్,అనుబంధ కార్మిక సంఘాల ప్రతినిధులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదల గుడిసెలపై బుల్డోజర్ల దాడి, మాజీ ఎమ్మెల్యే భోపాల్ రెడ్డి నిరసన...

**జహీరాబాద్, నేటిధాత్రి:** తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా, మనూర్ మండలం, బల్లాపూర్ గ్రామంలో పేదలు నిర్మించుకున్న గుడిసెలను అధికారులు బుల్డోజర్లతో కూల్చివేశారని ఆరోపణలు రావడంతో, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ భూమిని పేదలకు లీజుకు కేటాయించారని ఆరోపణలు ఉన్నాయి. లీజు పొందిన తర్వాత, పేద కుటుంబాలు అక్కడ గుడిసెలు కట్టుకుని చిన్న వ్యాపారాలు ప్రారంభించి, వాటి ద్వారా తమ కుటుంబాలను పోషించుకునేవారు.



# ప్రతి ఇంటికి మంచి నీరు...

**బోరేగావ్ గ్రామ సర్పంచ్ నాగేందర్ పటేల్ పటేల్....**

**జహీరాబాద్, నేటిధాత్రి;** ఝరాసంగం : మిషన్ భగీరత ద్వారా ప్రతి ఇంటికి ప్రభుత్వం మంచి నీరు అందిస్తుందని, నీటిని వృథా చేయకుండా ఉపయోగించుకోవాలని ఝరాసంగం మండల బోరేగావ్ గ్రామ సర్పంచ్ నాగేందర్ పటేల్ పటేల్ అన్నారు. హర్ ఘర్ జల్ కార్యక్రమాన్ని ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులు శనివారం బోరేగావ్ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మంచి నీటి ఉపయోగం,వాటి సద్వినియోగం పై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మట్టి కుండలో నీళ్లునింప్ అవగాహనా కల్పించారు. మంచి నీటి తయారు, నీటి ఉపయోగం గురించి మ్యాప్ చూపిస్తూ ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగేందర్ పటేల్




పటేల్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మంచి నీటి సమస్య తలెత్తకుండా ప్రతి రోజు సరఫరా చేస్తున్నామన్నారు. ప్రతి ఇంటికి మంచి నీటి తో పాటు మినరల్ వాటర్ అందిస్తున్నామన్నారు. వర్షాకాలం లో నీరు కలిసితం అయ్యే అవకాశం ఉంటుందని అలాంటి సందర్భంలో నీటిని వేడి చేసి చల్లార్చి త్రాగాలని అన్నారు. అనంతరం ఆర్.డబ్ల్యూ ఎస్ అధికారులకు, సిబ్బంది కి సర్పంచ్ సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పేపర్ లీక్‌లకు కళ్లెం వేయండి - బీఈడీ నిరుద్యోగి డిమాండ్



**మొగుళ్లపల్లి, నేటిధాత్రి:** దేశవ్యాప్తంగా పేపర్ లీక్‌లు, పరీక్షల అవకతవకలతో నిరుద్యోగ విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలానికి చెందిన బీఈడీ నిరుద్యోగి విద్యార్థి బండారి శంకర్ ప్రభుత్వాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నపత్రాలు లీక్ కాకుండా ఉండేలా కఠిన చట్టాలు వెంటనే తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.

## “మా కష్టం ఒక్క లీక్‌తో వృధా”

బండారి శంకర్ మాట్లాడుతూ, “మేము లక్షలు ఖర్చు చేసి, సంవత్సరాల తరబడి కష్టపడి చదువుతున్నాం. కానీ పరీక్షకు ముందు రోజు పేపర్ లీక్ అయితే మా భవిష్యత్తు అంతా గాలికి కొట్టుకుపోతోంది. NEET, UGC-NET లాంటి జాతీయ పరీక్షల్లోనే ఇలా జరుగుతుంటే సాధారణ విద్యార్థి ఎక్కడికి పోవాలి?” అని ప్రశ్నించారు: 'పేపర్ లీక్'కు పాల్పడిన వారికి జీవిత ఖైదు, ఆస్తుల జప్తు ఉండేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రత్యేక "పేపర్ లీక్ నిరోధక చట్టం" తీసుకురావాలిలి: లీక్ కారణంగా నష్టపోయిన విద్యార్థులకు పరీక్ష ఫీజు తిరిగి చెల్లించడంతో పాటు, ఉచితంగా రీ-టెస్ట్ నిర్వహించాలిలి: పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అధికారులు, NTA లాంటి సంస్థలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి. ఈ ఏడాది మే నెలలో NEET-UG పేపర్ లీక్ ఆరోపణలతో పరీక్షను రద్దు చేసి తిరిగి జూన్ 21న నిర్వహించారు. దీనిపై దేశవ్యాప్తంగా విద్యార్థి, నిరుద్యోగ సంఘాలు ఆందోళనలు చేస్తున్నాయి. పేపర్ లీక్‌లను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఫాస్ట్-ట్రాక్ కోర్టులు, టైమ్-బౌండ్ విచారణలతో కూడిన కఠిన బిల్లు తీసుకొచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. “ఇకనైనా ప్రభుత్వం మేల్కొని, నిరుద్యోగుల ఆశలను కాపాడాలి. లేదంటే రోడ్డెక్కక తప్పదు” అని బండారి శంకర్ హెచ్చరించారు.

# జహీరాబాద్‌లో ఎస్ఐఓ భారీ నిరసన, ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక...

## “విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం సహించరాదు”



**జహీరాబాద్, నేటిధాత్రి;** జహీరాబాద్, నీట్ పేపర్ లీక్ మరియు విద్యా వ్యవస్థలో పెరుగుతున్న అవకతవకలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనల నేపథ్యంలో, నిరసన చేస్తున్న విద్యార్థులకు పూర్తి సంఘీభావం తెలుపుతూ స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఐఓ) జహీరాబాద్, బాగారెడ్డి స్టేడియం నుండి ర్యాలీని ప్రారంభించింది. ఈ ర్యాలీ బ్లాక్ రోడ్, డిగ్రీ కాలేజ్ రోడ్, నగరంలోని ప్రధాన రహదారుల గుండా సాగి, అంబేద్కర్ విగ్రహం సమీపంలోని జాతీయ రహదారి 65 వద్ద ముగిసింది. నిరసనకారులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, నీట్ పేపర్ లీక్ విషయంపై నిష్పక్షపాత విచారణ జరపాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మీడియాతో మాట్లాడుతూ, నెట్ పేపర్ లీక్ వంటి తీవ్రమైన సంఘటనలు లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలో పడేశాయని, దీనిపై ప్రభుత్వ మౌనం అత్యంత విచారకరమని ఎస్ఐఓ జిల్లా సంగారెడ్డి అధ్యక్షుడు మహమ్మద్ ఫసిహుద్దీన్ అన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు తమ చట్టబద్ధమైన హక్కుల కోసం వీధుల్లోకి రావాల్సి వస్తోందని ఆయన అన్నారు. అందువల్ల, ప్రభుత్వం వారి డిమాండ్లను తీవ్రంగా పరిగణించి, తక్షణమే ఆచరణాత్మక చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. నెట్‌పేపర్ లీక్‌పై పూర్తి, పారదర్శక, నిష్పాక్షిక విచారణ జరపాలని, ఈ కుంభకోణంలో పాలుపడిన వారందరినీ న్యాయస్థానం ముందు నిలబెట్టాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన, సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేసి విద్యావ్యవస్థలో విశ్వాసాన్ని పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు, నిరసనకారులపై జరిగిన లాఠీఛార్జ్ అప్రజాస్వామికమని, బాధితులకు న్యాయం జరిగేలా దీనిపై నిష్పాక్షికంగా విచారణ జరపాలని ఆయన కోరారు. శాంతియుత నిరసన అనేది ప్రతి పౌరుడి రాజ్యాంగ, ప్రజాస్వామిక హక్కని, నిరసన తెలుపుతున్న విద్యార్థులపై కఠిన వైఖరి అవలంబించకుండా ప్రభుత్వం వారి సమస్యలకు సరైన పరిష్కారం కనుగొనాలని ఫసిహుద్దీన్ స్పష్టం చేశారు. విద్యార్థుల డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే, ఈ నిరసన ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా మరింత విస్తరిస్తామని, వివిధ దశల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని, విద్యార్థుల హక్కుల పరిరక్షణ, విద్యా వ్యవస్థలో పారదర్శకత కోసం తీవ్ర పోరాటం కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు. నెట్ పేపర్ లీక్‌ను ఖండిస్తూ, పారదర్శక విద్యా వ్యవస్థను నెలకొల్పాలని నినాదాలు రాసి ఉన్న ప్లకార్డులను పాల్గొన్నవారు చేతుల్లో పట్టుకున్నారు. ఈ ప్రదర్శన శాంతియుత వాతావరణంలో ముగిసింది. ఈ నిరసనలో ఎస్ఐఓ సభ్యులు ముహమ్మద్ అర్సలాన్, ముహమ్మద్ తల్హా, ముహమ్మద్ అఫ్నాన్, ముహమ్మద్ సోహైల్, ముహమ్మద్ ఎహ్తేశం, ముహమ్మద్ ఉమర్ ఫరూఖ్, ముహమ్మద్ అయాజ్, ముహమ్మద్ అయన్, సయ్యద్ ఉమైర్‌తో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

# ఇంకుడు గుంతకు భూమి పూజ



**కొడిమ్యాల, నేటిధాత్రి:** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని నల్లగొండ గ్రామంలో శనివారం రోజున అదనపు కలెక్టర్, డీఆర్డీఓ, డిపిఓ మధుమోహన్ ఇంటింటికి ఇంకుడు గుంతలు, నిర్మించుకోవాలని, ఇంకుడు గుంతకు భూమి పూజ చేయడం జరిగింది. కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, బోర్ వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్, ఫారం పండ్ల, పండ్ల తోటలు ప్రాధాన్యతగా తీసుకోవాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సతీష్, కార్యదర్శి మధు, ఫీల్డ్ అసిస్టెంట్ నీలా,వివో ఏ వరలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్ యాదవ్, తదితరులు పాల్గొనడం జరిగింది.

# నిర్మాణంలో ఉన్న నూతన భవన పనుల పురోగతి పరిశీలన



**జగిత్యాల, నేటిధాత్రి:** శనివారం మెట్ పెల్లి పట్టణ కేంద్రంలోని నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న నూతన ఆసుపత్రి భవనాన్ని సందర్శించి జరుగుతున్న పనులలో నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి



ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.మెట్ పెల్లి మండలం అమ్మక్క పేట అర్బన్ కాలనీ లోని నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్) భవనాన్ని కూడా పరిశీలించి పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని సూచించారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

ఈ పరిశీలనలో మెట్ పెల్లి ఆర్డీవో నరసింహ రావు, జిల్లా వైద్య అధికారి సుజాత, ఆసుపత్రి సూపరిండెంట్ సాజిద్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, ఎమ్మార్వో నీత, తహసీల్దార్, ఎంపిడివో, వైద్యులు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ముదిగుంటలో విషాదం..

# యువకుడు ఆకుల సతీష్ మృతి

## యుక్త వయసులో కన్నుమూయడంతో శోకసంద్రంలో గ్రామం...



**జైపూర్, నేటిధాత్రి:** జైపూర్ మండలం ముదిగుంట గ్రామానికి చెందిన ఆకుల సతీష్ (30) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. యుక్త వయసులోనే ఆయన కన్నుమూయడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సతీష్ అందరితో స్నేహపూర్వకంగా మెలుగుతూ,కలుపుగోలుగా ఉండే వ్యక్తిగా గ్రామస్థులు, స్నేహితులు గుర్తు చేసుకున్నారు.ఆయన మృతి వార్త తెలిసిన వెంటనే గ్రామస్థులు,బంధువులు పెద్ద సంఖ్యలో ఆయన నివాసానికి చేరుకుని నివాళులర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

# రోగులకు మెరుగైన వైద్యమే లక్ష్యం.. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన జిల్లా కలెక్టర్.

- ఉదయం తొమ్మిది గంటలకు అటెండెన్స్ పడాల్సిందే..ఓపిలో సీనియర్స్ డాక్టర్లు ఉండాలి...
- ప్రతి ఒక్కరు తప్పనిసరిగా డ్రెస్ కోడ్, ఐడి కార్డులు ధరించాలి...
- జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్...



**సూర్యాపేట, నేటిధాత్రి:** జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఇకపై వైద్యులు, సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ రోగులకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. శనివారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విధులకు ఆలస్యంగా వచ్చినా, డ్యూటీలో నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.9 నుంచి 4 గంటల దాకా అందుబాటులో ఉండాల్సిందే ఆసుపత్రి సిబ్బంది పనివేళలపై జిల్లా కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండాలని, 100 శాతం బయోమెట్రిక్ హాజరు ఉండాలని స్పష్టం చేశారు. ఉదయం ఇన్ టైంలో పంచ్ చేయకపోయినా, సాయంత్రం ముందే వెళ్లిపోయినా అడ్మినిస్ట్రేటివ్ చర్యలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. అలాగే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రెస్ కోడ్ పాటించాలని, ఐడీ కార్డులు ధరించాలని ఆదేశించారు.ఓపీ విభాగంలో సీనియర్లు డాక్టర్లు ఉండాలి.ఓపీ విభాగాల్లో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు క్లినికల్ అవర్స్ లో విధిగా ఉండాలని సూచించారు. జూనియర్ డాక్టర్లపైనే భారం వేయకుండా సీనియర్లు నేరుగా రోగులను పరీక్షించాలని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులపై స్పెషల్ ఫోకస్..ప్రస్తుతం వర్షాకాలం కావడంతో డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, మెడికల్ వార్డులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతిరోజూ ఫీవర్ కేసులు, అడ్మిషన్లు, డిశ్చార్జ్ వివరాలను అప్‌డేట్ చేయాలని చెప్పారు. మందుల కొరత లేకుండా బఫర్ స్టాక్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.సీఎస్ఆర్ నిధులతో కొత్త ఎక్విప్‌మెంట్.. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు, అత్యాధునిక శస్త్రచికిత్సల కోసం లాపరోస్కోపిక్ సెట్స్, అడ్వాన్స్డ్ లాపరోస్కోపీ టవర్స్ కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వీటిని కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులు లేదా కలెక్టరేట్ గ్రాంట్ల ద్వారా సమకూర్చు కోనున్నట్లు వెల్లడించారు. ఈకార్యక్రమంలో డాక్టర్లు జనార్ధన్, అనిత, ఉపేందర్, యశ్వంత్, గీత, సంధ్య, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సుభిక్షం కోసం కొండగట్టు అంజన్నను ప్రార్థించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

- వర్షాలు కురిసి రైతులు పండించిన పంటలు సమృద్ధిగా పండాలి....
- రాష్ట్ర ప్రజల సంక్షేమం, సుభిక్షం కోసం ప్రత్యేక పూజలు...



**కొండగట్టు, నేటిధాత్రి:** తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో జీవించాలని, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పండించిన పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శనివారం రోజున కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.జిల్లా పర్యటనలో భాగంగా కొండగట్టు హరిత హోటల్‌కు



చేరుకున్న చైర్మన్‌కు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. తదుపరి కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకున్న చైర్మన్‌కు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో, వేదమంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా స్వాగతం పలికి ఆశీర్వచనం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామిని దర్శించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు పండించిన పంటలు బాగా పండాలని, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు దీక్షలు తీసుకుని కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకోవడం ఈ క్షేత్రం ప్రత్యేకత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్.లత, డీఎస్పీ రాములు , ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు, ప్రవీణ్, నీలాదేవి, రాంబాబు, శంకర్, ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజకుమార్, ఈడి ఎస్సీ కార్పొరేషన్ కిషోర్, డి.పి.ఆర్.ఆర్. వి.శ్రీధర్, తాహసిల్దార్, ఈఓ అంజనా రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు,ఆలయ అధికారులు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫిజిక్స్ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టు కోసం దరఖాస్తుల ఆహ్వానం




నర్సంపేట, నేటిధాత్రి: ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), నర్సంపేటలో 2026--27 విద్యా సంవత్సరానికి భౌతిక శాస్త్ర (ఫిజిక్స్) విభాగంలో ఖాళీగా ఉన్న ఒక గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత విభాగంలో పీజీ పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. ఓసీ, బీసీ అభ్యర్థులకు కనీసం 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉండాలని తెలిపారు. పీహెచ్‌డీ, నెట్, సెట్, స్లెట్ వంటి అదనపు అర్హతలతో పాటు బోధన అనుభవం ఉన్న వారికి ఎంపికలో ప్రాధాన్యం కల్పిస్తామని వెల్లడించారు.అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు విద్యార్హతల ధ్రువపత్రాల ప్రతులను జతచేసి ఈ నెల 28వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), నర్సంపేటలో సమర్పించాలని సూచించారు.ఇదివరకు ఈ సబ్జెక్టుకు దరఖాస్తు చేసిన అభ్యర్థులు తిరిగి దరఖాస్తు సమర్పించాల్సిన అవసరం లేదని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ స్పష్టం చేశారు.

# లయన్స్ క్లబ్ నర్సంపేట గ్లోరీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం




**నర్సంపేట, నేటిధాత్రి:** లయన్స్ క్లబ్ ఆఫ్ నర్సంపేట గ్లోరీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం శనివారం నర్సంపేట పట్టణంలోని ఐఎంఏ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా మోతె ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం.డి. యాకూబ్, కోశాధికారిగా నల్లా సుధాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా వీరమల్ల మాధవరెడ్డి, మేడవరపు కమలాకర్ రెడ్డిలు ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమానికి ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్‌గా హరికిషన్ రెడ్డి హాజరై నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లయన్స్ జిల్లా 320-ఎఫ్ గవర్నర్ నరహరి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, లయన్స్ క్లబ్ సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుంటుందని అన్నారు. పర్యావరణ పరిరక్షణ, రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాల నిర్వహణతో పాటు పేద విద్యార్థులు, నిరుపేద కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించడంలో క్లబ్ విశేషంగా కృషి చేస్తోందని పేర్కొన్నారు.నూతన కమిటీ కూడా “హార్ట్ ఫుల్ సర్వీసెస్ -- హ్యాపీ ఫేసెస్” నినాదంతో ముందుకు సాగుతూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి, లయన్స్ క్లబ్ ఆఫ్ నర్సంపేట గ్లోరీకి వరంగల్ జిల్లాలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రేవూరి రమణారెడ్డి, లక్ష్మీనర్సింహారావు, రీజియన్ చైర్‌పర్సన్ బిల్లా సులోచన, ముచ్చా రాజిరెడ్డి, వై. రంగారెడ్డి, జోన్ చైర్మన్ మోతె సమ్మిరెడ్డి, కంది గోపాల్ రెడ్డి, వి. సుబ్బారావు, చల్లా నాగార్జున్ రెడ్డి, గాదె రాజిరెడ్డి, షేర్ల సంతోష్, జి. ప్రభాకర్ రెడ్డి, వేములపల్లి రాజు, సయ్యద్ జావీద్, జహంగీర్, వెంకట్రాం నర్సయ్య, డాక్టర్ భరత్ రెడ్డి, డాక్టర్ రాంచందర్, శానబోయిన రాజ్‌కుమార్, సైప సురేష్‌తో పాటు లయన్స్ క్లబ్ సభ్యులు, లయన్ లేడీస్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ బిల్లుపై కేంద్రం నిర్లక్ష్యం తగదు: బీసీ నేత సాయిలి ప్రభాకర్



**గీసుకొండ, నేటిధాత్రి:** తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించి రాష్ట్రపతి ఆమోదం కోసం పంపిన బీసీ బిల్లును కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రపతి కార్యాలయం నిర్లక్ష్యం చేయడం సరికాదని బీసీ సంక్షేమ సంఘం నాయకుడు సాయిలి ప్రభాకర్ అన్నారు.శనివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీల హక్కుల పరిరక్షణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించి రాష్ట్రపతి ఆమోదానికి పంపిందని గుర్తు చేశారు. అయితే బిల్లు పంపి చాలా రోజులైనా కేంద్ర ప్రభుత్వం గానీ, రాష్ట్రపతి కార్యాలయం గానీ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.ఈ బిల్లుపై కేంద్ర స్థాయిలో కనీసం చర్చ కూడా జరగకపోవడం, పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావనకు రాకపోవడం వెనుక కారణాలు ఏమిటో స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో అత్యధిక జనాభా కలిగిన బీసీల హక్కుల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షపూరిత వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు.తెలంగాణ బీసీల ఆకాంక్షలను గౌరవిస్తూ రాష్ట్రపతి ఎలాంటి జాప్యం లేకుండా బీసీ బిల్లుకు ఆమోదం తెలపాలని కోరారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఢిల్లీ వేదికగా దేశవ్యాప్త బీసీ ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని సాయిలి ప్రభాకర్ హెచ్చరించారు.


# శ్రీ పాండురంగ విఠలేశ్వర స్వామి ఆలయంలో ప్రిన్సిపల్ జిల్లా జడ్జి



**వనపర్తి, నేటిధాత్రి:** వనపర్తి జిల్లా కేంద్రం బ్రాహ్మణవాడలో శ్రీ పాండురంగ విఠలేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా వనపర్తి జిల్లా ప్రిన్సిపల్ జడ్జి శ్రీనివాస్ రావ్ సీనియర్ సివిల్ జేడ్జి కళా అర్చన జెడ్జిలు కార్తీక్ రెడ్డి బండారు శ్రీలత నోముల అశ్విని పాల్గొన్నారని ఆలయ కమిటీ నిర్వహాకులు చెప్పారు ఈ సందర్భంగా వారికి ఆలయ మర్యాదలతో ప్రత్యేక పూజలు చేయించి దర్శనం కల్పించామని ఆలయ కమిటీ అధ్యక్షులు పూరిపాండు జగదీష్ తెలిపారు ఆలయ ములో జేరిగే పూజ కార్యక్రమాల గురించి ఆలయ పురోహితులువివరించారు

# క్షణికావేశంలో వృద్ధుడి హత్య

- మృతదేహాన్ని పూడ్చిపెట్టే యత్నం..గ్రామస్తుల అప్రమత్తతతో వెలుగులోకి ఘటన...



**దుగ్గొండి, నేటిధాత్రి:** దుగ్గొండి మండలం నాచినపల్లి గ్రామంలో క్షణికావేశంలో ఓ వృద్ధుడు హత్యకు గురైన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. మృతదేహాన్ని ఇంటి స్థలంలోనే పూడ్చిపెట్టేందుకు నిందితుడు యత్నించగా గ్రామస్తుల అప్రమత్తతతో విషయం బయటపడింది.గ్రామస్తులు,ఎస్సై రావుల రణధీర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముస్కుల సాంబారెడ్డి ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి ఆరోగ్య కారణాలతో బట్టల్లోనే మలవిసర్జన చేసుకున్నట్లు సమాచారం. దీంతో ఆయన తమ్ముడి కుమారుడు ముస్కుల రాజిరెడ్డి ఆగ్రహానికి గురై, “నీకు ఎవరు సేవలు చేయాలి” అంటూ వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. అనంతరం క్షణికావేశంలో కర్రతో దాడి చేయడంతో సాంబారెడ్డి అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

- **గుంత తవ్వుతుండగా అనుమానం....**

శనివారం ఉదయం సాంబారెడ్డి మృతి చెందినట్లు గుర్తించిన రాజిరెడ్డి మృతదేహాన్ని తన ఇంటి స్థలంలోనే పూడ్చిపెట్టేందుకు ఇంటి సమీపంలో గుంత తవ్వుతుండగా అనుమానం వచ్చిన గ్రామస్తులు అడ్డుకుని వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న ఎస్సై పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఆధారాలు సేకరించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరి చల్లా ఉమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు దుగ్గొండి ఎస్సై రావుల రణధీర్ రెడ్డి తెలిపారు.

# హరి హర క్షేత్రంలో వైభవంగా శాకాంబరి ఉత్సవం



▶▶తొలి ఏకాదశి సందర్భంగా భారీగా తరలివచ్చిన భక్తులు....

▶▶ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాల స్వీకరణ....

**పరకాల, నేటిధాత్రి:** తొలి ఏకాదశి సందర్భంగా పరకాల పట్టణంలోని హరి హర క్షేత్ర అయ్యప్పస్వామి ఆలయంలో శాకాంబరి ఉత్సవాన్ని ఆలయ కమిటీ శనివారం వైభవంగా నిర్వహించింది.సకల దేవతా నిలయంగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయానికి పరకాల పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు అయ్యప్పస్వామిని దర్శించుకోవడంతో పాటు ఆలయ ప్రాంగణంలోని శివాలయం,వెంకటేశ్వరస్వామి తదితర దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. శాకాంబరి ఉత్సవం సందర్భంగా ఆలయం భక్తులతో కిక్కిరిసిపోగా,భక్తుల గోవింద నామస్మరణలు,స్వామి శరణం నినాదాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో మారుమోగింది.ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.

# దాతలారా నా కుమారుడిని కాపాడండి.



▶▶ఆపన్న హస్తం కోసం వేడుకోలు.....

**చిట్యాల, నేటిధాత్రి:** చిట్యాల గ్రామానికి చెందిన మాసు అనిల్ కుమారుడు అగు 11 నెలల బాబు చిన్ను గత 15 రోజుల క్రితం స్నానం కోసం అని వేడి నీళ్ల బకెట్ పక్కన పెడితే దానిని కదిలించగా పూర్తి వేడినీళ్లు మీద పడి 60 శాతం వరకు కాలడం జరిగిందిలి.గత 15 రోజుల నుండి హన్మకొండ లోని ప్రైవేట్ ఆసుపత్రి లో దాదాపుగా 5 లక్ష ల వరకు ఖర్చు పెట్టి వైద్యం చేపిస్తున్న సమయంలో రెండు రోజుల క్రితం ఒక్క సారిగా గుండెపోటు రావడం తో వైద్యులు వెంటిలేషన్ మీద నుండి వైద్యం అందిస్తున్నారు11 నెలల బాబు ఎన్ని రోజుల వరకు వెంటిలేషన్ మీద నుండి ఎప్పుడు వస్తాడో ఇపుడే చెప్పలేము అని,రోజుకు 1లక్ష రూపాయల ఖర్చు వస్తది అని దాదాపుగా 10 లక్షలు అవుతాయి అని చాలా సీరియస్ కండిషన్ లో బాబు ఉన్నాడు అని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారులి. దయామయులు అయిన ఆపదలో ఆదుకొనే దాతలు స్పందించి నా కుమారుడు ని కాపాడుకోవడం కి మీ వంతు సహాయ సహకారాలు అందించాలి అని వేడుకుంటున్నాడు,మానవతా వాదులు సహృదయులు అయిన దాతలు దయచేసి ఈ నెంబర్ కి ఫోన్ పే లేదా గూగుల్ పే ద్వారా మీ వంతు తోచిన సహాయంచేసి పసిగుడ్డు ప్రాణం ని కాపాడిన దేవుళ్ళు అవుతారు అని కోరుకుంటూన్నారు. ఫోన్ పే నెంబర్. 7036015141(మాసు అనిల్ ) బ్యాంకు అకౌంట్ నెంబర్ :35180222018 IFSC Code :SBIN0006639

# రెగ్యులర్ కమిషనర్ నియామకం చేయాలి



▶▶వైద్య విధాన పరిషత్ ఉద్యోగుల వినూత్న నిరసన...

పరకాల, నేటిధాత్రి: వైద్య విధాన పరిషత్‌కు వెంటనే రెగ్యులర్ కమిషనర్‌ను నియమించాలని కోరుతూ పరకాల ఏరియా ఆసుపత్రిలో వైద్యులు,సిబ్బంది శనివారం వినూత్న నిరసన చేపట్టారు.వైద్య విధాన పరిషత్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న మొక్కలు నాటుదాం మనవి చేద్దాం కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ వైద్య విధాన పరిషత్ కమిషనర్ పదవీ విరమణ చేసి రెండు నెలలు గడిచినా ఇప్పటికీ రెగ్యులర్ కమిషనర్‌ను నియమించకపోవడంతో వైద్యశాలల పరిపాలన, పర్యవేక్షణపై ప్రభావం పడుతోందన్నారు.
వైద్యులు, నర్సింగ్, పారామెడికల్, మినిస్టీరియల్, కాంట్రాక్ట్,ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వ్యక్తిగత, సర్వీస్ సంబంధిత సమస్యలు పేరుకుపోయి పరిష్కారం కాక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.
ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడంతో పాటు తమ సమస్యల పరిష్కారానికి కమిషనర్ నియామకం అవసరమని తెలియజేసే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.అత్యవసర వైద్య సేవలు అందించే శాఖలో పనిచేస్తున్నందున ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా ఆందోళనలు చేయకుండా,వినూత్న రీతిలో ప్రభుత్వ దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి వెంటనే రెగ్యులర్ కమిషనర్‌ను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరకాల ఏరియా ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్, మినిస్టీరియల్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# శివ్వారంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ పై అదనపు కలెక్టర్ విచారణ

▶▶పైప్‌లైన్‌ను ఇకపై ఎవరూ వినియోగించరాదని గ్రామసభ ఏకగ్రీవ తీర్మానం..



**జైపూర్, నేటిధాత్రి:** జైపూర్ మండలంలోని శివ్వారం గ్రామపంచాయతీ పరిధిలో తాగునీటి సరఫరా కోసం గోదావరి నది నుంచి ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను సర్పంచ్ అక్రమంగా వేలం వేశారనే ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశాల మేరకు శనివారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) విచారణ నిర్వహించారు.
విచారణలో భాగంగా గ్రామపంచాయతీని సందర్శించిన అదనపు కలెక్టర్ గోదావరి ఒడ్డున ఉన్న మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను పరిశీలించారు.
అనంతరం సంబంధిత అధికారులు, సర్పంచ్, ఉపసర్పంచ్,వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు,గ్రామస్థుల సమక్షంలో సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను ఇకపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరూ వినియోగించరాదని అధికారులు స్పష్టం చేశారు.దీనికి గ్రామ ప్రజలందరూ ఏకగ్రీవంగా అంగీకరిస్తూ తీర్మానం చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారి డి. వెంకటేశ్వరరావు,గ్రామీణ నీటి సరఫరా శాఖ (మిషన్ భగీరథ) కార్యనిర్వాహక ఇంజనీర్ వెంకటేశ్వర్,ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ కిరణ్,మండల అభివృద్ధి అధికారి జి. సత్యనారాయణ గౌడ్,మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు,గ్రామీణ నీటి సరఫరా శాఖ సహాయ ఇంజనీర్ ఎన్.రాజమల్లయ్య,సర్పంచ్ అంజన్ గౌడ్,వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి సృజన, గ్రామ పెద్ద చల్లా విశ్వంబర్ రెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్ర పరకాల నిర్మాణానికి చిరు వ్యాపారులు సహకరించాలి

▶▶ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి...



**పరకాల, నేటిధాత్రి:** పరకాల పట్టణాన్ని పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు చిరు వ్యాపారులు పూర్తి సహకారం అందించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి కోరారు.
శనివారం పట్టణంలోని కూరగాయల మార్కెట్,
చేపల మార్కెట్‌ను అధికారులతో కలిసి ఆయన సందర్శించి,
మార్కెట్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా చిరు



వ్యాపారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మార్కెట్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని,మిగిలిపోయిన వ్యర్థాలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.మార్కెట్ ప్రాంతంలో సీసీ కెమెరాలు,మెరుగైన లైటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.ప్రస్తుతం చేపల మార్కెట్ రహదారి పక్కనే ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని,అందుకే చేపల వ్యాపారులకు ప్రత్యేకంగా నిర్దిష్ట స్థలాన్ని కేటాయించి మార్కెట్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.
నిబంధనలు ఉల్లంఘించి రోడ్డుపై చెత్త వేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.
చిరు వ్యాపారుల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా వారికి ప్రత్యామ్నాయంగా అనువైన స్థలాన్ని కేటాయిస్తామని హామీ ఇచ్చారు.ప్రజల సహకారంతోనే పరకాల పట్టణ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని,
గత పాలకుల నిర్లక్ష్య వైఖరి కారణంగా పట్టణం అభివృద్ధిలో వెనుకబడిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్,
మున్సిపల్ కమిషనర్,కౌన్సిలర్లు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఫైరి శీ గ్ లో ప్రతిభ చూపిన పోలీస్ సిబ్బందిని అభినందించిన ఎస్పీ



**వనపర్తి, నేటిధాత్రి:** శనివారం జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం ఎర్రవల్లి 10వ తెలంగాణ స్పెషల్ పోలీస్ బెటాలియన్ ఫైరింగ్ రేంజ్‌లో వనపర్తి జిల్లా పోలీసు అధికారులకు, సిబ్బందికి నిర్వహించిన 2 రోజుల వార్షిక ఫైరింగ్ ట్రేనింగ్ కార్యక్రమం ముగిసిందిఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునీత రెడ్డి మాట్లాడుతూ పోలీసు అధికారి ఆయుధాలు వినియోగ విధానంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు విధి నిర్వహణలో శారీరక దృఢత్వం ఎంతో కీలకమని అన్నారు పోలీసు లు నిజాయితీ అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందాలని సూచించారుఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వినోద్, జిల్లా పోలీసు అధికారులు, ఎస్సైలు ఏఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# కిడ్నీ బాధిత కుటుంబానికి అండగా అయ్యప్పస్వామి దేవాలయంలి



▶▶దాతల సహకారంతో రూ.1.12 లక్షల ఆర్థిక సాయం అందజేత....

నర్సంపేట, నేటిధాత్రి: రెండు కిడ్నీలు కోల్పోయి అనారోగ్యంతో బాధపడుతున్న సట్ల బిక్షపతి కుటుంబానికి శ్రీ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయ సేవా చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది.ట్రస్టు ఆధ్వర్యంలో దాతల సహకారంతో రూ.1.12 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. శనివారం నర్సంపేట పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ సహాయాన్ని అందించారు.ట్రస్ట్ చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్ మాట్లాడుతూ, నర్సంపేట 8వ వార్డుకు చెందిన సట్ల బిక్షపతి గత 15 సంవత్సరాలుగా అయ్యప్పదేవలయంలో,శుభకార్యాలు,ఇతర విందు కార్యక్రమాల్లో భోజన వడ్డన చేస్తూ జీవనం సాగించడంతో పాటు నిరుపేదలకు సేవలందించారని తెలిపారు. గత నాలుగు నెలలుగా రెండు కిడ్నీలు పూర్తిగా దెబ్బతినడంతో తీవ్ర అనారోగ్యానికి గురైన నేపథ్యంలో దాతల సహకారంతో రూ.1.12 లక్షలు సేకరించినట్లు చెప్పారు.ఈ మొత్తంలో అత్యవసర వైద్య ఖర్చుల కోసం రూ.30 వేల నగదును బిక్షపతికి అందజేయగా, మిగిలిన మొత్తాన్ని ఆయన వైద్య అవసరాలు, కుటుంబ సభ్యులు, పిల్లల భవిష్యత్తు కోసం బ్యాంకులో డిపాజిట్ చేయనున్నట్లు వెల్లడించారు.కార్యక్రమానికి హాజరైన బీజేపీ యువ నాయకుడు డాక్టర్ రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచన మేరకు ప్రభుత్వం ద్వారా ఉచిత వైద్య సహాయం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, దాతలు రూ.100 నుంచి రూ.5 వేల వరకు విరాళాలు అందజేశారు. కార్యక్రమంలో దేవాలయం అధ్యక్షుడు సైఫా సురేష్, ప్రధాన కార్యదర్శి చింతల కమలాకర్ రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్, కమిటీ సభ్యులు మాదారాపు చంద్రశేఖరం, శ్రీరాం కిరణ్, మోతె సమ్మిరెడ్డి, మిడిదొడ్డి బాబురావు, మల్యాల రాజు, ఆకుల ప్రభాకర్, గిరగాని సాంబయ్య గౌడ్, దయాకర్, ఆలయ మేనేజర్ దేశి రాము తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల విజయమే

●ప్రజాస్వామ్య పోరాటానికి లభించిన ఫలితం: ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి...



**నర్సంపేట, నేటిధాత్రి:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశవ్యాప్తంగా విద్యార్థులు సాగించిన ఐక్య పోరాటానికి దక్కిన విజయమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు.శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. ఇది కేవలం ఒక్క వ్యక్తి రాజీనామా మాత్రమే కాదని, విద్యార్థి శక్తి ముందు అహంకార రాజకీయాలు తలవంచిన సందర్భమని పేర్కొన్నారు. ఈ పరిణామం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పతనానికి తొలి మెట్టుగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు.విద్యార్థుల ఉద్యమాలు, ప్రతిపక్షాల పోరాటం, ముఖ్యంగా కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన నిరంతర ఒత్తిడి కారణంగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యంలో విద్యార్థుల గొంతును అణచివేయాలనే ప్రతి ప్రయత్నానికి ఈ పరిణామం గట్టి సమాధానమని పేర్కొన్నారు.విశ్వవిద్యాలయాలపై ఆంక్షలు విధించడం, విద్యార్థుల నిరసనలను అడ్డుకోవడం, ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడం చివరకు ప్రభుత్వానికే నష్టాన్ని మిగిల్చిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడితే దేశ యువత తగిన సమాధానం చెబుతుందని ఈ ఉద్యమం నిరూపించిందని చెప్పారు.రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కును హరిస్తే ప్రజలు మరింత ఐక్యంగా పోరాడతారని కేంద్ర ప్రభుత్వం గ్రహించాలని సూచించారు. ఈ రాజీనామా కేంద్ర ప్రభుత్వంపై ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తికి నిదర్శనమని పేర్కొన్న ఆయన, విద్య, ఉపాధి, యువత భవిష్యత్తుకు సంబంధించిన అంశాల్లో కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, విద్యార్థుల హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజలతో కలిసి నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తెలిపారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ విద్యార్థుల ఘన విజయం ఖుతుబోద్దీన్ పాషా



**మెట్‌పల్లి, నేటిధాత్రి:** మెట్‌పల్లి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయడం దేశంలోని విద్యావేత్తలు, విద్యార్థి లోకం సాధించిన ఘన విజయమని మెట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షుడు ఖుతుబోద్దీన్ పాషా అన్నారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేస్తోందని ఆరోపించారు.దేశంలో వరుసగా జరుగుతున్న పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలు,అవకతవకలతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడిందని మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా కాంగ్రెస్ పార్టీ, వివిధ విద్యార్థి సంఘాలు చేపట్టిన పోరాటాల ఫలితంగానే కేంద్ర మంత్రి తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. భవిష్యత్తులోనైనా కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడకుండా, పారదర్శకమైన రీతిలో పోటీ పరీక్షలను నిర్వహించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

# దుర్గాదేవి ఆలయ నిర్మాణానికి శ్రీరాంపూర్ ప్రైవేట్ భద్రతా సిబ్బంది విరాళం



**శ్రీరాంపూర్, నేటిధాత్రి:** శ్రీరాంపూర్ ఏరియా ఎస్ అండ్ పీ విభాగం పరిధిలో పనిచేస్తున్న ప్రైవేట్ భద్రతా సిబ్బంది దుర్గాదేవి ఆలయ నిర్మాణానికి తమ వంతు ఆర్థిక సహాయాన్ని అందించారు.భద్రతా కార్యాలయం ఆధ్వర్యంలో భద్రతా సిబ్బంది అందరూ కలిసి రూ.31,875లను చందాగా సేకరించి ఏరియా భద్రతా అధికారి (ఏఎస్ఓ) జక్కారెడ్డికి అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆవుల రమేష్, మైదం రవి, నేరేటి సురేష్ ముఖ్యపాత్ర పోషించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ ఎలక్ట్రికల్, సివిల్ అండ్ భద్రతా సేవల సంస్థ యాజమాన్యం ఏరియా భద్రతా అధికారికి లేఖ అందజేసింది. ఆలయ నామఫలకంపై “ప్రైవేట్ భద్రతా సిబ్బంది” పేరును నమోదు చేయాలని కోరింది. సమాజ సేవకు సంబంధించిన ఏ కార్యక్రమమైనా తాము ముందుండి పాల్గొంటామని, ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందని వారు తెలిపారు.

# రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలల సమస్యలు పరిష్కరించడి



**మెట్‌పల్లి, నేటిధాత్రి:** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య గారు జగిత్యాల జిల్లా పలు కార్యక్రమాల నిమిత్తం విచ్చేసిన సందర్భంగా కార్యక్రమాలు ముగించుకొని మెట్పల్లికి విచ్చేసిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గురుకుల ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గోరుమంతుల సురేందర్ మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్రంలో గురుకుల స్కూల్ ప్రారంభమైన అప్పటినుండి విద్యార్థిని విద్యార్థులకు పలు గురుకుల పాఠశాలలో సరియైన బాత్రూంలు స్థానాల గదులు, మరుగుదొడ్లు, సరిగా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అట్లాగే పలు స్కూళ్లలో నీటి సమస్య కూడా చాలా ఎక్కువగా ఉండటం వల్ల విద్యార్థిని విద్యార్థులు ఒకటి రెండు రోజులకు ఒక్కసారి స్థానాలు చేస్తున్నారు,పలు పాఠశాలల్లో ఇప్పటికీ విద్యార్థులకు చదువు కొనడానికి బుక్స్ కూడా రాలేదు, పలు స్కూల్లలో విద్యార్థిని విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ కూడా ఇప్పటికీ ఇవ్వలేదు వీటివల్ల విద్యార్థిని విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ కి తెలియజేయడంతో తక్షణమే సోషల్ వెల్ఫేర్ హెడ్ ఆఫీస్ లో మాట్లాడి విద్యార్థులకు న్యాయం చేస్తానని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో పొట్ట ప్రసాద్, సోమిడి వినోద్, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశ విద్యార్థుల ఘన విజయం

నూతన సర్పంచ్ నజియా అంజుమ్ షేక్ సోహెల్...




**జహీరాబాద్, నేటిధాత్రి:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయడం దేశంలోని విద్యావేత్తలు, విద్యార్థి లోకం సాధించిన ఘన విజయమని ఝరాసంగం మండల బిఆర్ఎస్ తుమ్మనపల్లి గ్రామ నూతన సర్పంచ్ నజియా అంజుమ్ షేక్ సోహెల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేస్తోందని ఆరోపించారు.దేశంలో వరుసగా జరుగుతున్న పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలు,అవకతవకలతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడిందని మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా కాంగ్రెస్ పార్టీ, వివిధ విద్యార్థి సంఘాలు చేపట్టిన పోరాటాల ఫలితంగానే కేంద్ర మంత్రి తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. భవిష్యత్తులోనైనా కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడకుండా, పారదర్శకమైన రీతిలో పోటీ పరీక్షలను నిర్వహించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

# శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు



**కొడిమ్యాల, నేటిధాత్రి:** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం కేంద్రం లో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశి పండుగ వేడుకలు ఆలయంలో శయనేకాదశి, తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు,అభిషేకాలు, గోపూజ నిర్వహించడం జరిగింది. శనివారం రోజున శయనేకాదశి తొలి ఏకాదశి శ్రీమన్నారాయణుడు నాలుగు నెలలు యోగ నిద్రలోకి చేరి జగత్ రక్షణ గురించి చింతించేటువంటి పవిత్ర సమయం ఈ సమయాన్ని పురస్కరించుకొని ఆలయంలో ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకం, గోపూజ, నిర్వహించి భక్తులకు స్వామివారి దివ్య దర్శనాన్ని కల్పించి అర్చనలు అభిషేకాలు చేసి తీర్థప్రసాదాలు అందజేయడం జరిగింది. ఇట్టి పూజా కార్యక్రమాలు ఆలయ అర్చకులు నాగరాజు రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. పూజా కార్యక్రమంలో జగిత్యాల జిల్లా, కొడిమ్యాల చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు వేల సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించినారు

# సింగరేణి ఆస్పత్రిలో అగ్ని ప్రమాదాల నివారణకై అవగాహన



**రామకృష్ణాపూర్, నేటిధాత్రి:** మందమర్రి ఏరియాలోని రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రిలో శనివారం రెస్క్యూ విభాగం ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆకస్మిక అగ్నిప్రమాదాల సమయంలో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఇతర ఫైర్ ఫైటింగ్ పరికరాలను ఎలా ఉపయోగించాలో ప్రాక్టికల్ డెమో ద్వారా వివరించారు. అత్యవసర పరిస్థితుల్లోతీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ శిక్షణతో సిబ్బంది లో అప్రమత్తత పెరుగుతుందనిఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ మధు కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెస్క్యూ ఇన్‌చార్జి రామ్మోహన్, సీనియర్ పర్సనల్ అధికారి ఎం.డి. మదార్ సాహెబ్, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ఎర్ర సత్యం జయంతి వేడుకలు



**భూపాలపల్లి, నేటిధాత్రి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో బీసీ ముదిరాజ్ ముద్దుబిడ్డ, పోరాట యోధుడు ఎర్ర సత్యం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్తో పాటు పార్టీ నాయకులు పాల్గొని ఎర్ర సత్యం అన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ మాట్లాడుతూ, ఎర్ర సత్యం అన్న తన జీవితాన్ని పేద ప్రజల సేవకు అంకితం చేశారని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తూ, తన వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరికి తన వంతు బాధ్యతగా సహాయం అందించారని కొనియాడారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో ప్రజల ఆదరణ పొందిన నాయకుడిగా ఎర్ర సత్యం అన్న గుర్తింపు పొందారని, ఆయన పేరు వినగానే పేద ప్రజల గుండెల్లో నమ్మకం, ఆనందం కలిగేదని తెలిపారు. అలాంటి ప్రజానాయకుడిని కొందరు వ్యక్తులు కక్షపూరిత ధోరణితో నిర్దాక్షిణ్యంగా హత్య చేయడం అత్యంత బాధాకరమని అన్నారు. ఎర్ర సత్యం అన్న ఆశయాలు, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటాన్ని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ముందుకు తీసుకెళ్తోందని, అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని రవి పటేల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ పిట్టల వెంకటేష్, మహిళా విభాగం అధ్యక్షురాలు సామల శ్రీలత, క్రమశిక్షణ కమిటీ నాయకుడు కరుణాకర్, కార్మిక విభాగం నాయకుడు అనంతుల సంపత్, ఎలక్ట్రిషియన్ విభాగం నాయకుడు అశోక్, జిల్లా నాయకులు సమ్మయ్య, రాంబాబు, సలీం, రమేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల పోరాటానికి దక్కిన విజయం

## నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి.....
## నీట్ ఉద్యమ విజయమే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా....

నర్సంపేట, నేటిధాత్రి: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా దేశవ్యాప్తంగా విద్యార్థులు సాగించిన నిరంతర ప్రజాస్వామ్య పోరాటానికి దక్కిన విజయమని నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పెద్ది సుదర్శన్ రెడ్డి విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల ఐక్యత, ఉద్యమ స్ఫూర్తి ముందు అధికార అహంకారం తలవంచాల్సి వచ్చిందన్నారు. వీధుల నుంచి ఢిల్లీ వరకు పోరాడిన ప్రతి విద్యార్థికి, ఉద్యమకారుడికి అభినందనలు తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్తు కోసం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద యువత చేపట్టిన ఉద్యమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారని తెలిపారు. నీట్ పేపర్ లీక్ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్న విద్యార్థుల డిమాండ్‌కు బీఆర్ఎస్ పార్టీ



మొదటి నుంచే మద్దతు ప్రకటించిందన్నారు.

నీట్ విద్యార్థుల ఉద్యమానికి బీఆర్ఎస్ నిరంతరం అండగా నిలిచిందని, ఇటీవల నిర్వహించిన ధర్నాకు కూడా పార్టీ సంపూర్ణ మద్దతు తెలిపిందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం పారదర్శక చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ రాష్ట్ర నేత,మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి డిమాండ్ చేశారు.

# హన్మకొండ జిల్లా కోర్టు సముదాయంలో నూతన కోర్టుల ఏర్పాటు

## ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. విజయసేనారెడ్డి





**హనుమకొండ, నేటిధాత్రి:** శనివారం రోజున హైకోర్టు న్యాయమూర్తి మరియు వరంగల్, హనుమకొండ జిల్లాల అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి జస్టిస్ బి.విజయసేనారెడ్డి హనుమకొండ జిల్లా కోర్టులో కొత్తగా ఏర్పాటు అయిన ఒక అదనపు జిల్లా కోర్టు మరియు రెండు జూనియర్ సివిల్ కోర్టులను ప్రారంభించారు. అనంతరం వరంగల్ మరియు హనుమకొండ జిల్లాల బార్ అసోసియన్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఇట్టి సమావేశం ఇరు బార్ అసోసియేషన్ అధ్యక్షులైన సి. ఎచ్ రామకృష్ణ మరియు సి.ఎచ్ ఉపేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇట్టి సమావేశంలో ఇరు బార్ అసోసియేషన్ల అధ్యక్షులు మాట్లాడుతూ హనుమకొండకు అదనపు కోర్టులు కేటాయించినందుకు చాలా సంతోషం వ్యక్త పరిచారు. అలాగే వరంగల్ జిల్లాకు కూడా అదనపు కోర్టులను మంజూరు చేయడానికి సహరించాలని జస్టిస్ బి.విజయసేనారెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు ఎ.ఎన్.సహోదర్ రెడ్డి మాట్లాడుతూ వరంగల్ మరియు హనుమకొండ జిల్లాల నుండి అనేక మంది న్యాయవాదులు జూనియర్ సివిల్ జడ్జిల పోస్టులకు ప్రిపేర్ అవుతున్నారని వారికి సరియగు సమయంలో తరగతులు నిర్వహించడానికి తగిన సదుపాయాలు కల్పించాలని కోరారు. అనంతరం ముఖ్యఅతిథి జస్టిస్ బి.విజయసేనారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జనాభా పెరుగుదల, పెండింగ్ కేసుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని నూతన కోర్టులను ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు మరియు ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించేందుకు న్యాయమూర్తులు, న్యాయవాదులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. నూతనంగా ప్రారంభించిన హనుమకొండ జిల్లాలో మూడవ అదనపు జిల్లా కోర్టు, ఐదవ మున్సిఫ్ కోర్టు, ఆరవ మున్సిఫ్ కోర్టు శనివారం నుండే కార్యకలాపాలు ప్రారంభించబడాయని పేర్కొన్నారు. అనంతరం వరంగల్, హనుమకొండ జిల్లా ల బార్ అసోసియేషన్ ప్రతినిధులు జిల్లా కోర్టు ప్రాంగణంలోని మౌలిక వసతులు,హౌ భద్రత సమస్యలను హైకోర్టు న్యాయమూర్తి దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా పార్కింగ్ సౌకర్యం, సమస్యలను వివరించగా, వాటి పరిష్కారానికి సాధ్యమైనంత త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఇట్టి కార్యక్రమంలో వరంగల్ మరియు హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయ మూర్తులు వి. బి నిర్మలా గీతంబ, ఎం. ఆర్ సునీత మరియు ఇతర న్యాయమూర్తులు, మరియు ప్రధాన కార్యదర్శులు నాగేందర్, నరేందర్, ఇరు బార్ అసోసియన్ల కమిటీ సభ్యులు మరియు సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు, మరియు న్యాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకండి

## కొత్తపల్లి భాస్కర్ రెడ్డి న్యాల్కల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు....



**జహీరాబాద్, నేటిధాత్రి:** ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా ప్రతి ఇంటికి బిఎల్ఓ అధికాలు చేరుకొని ఓటర్ల వివరాలను పరిశీలిస్తూ అర్హులైన

ప్రతి ఒక్కరితో దరఖాస్తులు పూర్తి చేయాలని ప్రజలకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు ప్రజల ఓటు హక్కును పరిరక్షించడం అనేది కేవలం ఎన్నిక ల ప్రక్రియ మాత్రమే కాదు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే మహత్తర బాధ్యతా అని పేర్కొన్నట్టు పార్టీ నాయకులు బిఎల్ఎ లు సమాన్వయశీతో పనిచేసి న్యాల్కల్ మండల ఎస్ఐఆర్ కార్యక్రమానికి విజయవంతం చేయాలని సూచించారు

# కౌలు రైతుల సమస్యలపై వ్యవసాయ అధికారికి వినతి పత్రం ఇచ్చిన వరికెల



**నడికూడ, నేటిధాత్రి:** నడికూడ మండలంలో కౌలు రైతులు ఎదుర్కొంటున్న యూరియా,ఇతర ఎరువుల కొనుగోలు సమస్యలపై తెలంగాణ రైతు రక్షణ సమితి ఆధ్వర్యంలో నేడు నడికూడ మండల వ్యవసాయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు వరికెల కిషన్ రావు మాట్లాడుతూ,ప్రస్తుతం ఎరువుల పంపిణీలో భూస్వామి మొబైల్‌కు వచ్చే ఓటీపీ తప్పనిసరి చేయడం వల్ల కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. భూమిని సాగు చేసేది కౌలు రైతులే అయినప్పటికీ, భూస్వామి అందుబాటులో లేకపోవడం లేదా ఓటీపీ ఇవ్వడంలో జాప్యం జరగడం వల్ల సమయానికి యూరియా అందడం లేదని,దీనివల్ల పంటలు నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి,కౌలు రైతులు భూస్వామి ఓటీపీపై ఆధారపడకుండా నేరుగా ఎరువులు పొందే విధంగా చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారిని కోరారు.

# ఎరువుల,విత్తనాల,పురుగుమందుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు



**నడికూడ, నేటిధాత్రి:** మండల వ్యవసాయ అధికారి పోరిక జైసింగ్ నడికూడ మండలంలోని కంఠాత్మకూర్, చర్లపల్లి, నడికూడ, వెంకటేశ్వర్లపల్లి, రాయపర్తి, నర్సక్కపల్లి, ముస్త్యాలపల్లి గ్రామాలలోని ఎరువులు, విత్తనాలు,పురుగు మందుల డీలర్ల దుకాణాలను ముమ్మరంగా తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే ఎరువులను, విత్తనాలను, పురుగుమందులను విక్రయించాలని సూచించడం జరిగింది.ఏ డీలర్ అయినా ఎమ్మార్పీ దాటి ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు విక్రయించినచో అట్టి డీలర్లపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించడం జరిగింది. అదేవిధంగా స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు, లైసెన్సులు, స్టాక్ బోర్డులు, ధరల పట్టికలు, నిల్వలు నక్రమంగా నిర్వహిస్తున్నారా అనే అంశాలను పరిశీలించారు. అలాగే గతంలో స్టాప్ సేల్ ఉత్తర్వులు జారీ చేసిన పారాక్వాట్ గడ్డి మందు నిల్వలు డీలర్ల వద్ద ఉన్నాయా లేవా అనే విషయంలో తనిఖీలు చేయడం జరిగింది.డీలర్లు రైతులకు పారాక్వాట్ గడ్డి మందును విక్రయించరాదని డీలర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయుటం జరిగింది.నిబంధనలు ఉల్లంఘించిన డీలర్లపై పురుగుమందుల చట్టం-1968 ప్రకారం లైసెన్స్ సస్పెన్షన్, లైసెన్స్ రద్దు, స్టాక్ స్వాధీనం,ఇతర చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అదేవిధంగా రైతులు కూడా అట్టి గడ్డి మందు ప్రభుత్వ అనుమతి లేదు కాబట్టి రైతు సోదరులు ఎవరు కూడా వాడకూడదని తెలియపరుస్తున్నాము.రైతులు నాణ్యమైన ఎరువులు,విత్తనాలు పురుగు మందులను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మాత్రమే కొనుగోలు చేసి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి పోరిక జైసింగ్ కోరారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి తో పాటు మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారులు సూత్రపు గోపీనాథ్,జోరు ప్రశాంత్, సంబంధించిన డీలర్లు పాల్గొన్నారు.

# జిల్లాలో ప్రతి ఓటరికి ఒక్కటే ఓటు ఉండాలి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి, నేటిధాత్రి:** జిల్లాలో డబుల్ ఓటు లేకుండా ప్రతి ఓటరికి ఒక్కటే ఓటు ఉండేలా చేపట్టిన సర్ ప్రక్రియ నిర్వహణకు రాజకీయ పార్టీల సహకారం చాలా అవసరమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. శనివారం ఐడిఓసి.కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎన్నికల అధికారి అండ్ కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతి యువత ఓటరుగా నమోదు కావాలని, అందుకు రాజకీయ పార్టీలు విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. ఓటర్ల జాబితాలో పేర్ల సవరణలు, చిరునామా మార్పులు, మరణించిన లేదా శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్ల తొలగింపులను నిబంధనల ప్రకారం వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లు నియమించుకోవడం ద్వారా ఈ ప్రక్రియ మరింత సమర్థవంతంగా జరుగుతుందని సూచించారు.సింగరేణి సంస్థలో పనిచేస్తున్న సిబ్బంది తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించాలని సూచించారు. భూపాలపల్లి మున్సిపల్ పరిధిలో కొన్ని వార్డుల్లో నమోదు తక్కువగా ఉన్నందున ఆయా వార్డులపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో డిజిటలైజేషన్ ప్రక్రియ 84.12 శాతం పూర్తి అయిందని అయితే పురపాలక పరిధిలో 70 శాతం జరిగిందని వేగవంతానికి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. సర్ ప్రక్రియ ఆగస్టు 3వ తేదీతో ముగియనున్నందున అర్హులైన ప్రతి ఓటరు ఎన్యూమరేషన్ ఫారాలు నింపి బూత్ స్థాయి అధికారులకు అందజేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీఓ హరికృష్ణ, భూపాలపల్లి తహసీల్దార్ లక్ష్మీ రాజయ్య, ఎన్నికల విభాగం డిటి అబ్బాస్, నవీన్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని తమ సూచనలు తెలియజేశారు.

# ఎన్‌హెచ్-563 భూసేకరణ బాధిత రైతులకు ఆర్బిట్రేషన్ విచారణ నిర్వహించిన జిల్లా కలెక్టర్



**జగిత్యాల, నేటిధాత్రి:** జాతీయ రహదారి ఎన్‌హెచ్-563 విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు సంబంధించిన ఆర్బిట్రేషన్ విచారణను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శనివారం రోజున జగిత్యాల కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. పూడూర్ (31), నమిలికొండ (17), జగిత్యాల (10), చల్ గల్ (09), రాజరం (19), నూకపల్లి (17), పోతారం (13), ముత్యంపేట (46) గ్రామాలకు చెందిన భూసేకరణ బాధితుల పరిహారానికి సంబంధించిన మొత్తం 162 మంది అవార్డుదారుల (అవార్డ్స్ ) కేసులపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా భూమి యజమానులు, వారి తరఫున న్యాయవాదులు తమ వాదనలు వినిపించగా, సంబంధిత అధికారులు అవసరమైన వివరాలను జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. అలాగే, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ విచారణకు హాజరై సంబంధిత అంశాలపై వివరణ ఇచ్చారు. బాధిత రైతుల అభ్యర్థనలు, రికార్డులు, చట్టపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించి నిబంధనల మేరకు తగిన నిర్ణయం తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, కలెక్టరేట్ జీ-సెక్షన్ సూపరింటెండెంట్ ఉదయ్ కుమార్, న్యాయవాదులు, భూసేకరణ బాధిత రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఓటరు ఎస్ఐఆర్ లో వివరాలను నమోదు చేసుకోండి..



## తెల్లాపూర్‌లో ఎస్ఐఆర్ అవగాహన ర్యాలీకి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..

**పాటన్‌చేరు, నేటిధాత్రి:** ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కే బలమైన పునాది అని, అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కునుపరిరక్షించుకునేందుకు తప్పనిసరిగా ఎస్ఐఆర్ (SIR) ప్రక్రియలో పాల్గొని పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఏలియన్స్ స్పేస్ స్టేషన్ అపార్ట్మెంట్ సమీపంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సోమిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్ఐఆర్ అవగాహన ర్యాలీతో పాటు ప్రచార రథాన్ని ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో తన పేరు సక్రమంగా ఉండేలా చూసుకోవడం ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజల్లో ఎలాంటి అపోహలు లేకుండా..ప్రతి ఒక్కరికీ ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించేందుకు బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా అవగాహన సదస్సులు, ర్యాలీలు, ప్రచార రథాలు, ఇంటింటి ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఓటు అనేది కేవలం హక్కు మాత్రమే కాదు... ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే శక్తి అన్నారు. పటాన్చెరు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల భవిష్యత్తు, సంక్షేమానికి ప్రతి ఓటు ఎంతో విలువైనది. అందుకే ప్రతి అర్హుడైన ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వామి కావాలని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ ప్రచార రథాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యేజిఎంఆర్..బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కో-ఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు దేవేందర్ యాదవ్, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# తొగర్రాయిలో వైభవంగా తొలి ఏకాదశి వేడుకలు..

## శ్రీ వేణుగోపాల, శంభు లింగేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు



## ఆలయ చైర్మన్ సరస్వతి మదన్మోహన్...

కోదాడ, నేటిధాత్రి: మండల పరిధిలోని తొగర్రాయి గ్రామ ప్రసిద్ధ శ్రీ వేణుగోపాలస్వామి, శంభు లింగేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ సరస్వతి మదన్మోహన్ ఆధ్వర్యంలో అర్చకులు స్వామివార్లకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, విశేష అలంకరణలు జరిపించారు. తొలి ఏకాదశి సందర్భంగా ఉదయం నుంచి ఆలయాలు శివనామస్మరణం, విష్ణు నామస్మరణలతో మార్మోగాయి. ఈ పవిత్ర కార్యక్రమంలో చైర్మన్ సరస్వతి మదన్మోహన్ దంపతులు, గ్రామ ప్రముఖులు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లిక్కి గురవమ్మ వెంకటయ్య , గ్రామ కార్యదర్శి నరేందర్ రెడ్డి, నరసింహారావు, బాబు సార్, కొండల్, వెంకన్న, వీరబాబు, మాలాద్రి, మమత, లింగయ్య మరియు ఆలయ అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# నేటిధాత్రి 9 NETI DHATHRI

## తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా "నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్ లో పనిచేయుటకు

## ఆసక్తి కలిగిన కెమెరామెన్లు, రిపోర్టర్లకు

# ఆహ్వానం




పత్రికా రంగంలో "23 వసంతాల" అనుభవం
కలిగిన "నేటిధాత్రి" తెలుగు వార్త పత్రిక ఆధ్వర్యంలో
ఇప్పుడు "నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్‌ని
"పాఠక దేవుళ్ళ కోసం" "శక్తి బ్రాడ్ కాస్టింగ్స్" ద్వారా
మీ ముందుకు తీసుకు వస్తున్నామని తెలుపుటక సంతోషిస్తున్నాము.

## "నేటిధాత్రి" పత్రికను ఆదరించిన విధంగానే "నేటిధాత్రి 9" "యూట్యూబ్ ఛానల్" కూడా ఆదరిస్తారని కోరుకుంటూ....





మీ
**కట్టా శివ సుబ్రహ్మణ్యం**
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444

మీ
**కట్టా రాఘవేందర్ రావ్**
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
8297779999

## సంప్రదించవలసిన చిరునామా..

Srinivasa Nilayam 3rd Floor UBI Colony Road no: 03
Near TV9 Office Banjara Hills Hyderabad Pin Code : 500034

# ఈ పండు ఎప్పుడైనా తిన్నారా.. ఆరోగ్యానికి ఎంత మంచిదో తెలుసా..?

సాధారణంగా పండు ఏదైనా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ప్రకృతి సిద్ధంగా లభ్యమయ్యే పండువల్ల ప్రయోజనాలే ఎక్కువగా ఉంటాయి. అయితే ఈ ప్రయోజనాలు కొన్ని పండ్లలో ఎక్కువగా, కొన్ని పండ్లలో తక్కువగా ఉంటాయి. ఇలా ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలు ఉండే పండ్లలో పంపర పనస ఒకటి. ఈ పంపర పనస పండు అచ్చం బత్తాయిని పోలి, పరిమాణంలో కొంత పెద్దగా ఉంటుంది. పండు లోపల నిమ్మ, నారింజ, బత్తాయిలాగానే తొనలు ఉంటాయి. సిట్రస్ జాతికి చెందిన ఈ పండు కలర్ ఫుల్‌గా కనిపించడమే కాకుండా మంచి ఆరోగ్య లక్షణాలను కూడా కలిగి ఉంది. పంపర పనస పండుతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం



### రోగ నిరోధక శక్తి వృద్ధి

పంపర పనసలో విటమిన్-సి పుష్కలంగా ఉంటుంది. కాబట్టి ఈ పండు తినడంవల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. తరచూ ఈ పండును తింటుంటే అనారోగ్యాలు దరిచేరవు.

### గుండెకు మేలు

పంపర పనసలో పొటాషియం, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో సాయపడుతుంది. రక్తపోటు అదుపులో ఉంటే గుండె సంబంధ సమస్యలు సహజగానే అదుపులో ఉంటాయి. ఇక ఈ పండులోని ఫైబర్ కంటెంట్ కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. గుండెపోటు ప్రమాదాన్ని నియంత్రిస్తుంది.

### జీర్ణశక్తి మెరుగు

జీర్ణక్రియకు సాయపడే జీర్ణ ఎంజైమ్‌లు కూడా పంపర పనసలో పుష్కలంగా ఉంటాయి. కాబట్టి ఈ పండు తరచూ తీసుకుంటే జీర్ణశక్తి మెరుగుపడుతుంది. ఈ పండులోని ఫైబర్ కంటెంట్ మలబద్ధకాన్ని నివారిస్తుంది. ప్రేగు కదలికలను ప్రోత్సహిస్తుంది. దాంతో జీర్ణవ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తుంది.

### బరువు అదుపులో

పంపర పనస రుచిలో తియ్యగా ఉన్నప్పటికీ దీనిలో కేలరీలు తక్కువగా ఉంటాయి. కొవ్వు తక్కువ, ఫైబర్ ఎక్కువ ఉంటుంది. తీపి తినాలనే వారికి ఇది తృప్తిని ఇస్తుంది. అతిగా తినడాన్ని నివారిస్తుంది. బరువు తగ్గాలని అనుకునేవారు పంపర పనస తీసుకుంటే మంచి ప్రయోజనాలు ఉంటాయి.

### చర్మం ఆరోగ్యం

ఈ పండులో విటమిన్ సి, ఫ్లేవనాయిడ్స్ లాంటి యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటంవల్ల చర్మాన్ని ఆరోగ్యంగా, యవ్వనంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. యాంటీ ఆక్సిడెంట్లు చర్మ కణాలను దెబ్బతీసే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. ముడతలు, గీతలు లాంటి వృద్ధాప్య సంకేతాలను తగ్గించడంలో సాయపడుతాయి. ఈ పండును రెగ్యులర్‌గా తీసుకుంటే కొల్లాజెన్ ఉత్పత్తి పెరుగుతుంది. ఫలితంగా ప్రకాశవంతమైన చర్మం సొంతమవుతుంది.

# వేళకు తింటేనే భళా!



ఆహారంలో పోషకాలు ఉండటం చాలా అవసరం. తేలికపాటి అల్పాహారం ఆరోగ్యాన్ని ఇస్తుంది. మధ్యాహ్న భోజనం పప్పు, కూరలతో నిండుగా ఉండాలి. ఓ మోస్తరుగా రాత్రి డిన్నర్ ప్లాన్ చేసుకోవాలి. ఇవన్నీ మాకు తెలుసులే అంటారా! మంచిదే!! కానీ, ఈ పోషకాలు ఏ సమయంలోగా తీసుకోవాలో తెలిసినప్పుడే ఆరోగ్యానికి శ్రీరామ రక్ష అని గుర్తుంచుకోండి.

### టైమ్‌కు టిఫిన్

రోజులో అల్పాహారం చాలా ముఖ్యమైన భాగం. సుదీర్ఘ సమయం తర్వాత తీసుకునే ఆహారమిది. బ్రేక్‌ఫాస్ట్ సరిగ్గా ఉంటేనే శరీరం ఆ రోజు పనికి ఉత్సాహంగా సిద్ధమవుతుంది. ఉదయం నిద్ర లేచిన తర్వాత గంటలోపు అల్పాహారం తీసుకోవడం చాలా మంచిది. సమయం ప్రకారం.. ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య టిఫిన్ చేయాలి. అప్పుడే అది ఒంట బడుతుంది. ఎప్పుడైనా ఆలస్యమైతే ఓకే! ఎట్టి పరిస్థితిల్లోనూ ఉదయం పది గంటల లోపు బ్రేక్ ఫాస్ట్ ముగించాలని గుర్తుంచుకోండి. బ్రేక్‌ఫాస్ట్‌లో కాయగూరలు, పండ్లు ఉండేలా చూసుకోవాలి. ప్రొటీన్లు సమృద్ధిగా అందాలి.

### లంచ్ బెల్

అల్పాహారం తీసుకున్న నాలుగు గంటల తర్వాత భోజనానికి సరైన సమయం. ఇంకా చెప్పాలంటే మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంటల మధ్య భోజనం చేయాలి. ఆ సమయంలో శరీరం మంచి ఆకలి మీద ఉంటుంది. అప్పుడు తినే ప్రతి ముద్దా%రా% శరీరానికి శక్తినిస్తుంది. భోజనంలో కూరగాయలు, లీన్ ప్రొటీన్స్, కాంప్లెక్స్ పిండిపదార్థాలు ఉండేలా చూసుకోవాలి.

### డిన్నర్ విన్నర్

రాత్రి నిద్రకు ఉపక్రమించడానికి రెండు గంటల ముందు డిన్నర్ చేసేలా చూసుకోవాలి. చీకటి పడినప్పుడు శరీర గడియారం చురుగ్గా మారుతుంది. మెలటోనిన్ స్థాయులు పెరుగుతాయి. పాంక్రియాస్ కార్యాచరణ కూడా తగ్గుతుంది. పడుకోవడానికి పది నిమిషాల ముందు భోజనం చేస్తే%రా% రక్తంలో చక్కెర పెరుగుతుంది. జీవక్రియలు కూడా మందకొడిగా సాగుతాయి. ఇది అధిక బరువుకు కారణం అవుతుంది. అందుకే, రాత్రి ఏడు నుంచి ఎనిమిది గంటల మధ్య డిన్నర్ చేస్తే.. మీరే విన్నర్.

# ఐదు విటమిన్లు తప్పనిసరి!



ఏ ఇంట్లో అయినా ఇల్లాలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం కూడా బాగుంటుంది. ఉద్యోగం చేసి సంపాదించే మహిళలు అయినా, ఇంటి పట్టున ఉంటూ కుటుంబ యోగక్షేమాలు చూసుకునే గృహిణులకు అయినా ఇదే సూత్రం వర్తిస్తుంది. అయితే, ఒక వయసు వచ్చేసరికి అందరిలోనూ అనారోగ్య సమస్యలు తలెత్తడం సహజం. హార్మోన్ల అసమతుల్యత, పోషకాహార లోపం, ఒత్తిడి తదితర సమస్యలు వారిని అనారోగ్యానికి చేరువ చేస్తుంటాయి. అయితే, శారీరకంగా బలంగా ఉన్నప్పుడే మానసికంగా దృఢంగా ఉండగలం. నడి వయసుకు వచ్చాక మహిళలు అనారోగ్యంతో సావాసం చేయొద్దంటే ఈ ఐదు విటమిన్లు రోజువారీగా అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు నిపుణులు.

విటమిన్ డి3

దీని లోపం వల్ల ప్రీ మెన్‌స్ట్రువల్ సింద్రోమ్, పాలిసిస్టిక్ ఓవరీ సింద్రోమ్, ఇన్సులిన్ తగ్గడం, రుతుచక్రంలో మార్పులు, సమస్యలు వస్తాయి. ఉదయాన్నే సూర్యరశ్మి శరీరానికి తాకితే విటమిన్ డి3 పుష్కలంగా లభిస్తుంది. అంతేకాదు, సాల్మన్ చేపలు, గుడ్లు, పాలు, పాల ఉత్పత్తులకు రెగ్యులర్ డైట్‌లో చోటివ్వడం వల్ల కూడా విటమిన్ డి3 శరీరానికి అందుతుంది.

### విటమిన్ సి

విటమిన్ సి లోపంతో బాధపడేవారికి ప్రొజెస్టిరాన్ ఉత్పత్తి సరిగ్గా ఉండదు. సంతానోత్పత్తి సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉంది. నిమ్మకాయ, నారింజ, ఆరెంజ్ వంటి పుల్లటి పండ్ల నుంచి విటమిన్ సి లభిస్తుందని అందరికీ తెలిసిందే. వాటితోపాటు బ్రకోలి, టమాట, క్యాప్సికమ్ నుంచి కూడా శరీరానికి విటమిన్ సి అందుతుంది. జామకాయలు తరచూ తినడం మంచిది. ఇది చర్మ సంరక్షణకూ సహకరిస్తుంది.

### విటమిన్ బి12

ప్రస్తుతం ఎక్కువమంది విటమిన్ బి12 లోపాన్ని ఎదుర్కొంటున్నారు. ఇది లోపిస్తే.. ఎర్ర రక్త కణాల ఉత్పత్తి మందగిస్తుంది. థైరాయిడ్ సమస్యలు వస్తాయి. మాంసం, చేపలు, గుడ్లు ఎక్కువగా తీసుకుంటే విటమిన్ బి12 లోపం నుంచి బయటపడవచ్చు.

### విటమిన్ బి9

విటమిన్ బి9 లోపంతో గర్భధారణ, సంతానోత్పత్తిలో సమస్యలు ఎదురవుతాయి. ఆకుకూరలు, కూరగాయలు, తృణధాన్యాలు తీసుకుంటే విటమిన్ బి9 పుష్కలంగా అందుతుంది.


### విటమిన్ బి6

విటమిన్ బి6 లోపం ఉన్న మహిళల్లో ప్రీ మెన్‌స్ట్రువల్ సింద్రోమ్, ప్రీ మెన్‌స్ట్రువల్ డైస్ఫోరిక్ డిజార్డర్, అడ్రినల్ గ్రంథి సమస్యలు కనిపిస్తాయి. ఈ విటమిన్ లోపం కారణంగా నిద్రలేమి సమస్య వస్తుంది. మెదడు ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. అరటిపండ్లు, ఆలుగడ్డలు, చికెన్ తినడం వల్ల విటమిన్ బి6 లభిస్తుంది.



# సత్తువ పిండి

మన పెద్దలకు సత్తుపిండి ప్రయోజనాలు బాగా తెలుసు. అందుకే వాళ్లు తరచుగా సత్తుపిండిని ఆహారంగా తీసుకునేవాళ్లు. ఇప్పటికీ తెలంగాణ సహా కొన్ని రాష్ట్రాల్లో గ్రామీణుల ఆహారంలో సత్తుపిండి ఓ భాగమే. పేదవాళ్ల ప్రొటీన్ల భాండాగారంగా భావించే సత్తుపిండి ప్రయోజనాలను ఇప్పటితరం అంతగా పట్టించుకోవడం లేదు. వీర శివాజీ మెచ్చిన ఈ సహజమైన ప్రొటీన్ పొడి అచ్చంగా భారతీయ ఆహారమే.



### సత్వర శక్తి

సత్తుపిండి శరీరానికి వెంటనే శక్తిని ప్రసాదిస్తుంది. 100 గ్రాముల సత్తుపిండిలో ప్రొటీన్లు 25 నుంచి 30 గ్రాముల వరకు ఉంటాయి. అలా శాకాహారులకు నాణ్యమైన ప్రొటీన్లను ప్రసాదిస్తుంది. అంతేకాదు ఇందులో ఫైబర్ కూడా ఎక్కువే. ఇది మన కడుపును శుద్ధిచేస్తుంది. గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకంతో బాధపడుతున్న వారికి సత్తుపిండి మంచి ఆహారపదార్థం.

### అందరి ఆహారం

సత్తుపిండిలో ట్లగ్లెసిమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయులు తక్కువగా పెరుగుతాయి. అలా ఇది డయాబెటిస్ ఉన్నవాళ్లకూ మంచిదే. సోడియం తక్కువ ఉండటంతో అధిక రక్తపోటు ఉన్నవారు కూడా ఆరగించవచ్చు. క్యాల్షియం, ఐరన్, మాంగనీస్, మెగ్నీషియం, ఎ, సి విటమిన్లు కూడా శరీరానికి అందుతాయి. 25 గ్రాముల సత్తుపిండిలో 100 క్యాలరీలు ఉన్నప్పటికీ, దీని ప్రయోజనాలతో పోలిస్తే క్యాలరీల సమస్య పెద్దది కాదు. కండరాలకు శక్తినిస్తుంది కాబట్టి, పెరిగే పిల్లలకూ సత్తుపిండి గొప్పదే.

### ఆహారంలో

బీహార్, జార?ండ్ రాష్ట్రాల్లో సత్తుపిండితో లిట్టి అనే వంటకం చేస్తారు. కూరగాయలు జోడించి పరాఠాలు, ఉప్మా చేసుకోవచ్చు. సత్తుపిండికి ఉల్లిపాయలు కలిపి పకోడీలుగా వేసుకోవచ్చు. సత్తుతో లడ్డూలు, మామిడిపండు రసంతో స్మూతీ, సత్తు కబాబ్‌లు కూడా చేస్తారు. ఇక సత్తుపిండికి కొబ్బరి తురుము, డ్రై ఫ్రూట్స్, శనగపిండి, నెయ్యి, చక్కెర, యాలకుల పొడి లాంటివి చేర్చి చేసే సత్తు పంజిరి రుచిగా ఉంటుంది. నీళ్లు కలిపిన సత్తుపిండి ముద్దకు చక్కెర లేదంటే ఊరగాయ కలుపుకొని ఉపాహారంగానూ ఆరగించవచ్చు. మళ్లీ మధ్యాహ్నం వరకు కడుపులో ఎలుకలు ఉరుకులాడవు.

పానీయంగా

శనగలను ఇసుకలో వేయించి, ఆ తర్వాత వాటిని జల్లెడపడతారు. వీటిని పిండిగా మారుస్తారు. సత్తుపిండి అంటే ఇదే. సత్తుపిండిని బెల్లంతో కలుపుకొని గానీ, ఉప్పు, వేయించిన జీలకర్ర పొడితో కలుపుకొని గానీ తాగితే ఆరోగ్యానికి మంచిది. సత్తు షర్బత్ ఎండాకాలంలో శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. నిమ్మరసం, పుదీనా ఆకులు కూడా జోడించుకోవచ్చు. ఇది శక్తిదాయిని.

### మితం తప్పొద్దు

మంచిదని చెప్పి సత్తుపిండిని ఎక్కువగా తింటే కడుపులో గ్యాస్ సమస్య తలెత్తుతుంది. కాబట్టి, గ్యాస్ట్రిక్ సమస్యలు ఉన్నవాళ్లు మితంగా తినాలి. పిత్తాశయంలో రాళ్లు ఉన్నవాళ్లు సత్తుపిండి తినకూడదు. కిడ్నీల్లో రాళ్లు ఉంటే డాక్టర్ సలహా తీసుకోవాలి. ఇక శనగలంటే అలర్జీ ఉన్నవాళ్లు, సత్తుపిండి అరిగించుకోలేని వాళ్లు కూడా సత్తుకు దూరంగా ఉంటే మంచిది.

# గోధుమ పిండికి ఇవి కలిపితే టేస్టీ, హెల్దీ రోటీలు రెడీ..!



బరువు తగ్గాలనుకునే వారు రైస్ పక్కనపెట్టి రోటీలు తినడం సర్వసాధారణం. గోధుమ పిండితో చేసే రోటీలు, చపాతీలకు బదులు ఈ పిండిలో పోషకాలతో కూడిన పలు రకాల పొడులు, పిండి కలపడం ద్వారా మెరుగైన ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. గోధుమ పిండితో చేసే రెగ్యులర్ రోటీలను కొద్దిపాటి మార్పులతో రుచిగా, హెల్దీగా తయారుచేసుకోవచ్చు

గోధుమ పిండిలో పోషకాల గనిగా పేరొందిన మునగాకు పొడిని మిక్స్ చేస్తే ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కప్పు గోధుమ పిండిలో కేవలం ఒక స్పూన్ మునగాకు పొడి కలిపితే రోటీలు ఆకుపచ్చ వర్ణంలో పోషకాలతో నిండిఉంటాయి. మునగాకులో ఉండే విటమిన్ ఏ, పాలకూరలో కంటే మూడు రెట్లు అధికం. ఇందులో ఉండే అధిక ఫైబర్, యాంటీఆక్సిడెంట్ క్లోరోజెనిక్ యాసిడ్ కారణంగా బరువు నియంత్రిస్తుంది.

మునగాకు పొడితో పాటు యాంటీఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ పదార్థాలు పుష్కలంగా ఉండే పసుపును వాడటం కూడా ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఆటాలో ఒక కప్పు పిండికి స్పూన్ పసుపు కలిపితే రోటీలు బంగారు వర్ణంలో మెరుస్తూ అద్భుత రుచినీ అందిస్తాయి. ఆర్థరైటిస్, జీర్ణ సమస్యలు, కుంగుబాటు, అలర్జీలకూ పసుపు దివ్యౌషధంగా పనిచేస్తుంది. పప్పు, కర్రీస్‌కు కూడా పసుపు మంచి రుచిని అందిస్తుంది. ఇక రోటీలు టేస్ట్‌గా, ఆరోగ్య ప్రయోజనాలను అందించేలా ఉండాలంటే వీటిని మిక్స్ చేస్తే బెటర్..

మునగాకు పొడి ,పసుపుజి,మెంతి పొడి

వాముజి,అవిసె గింజలు

# పేగులు బాగుండాలంటే..

ఆయాసం, వాంతులు, మలబద్ధకం, గ్యాస్, అవాంఛితంగా బరువు పెరగడం, బరువు తగ్గడం, నిద్రలేమి, అలసట ఇవన్నీ పేగుల అనారోగ్యాన్ని సూచిస్తాయి. ఇక పేగులను ఆరోగ్యంగా ఉంచడంలో ప్రొబయోటిక్ ఆహార పదార్థాలు ముఖ్యపాత్ర పోషిస్తాయి. వాటికోసం ఎక్కడో వెతకాల్సిన పన్లేదు. మన వంటల్లోనే ఉన్నాయి.

రసం: పప్పు, చింతపండు, మూలికలు, సుగంధ ద్రవ్యాలు రసం తయారీకి ముడిసరుకులు. వీటిలో ఎ, సి విటమిన్లు, మెగ్నీషియం, ఇనుము, కాల్షియం సమృద్ధిగా ఉంటాయి. రసంలో పీచు పదార్థాలూ ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థకు గొప్పగా ఉపయోగపడతాయి.

కఢీ: దీన్ని శనగపిండితో చేస్తారు. ఇందులో పుష్కలంగా ఉండే మెగ్నీషియం, ఫైబర్ పేగుల ఆరోగ్యానికి అత్యవసరం. కడుపునొప్పి, మలబద్ధకం, బరువు తగ్గడానికి వంటింటి చిట్కా కఢీ.

మెంతికూర: బరువు తగ్గడం, మలబద్ధకం లాంటి పేగులకు సంబంధించిన సమస్యలలో మెంతులు ఎంతో సహాయకారి. ఈ ఆహార పదార్థాలకు అదనంగా వ్యాయామం, యోగా, తగినన్ని నీళ్లు పేగులను ఆరోగ్యంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తాయి.

# ఇద్దరిలో ఒకరు ఎందుకలా

హలో జిందగీ. కవల పిల్లలు పుట్టినప్పుడు ఒకరు బలహీనంగా మరొకరు బలంగా, ఒకరు ఆరోగ్యంగా మరొకరు సమస్యలతో పుట్టడానికి కారణం ఏమిటి? కవల పిల్లలు కడుపులో ఉన్నప్పుడు వాళ్లు చక్కటి ఆరోగ్యంతో పుట్టాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? తెలుపగలరు.

ఓ పాఠకురాలు



కవల పిల్లల్లో ఒకరు బలంగా, ఇంకొకరు బలహీనంగా ఉండటానికి రకరకాల కారణాలు ఉంటాయి. ముఖ్యంగా వాళ్లు ఒకే అండం నుంచి ఏర్పడ్డారా లేదా రెండు అండాల నుంచి ఏర్పడ్డారా అన్నది ముఖ్యం. వంశపారంపర్యం ఉన్నవాళ్లకు రెండు వేర్వేరు అండాల నుంచి పిండాలు ఏర్పడతాయి. దానివల్ల ఇద్దరు పిల్లలూ కొంత ఆరోగ్యంగా ఉండటానికి అవకాశం ఉంది. కానీ ఒకే అండం నుంచి ఏర్పడి ఒకే మాయ, ఉమ్మనీరు పంచుకుంటే మాత్రం ఎక్కువ శాతం ఒకరు బలహీనంగా ఉంటారు. ఐవీఎఫ్‌లాంటి విధానాల్లో పిండం ఏర్పడితే ఇలాంటి పరిస్థితే ఎదురవుతుంది. ముఖ్యంగా ఒకే మాయలో ఉన్నప్పుడు ఇద్దరికీ రక్త ప్రసరణ సమానంగా ఉండదు. ఒకరికి ఎక్కువ, మరొకరికి తక్కువ అందుతుంది. అలాగే ఒక బిడ్డ నుంచి మరో బిడ్డకు రక్తం వెళ్లే పరిస్థితులూ ఉంటాయి.

అలాంటప్పుడు మొదటి బిడ్డ గుండె బలహీనంగా ఉంటుంది. ఇవి మాత్రమే కాదు, బిడ్డ ఏర్పడటంలోనూ రకరకాల ఇబ్బందులు తలెత్తుతాయి. తల్లికి కూడా హైబీపీ వచ్చే అవకాశాలు ఉంటాయి. ప్రీ మెచ్యూర్ డెలివరీ అయ్యే అవకాశాలూ ఎక్కువే. అలాగే డెలివరీ సమయంలో రక్తం ఎక్కువగా పోతుంది. ఇద్దరు బిడ్డలకు సరిపడా పెద్దగా సాగిన గర్భాశయం తిరిగి సాధారణ స్థితికి రావడానికి సమయం పడుతుంది. అందుకే, కడుపులో కవలలు ఉన్నప్పుడు డాక్టర్ చెప్పిన సూచనలను జాగ్రత్తగా పాటించాలి. ముఖ్యంగా చిన్నపిల్లలకు అత్యవసరమైన ఎన్ఐసీయూ సదుపాయం ఉండే ఆసుపత్రులకు అందుబాటులో ఉండాలి. మొత్తంగా చెప్పాలంటే సాధారణ గర్భం కంటే మరింత జాగ్రత్తగా ఉండటం ద్వారా కొంతవరకూ కాంప్లికేషన్లను అధిగమించవచ్చు.

**డాక్టర్ పి. బాలాంబ సీనియర్ గైనకాలజిస్ట్**

# స్వచ్ఛందంగా భూములు ఇచ్చినా నిరాశేనా...?

## నిమ్జ్ నష్టపరిహార చెక్కుల కోసం భాదితుల అరిగోస...









- ●ఫిర్యాదు చేసిన పట్టించుకోని ఉన్నతాధికారులు
- ●పైరవీలతో పరిహారం అందుంతుందని అనుమానాలు
- ●అప్పులుపుట్టవు, భూములు అమ్ము కోలేరు
- ●వైద్యం, పెళ్లిలు,చదువుల కోసం బాధితుల కష్టాలు
- ●రాష్ట్ర ముఖ్యమంత్రికి మామిడ్డి గ్రామ రైతుల ఆవేదన లేఖలు

జహీరాబాద్ నేటిధాత్రి:
పారిశ్రామిక అభివృద్ధికి, ప్రాంతీయ ప్రగతికి సహకరిస్తూ స్వచ్ఛందంగ తమ ప్రాణ సమానమైన భూము లను జాతీయ పెట్టుబడులు, ఉత్పాదక మండలి (నిమ్జ్) కు ఇచ్చేం దుకు సిద్ధపడిన పేదరైతులకు అధికారుల నిర్లక్షం శాపంగా మారింది. అభివృద్ధిపేరుతో ప్రాజెక్టుల పరిధిలోకి భూములను చేర్చ డంతో ఇటు అమ్ముకునేందుకు వీలులేక, బ్యాంకు రుణాలు ఇవ్వక ప్రభుత్వ పరిహార చెక్కుల చేతికి అందక రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బం దుల్లో కూరుకు పోతున్నారు.

### ఉన్నతాధికారులకు దరఖాస్తులు ఇచ్చినా ఫలితం సున్నా..

సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలం మామిడ్డి గ్రామానికి చెందిన పలువులు భాదిత రైతులు తమకు రావాల్సిన భూ నష్టపరిహార చెక్కుల కోసం ప్రజావాణిలో జిల్లా కలక్టర్కు స్వయంగా రెండు సార్లు దరకాస్థులు సమర్పించారు. జహిరాబాద్లోని నిమ్జ్ కార్యాల యాన్ని సంప్రదిస్తే సార్లు రాలేదని వచ్చాక కలవమని కాలయాపన చేస్తున్నారని భూభాదితులు ఆవేదన వ్యక్త పరుస్తున్నారు. ఫిబ్రవరి నెలలో అవార్డు పాసైనప్పటికి ఇప్పటి వరకు రావాల్సిన నష్ట పరి హారం చెక్కులను మంజూరి చేయక పోవడంపై తీవ్ర అసహనం వ్యక్తపరుస్తున్నారు.

### ఆర్థిక, అత్యవసరాలకు ఇబ్బందులు..

అనారోగ్యంతో బాదపడుతున్న వాళ్లు వైద్యం కోసం చేసిన అప్పులు తీర్చలేక తదుపరి వైద్యానికి నిధులు లేక నరకయాతన అనుభవిస్తు న్నట్లు, ఆడపిల్లల వివాహాలకు పిల్లల పైచదువులకు రూపాయి పుట్టక ఇబ్బందులు పడుతునట్లు, భూమి చేతిలో ఉన్నదానికి సంబం దించిన హక్కులు నిలిచిపోవడంతో బయట అప్పు పుట్టకుండా పోయిన పరిస్థితులను వారు ఎదుర్కుంటున్నట్లు ఆవేదన వ్యక్త పరు స్తున్నారు.

### అధికారుల పోకడలపై అనుమానాలు..

ఒకే రకమైన సమస్య ఉన్నపటికి కొందరికే పరిహారం చెక్కులు మంజూరి చేస్తూ, మిగిలిన వారిని ఆఫీసుల చుట్టూ తిప్పుకోవండం వెనుక అధికారుల పక్షపాత ధోరణి ఉందనే అనుమానాలు వ్యక్తమ వుతున్నాయి. అందరికి సమానంగా న్యాయం చేయాల్సిన అధికా రులు తమ దరకాస్థులను ఎందుకు పక్కన పెడుతున్నారని ప్రశ్నిస్తు న్నారు.

### ముఖ్యమంత్రి రేవంత్రెడ్డికి బాధితుల విజ్ఞప్తి..

భూములు ఇచ్చిటకు స్వచ్ఛందంగా ముందుకోచ్చిన భాదితులకు తక్షణమే స్పందించి పెండింగ్లో ఉన్న నష్ట పరిహారం చెక్కులను వెంటనే అందించేదుకు చర్యలు తీసుకుని తమ కుటుంబాలను అదుకోవాలని మిమిడ్డి గ్రామానికి చెందిన నలుగురు రైతులు శుక్ర వారంనాడు హద్రాబాద్ లోని ముఖ్యంమత్రి కార్యాలయంలో తమ దరకాస్తులను అందజేసినట్లు భాదితులు తెలిపారు. మొహ్మద్ ఘని, తాజోద్దిన్, థాబేవాలే మైలానా, కొత్తబాద్ ఇస్మాయిల్ నలుగురు భాదితులు లేక ద్వార ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

# చలివాగు వంతెనపై భద్రతా లోపాలు.. భయాందోళనలో వాహనదారులు..



- ●విరిగిన సిమెంట్ రక్షణ దిమ్మలు..
- ●దెబ్బతిన్న క్రాష్ బ్యారియర్ల స్థానంలో తాత్కాలిక ఇనుప అవరోధాలు

విరిగిపోయిన సిమెంట్ రక్షణ దిమ్మల దృశ్యం



దెబ్బతిన్న క్రాష్ బ్యారియర్ల స్థానంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక ఇనుప అవరోధాలు



చలివాగు వంతెనపై కొనసాగుతున్న వాహనాల రాకపోకలు

పరకాల, నేటిధాత్రి:
హనుమకొండ,భూపాలపల్లి,కాళేశ్వరం ప్రధాన రహదారిపై పరకాల సమీపంలోని చలివాగు వంతెన భద్రతా లోపాలతో వాహనదారులను,స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. భూపాలపల్లి,కాళేశ్వరం ప్రాంతాలకు వెళ్లే ప్రధాన మార్గంగా ఉన్న ఈ రహదారిని రేగొండ,చిట్యాల,టేకుమట్ల, గోరుకొత్తపల్లి తదితర మండలాలు,గ్రామాల ప్రజలు పరకాలకు నిత్యం రాకపోకల కోసం వినియోగిస్తుండటంతో ఈ మార్గంలో రోజంతా వాహనాల రద్దీ కొనసాగుతుంటుంది. వంతెనకు ఇరువైపులా ఏర్పాటు చేసిన సిమెంట్ రక్షణ దిమ్మలు పలుచోట్ల విరిగి దెబ్బతిన్నాయి. వాహనాలు అదుపు తప్పినప్పుడు ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు ఏర్పాటు చేసిన క్రాష్ బ్యారియర్లు కూడా పలు చోట్ల ధ్వంసమయ్యాయి. దీంతో వంతెనపై ప్రయాణించే వాహనదారులు భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన్న క్రాష్ బ్యారియర్ల స్థానంలో సంబంధిత అధికారులు తాత్కాలికంగా ఇనుప అవరోధాలను ఏర్పాటు చేశారు. అయితే ఇవి శాశ్వత పరిష్కారం కాదని,రహదారి భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన కొత్త క్రాష్ బ్యారియర్లను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. అలాగే దెబ్బతిన్న సిమెంట్ రక్షణ దిమ్మలను పూర్తిస్థాయిలో పునర్నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మరోవైపు, సిమెంట్ రక్షణ దిమ్మలు దెబ్బతిన్న ప్రాంతాల్లో తగిన భద్రతా చర్యలు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో,వర్షాకాలంలో దృశ్యమానత తగ్గే సమయంలో ఈ వంతెనపై ప్రయాణించే వాహనదారులు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. భారీ వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ మార్గంలో ఆర్టీసీ బస్సులు,ప్రైవేట్ బస్సులు,అంబులెన్సులు,భారీ లారీలు,టిప్పర్లు,వ్యవసాయ వాహనాలు,ఇతర ప్రైవేట్ వాహనాలు నిరంతరం రాకపోకలు సాగిస్తుంటాయి. అలాగే ప్రసిద్ధ కాళేశ్వరం శ్రీ ముక్తీశ్వర స్వామి దేవస్థానానికి వెళ్లే భక్తులు కూడా ఇదే రహదారిని అధికంగా వినియోగిస్తుంటారు. ముఖ్యంగా కార్తీకమాసం,మహాశివరాత్రి,ఇతర పర్వదినాల్లో వాహనాల రద్దీ మరింత పెరుగుతుండటంతో వంతెన భద్రతకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. వంతెనపై తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఇనుప అవరోధాల స్థానంలో శాశ్వత క్రాష్ బ్యారియర్లను ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు,రోడ్ మార్కింగ్‌లు,వేగ పరిమితి సూచికలను ఏర్పాటు చేసి భద్రతను మరింత మెరుగుపరచాలని వాహనదారులు కోరుతున్నారు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన ఈ అంశంపై ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించి చలివాగు వంతెనను క్షేత్రస్థాయిలో పరిశీలించి,అవసరమైన సమగ్ర మరమ్మతులు చేపట్టాలని స్థానికులు,వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. దెబ్బతిన్న సిమెంట్ రక్షణ దిమ్మలను పునర్నిర్మించి,ధ్వంసమైన క్రాష్ బ్యారియర్ల స్థానంలో నాణ్యమైన కొత్త బ్యారియర్లను ఏర్పాటు చేసి వంతెనను భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.

# విద్యార్థుల పోరాటానికి కాంగ్రెస్ అండ

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నేపథ్యంలో అభిజిత్ దీప్కేకు రాజ్యాంగం అందజేసిన డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ



- ●జంతర్‌మంతర్‌లో విద్యార్థి ఉద్యమానికి సంఘీభావం
- ● కాంగ్రెస్ అండగా ఉంటుందని హామీ
- ● దేశవ్యాప్తంగా యువత ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని పిలుపు



న్యూఢిల్లీ, నేటిధాత్రి:
దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ వ్యవహారం, విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన అనంతరం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల ఉద్యమం కొత్త ఊపందుకుంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ఉద్యమానికి సంఘీభావం ప్రకటిస్తూ సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేకు భారత రాజ్యాంగ ప్రతిని అందజేశారు. రాజ్యాంగాన్ని స్వీకరించిన అభిజిత్ దీప్కే డాక్టర్ రామకృష్ణకు అభివాదం చేస్తూ, విద్యార్థుల ఉద్యమానికి కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు.

### రాజ్యాంగమే ఉద్యమానికి దిక్సూచి

రాజ్యాంగాన్ని అందజేసిన అనంతరం డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థుల ఉద్యమం రాజ్యాంగబద్ధమైన హక్కుల పరిరక్షణ కోసం సాగుతున్న ప్రజాస్వామ్య పోరాటమని అన్నారు. "విద్యార్థుల భవిష్యత్తే దేశ భవిష్యత్తు. వారి స్వరాన్ని అణచివేయడం కాదు... ఆలకించి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత" అని స్పష్టం చేశారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి ఇచ్చిన హక్కులను కాపాడటంలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు.

### దేశవ్యాప్తంగా ఉద్యమానికి సంఘీభావం తెలపాలి

జంతర్‌మంతర్‌లో కొనసాగుతున్న విద్యార్థుల ఉద్యమానికి దేశం నలుమూలల నుంచి విద్యార్థులు, యువత, ప్రజాస్వామ్యవాదులు, సామాజిక సంఘాలు పెద్ద ఎత్తున తరలివచ్చి సంఘీభావం ప్రకటించాలని డాక్టర్ రామకృష్ణ పిలుపునిచ్చారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమాజంలోని ప్రతి వర్గం ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు.

### రాహుల్.. రేవంత్ అండగా నిలుస్తున్నారు

లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదటి నుంచి విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం గొంతెత్తుతున్నారని డాక్టర్ రామకృష్ణ తెలిపారు. "అభిజిత్ దీప్కే... మీ పోరాటం ఒంటరిది కాదు. దేశవ్యాప్తంగా కోట్లాది మంది విద్యార్థులు, యువతతో పాటు భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ మీ వెంటే నిలుస్తుంది" అని ప్రకటించారు.

### పరీక్షల అక్రమాలపై కేంద్రం సమాధానం చెప్పాలి

దేశంలో వరుసగా వెలుగుచూస్తున్న పేపర్ లీకులు, పరీక్షల నిర్వహణలో లోపాలు విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టాయని డాక్టర్ రామకృష్ణ విమర్శించారు. పరీక్షల నిర్వహణలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు విద్యా వ్యవస్థపై విద్యార్థుల్లో విశ్వాసం పునరుద్ధరించే చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

### విద్యార్థులపై నమోదైన కేసులు ఉపసంహరించాలి

తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యమాలను అణచివేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, విద్యార్థులపై బలప్రయోగం సమర్థనీయం కాదన్నారు.

### 'స్టూడెంట్స్ ప్రొటెక్షన్ యాక్ట్' తీసుకురావాలి

పరీక్షల నిర్వహణలో పారదర్శకత, విద్యార్థుల హక్కుల రక్షణ, పేపర్ లీకుల నివారణ కోసం ప్రత్యేకంగా 'స్టూడెంట్స్ ప్రొటెక్షన్ యాక్ట్' తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పరీక్షల్లో అక్రమాలకు పాల్పడే వ్యక్తులు, సంస్థలపై కఠిన శిక్షలు విధించేలా సమగ్ర చట్టాన్ని రూపొందించాలని సూచించారు.

### బీఆర్ఎస్‌కు ప్రశ్నలు

ప్రస్తుతం విద్యార్థులకు మద్దతు ప్రకటిస్తున్న బీఆరెస్ నాయకులు గతంలో తెలంగాణలో జరిగిన నియామక పరీక్షల పేపర్ లీకులు, పరీక్షల నిర్వహణ వైఫల్యాలపై సమాధానం చెప్పాలని డాక్టర్ రామకృష్ణ ప్రశ్నించారు. వేలాది మంది నిరుద్యోగ యువత జీవితాలతో జరిగిన అన్యాయాన్ని ప్రజలు ఇప్పటికీ మరచిపోలేదన్నారు.

### దేశ భవిష్యత్తు కోసం పోరాటం

విద్యార్థులు, యువత, రైతులు, కార్మికులు సహా సమాజంలోని ప్రతి వర్గం న్యాయం కోసం చేసే పోరాటాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ స్పష్టం చేశారు. "ఇది వ్యక్తుల కోసం జరుగుతున్న ఉద్యమం కాదు... దేశ భవిష్యత్తును కాపాడే పోరాటం. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు.

# హనుమంత్‌కు అంతర్జాతీయ పిలుపు



- ●జాతీయ స్థాయిలో మెరిసిన బీసీ గురుకుల విద్యార్థి.. ఇటలీలో జరిగే అంతర్జాతీయ సెయిలింగ్ పోటీలకు ఎంపిక
- ●కూలీ దంపతుల కుమారుడు హనుమంత్ అరుదైన ఘనత.. జాతీయ స్థాయిలో మెరిసి అంతర్జాతీయ వేదికపైకి

చండూరు, నేటిధాత్రి:
నిరుపేద కుటుంబానికి చెందిన ఓ బీసీ గురుకుల విద్యార్థి అంతర్జాతీయ క్రీడా వేదికపై తన ప్రతిభను చాటేందుకు సిద్ధమయ్యాడు. నల్గొండ జిల్లా పి.ఏ.పల్లి మండలం నంబాపురం గ్రామానికి చెందిన వద్యా హనుమంత్ ఇటలీలో జరగనున్న అంతర్జాతీయ సెయిలింగ్ (యాచింగ్) పోటీలకు ఎంపికై రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచాడు.
ప్రస్తుతం మునుగోడు నియోజకవర్గంలోని చండూరు మండలం బోడంగిపర్తి గ్రామంలో ఉన్న మహాత్మ జ్యోతిబా పూలే బాలుర బీసీ గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న హనుమంత్, కూలీ దంపతులు వద్యా సైదా–సుజాతల కుమారుడు. చిన్న వయస్సులోనే క్రీడలపై ఆసక్తి పెంచుకుని కఠోర సాధనతో జాతీయ స్థాయిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు.

### జాతీయ స్థాయిలో పతకాల పంట

సెయిలింగ్ క్రీడలో అసాధారణ ప్రతిభ కనబరిచిన హనుమంత్ జాతీయ స్థాయి పోటీల్లో సిల్వర్, బ్రాంజ్ పతకాలు సాధించి ప్రతిభను నిరూపించాడు. గతంలో చెక్ రిపబ్లిక్‌లో జరిగిన అంతర్జాతీయ సెయిలింగ్ పోటీలకు ఎంపికైనప్పటికీ, అనివార్య కారణాలతో పాల్గొనే అవకాశం కోల్పోయాడు. ఈసారి ఇటలీలో జరిగే అంతర్జాతీయ పోటీలకు మరోసారి ఎంపిక కావడంతో తన ప్రతిభను ప్రపంచ వేదికపై ప్రదర్శించే అవకాశం దక్కింది.

### బీసీ గురుకులాలకు మరో గర్వకారణం

నిరుపేద కుటుంబం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన హనుమంత్ విజయం బీసీ గురుకుల విద్యా వ్యవస్థకు మరో గుర్తింపుగా నిలిచింది. ప్రభుత్వ ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, విద్యార్థి పట్టుదల కలిసి ఈ విజయానికి బాటలు వేశాయని విద్యావర్గాలు పేర్కొంటున్నాయి.

### ఘనంగా సన్మానించిన మంత్రి, అధికారులు

అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన హనుమంత్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ గురుకులాల కార్యదర్శి బి. సైదులు, నల్గొండ జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ ఇ. స్వప్న, పాఠశాల ప్రిన్సిపాల్ జాలా రామకృష్ణ, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి అభినందించారు. ఇటలీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి దేశానికి, తెలంగాణకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

### పేదింటి బిడ్డకు ప్రపంచ వేదిక

జాతీయ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయికి అడుగుపెడుతున్న హనుమంత్ ప్రయాణం గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. కష్టపడి సాధన చేస్తే ప్రపంచ వేదికపై కూడా విజయాలు సాధించవచ్చని ఆయన నిరూపించాడని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# చెత్త నుంచి సుందరీకరణ వరకు.. క్షేత్రస్థాయిలో కమిషనర్ వెంకన్న తనిఖీలు

## ఇంటింటికీ వెళ్లి ప్రజలతో ముచ్చట.. పారిశుద్ధ్యం, నగర అందీకరణ, ఓటరు జాబితా సవరణపై ప్రత్యేక దృష్టి



వరంగల్, నేటిధాత్రి:
గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ టి. వెంకన్న శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటిస్తూ పారిశుద్ధ్యం, నగర సుందరీకరణ పనులు, ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకుంటూనే అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.





### చార్‌బోలిలో ఇంటింటికీ వెళ్లి పరిశీలన

మోడల్ డివిజన్‌గా అభివృద్ధి చేస్తున్న 26వ డివిజన్‌లోని చార్‌బోలి ప్రాంతంలో కమిషనర్ ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. చెత్త సేకరణ వాహనం నిర్ణీత సమయానికి వస్తుందా..? తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందిస్తున్నారా..? కంపార్ట్‌మెంట్‌ల వారీగా చెత్త సేకరణ జరుగుతోందా..? అనే అంశాలపై ప్రజలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులను ఆదేశించారు.

### నగర ప్రవేశ ద్వారాల సుందరీకరణకు వేగం

నర్సంపేట గ్రాండ్ ఎంట్రెన్స్, ఖమ్మం గ్రాండ్ ఎంట్రెన్స్ ప్రాంతాలను సందర్శించిన కమిషనర్, సివిల్ పనులు పూర్తయిన నేపథ్యంలో ఫినిషింగ్ పనులు, హార్టికల్చర్, సుందరీకరణ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నగరంలోకి ప్రవేశించే వారికి ఆకర్షణీయమైన వాతావరణం కనిపించేలా అలంకార మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని ఆదేశించారు.

### మీడియన్‌లు పరిశుభ్రంగా ఉండాలి

ప్రధాన రహదారుల సెంట్రల్ మీడియన్‌లలో కలుపు మొక్కలు పెరగకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, అలంకరణ మొక్కలను సంరక్షిస్తూ నగర అందాన్ని పెంచేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కమిషనర్ సూచించారు.


### స్వీపింగ్ మిషన్ పనులపై ఆరా

ఎంజీఎం ఆసుపత్రి ఎదురుగా స్వీపింగ్ మిషన్‌తో చేపడుతున్న రహదారి శుభ్రత పనులను పరిశీలించిన వెంకన్న, యంత్రాలను సమర్థవంతంగా వినియోగించి ప్రధాన రహదారులను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

### ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి

ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటరు నమోదు ఫారాల పంపిణీ, స్వీకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజలకు ఫారాలు అందాయా..? డిజిటలైజేషన్ ఏ దశలో ఉందనే వివరాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా నగర ప్రజలకు కమిషనర్ విజ్ఞప్తి చేస్తూ, ఆగస్టు 3లోపు ఎస్ఐఆర్ ఫారాలను తప్పనిసరిగా సమర్పించాలని, చివరి తేదీ వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా అందజేసి ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు సహకరించాలని కోరారు.
ఈ తనిఖీల్లో కమిషనర్ వెంట సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, సీహెచ్ఎన్‌హెచ్ డాక్టర్ రాజేష్, శానిటరీ సూపర్వైజర్లు గోల్కొండ శ్రీను, భాస్కర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి మత్తులో బాలికపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డ మేనమామ, సోదరులు



మేడ్చల్ జిల్లా , నేటిధాత్రి:
మేడ్చల్ జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. గంజాయి మత్తులో ఓ బాలికపై మేనమామ, వరసకు సోదరులు అయ్యే ఇద్దరు వ్యక్తులు లైంగిక దాడికి పాల్పడ్డారు.
మహారాష్ట్రకు చెందిన బాలిక (13) తల్లిదండ్రులు కొన్నేళ్ల కిందట మరణించడంతో కీసరలోని అమ్మమ్మ ఇంట్లో ఉంది. స్థానికుల సహాయంతో తుర్కపల్లిలోని వసతీగృహంలో చేరింది. ఇటీవల సెలవులు కావడంతో కీసరలోని అమ్మమ్మ ఇంటికి వచ్చింది. అప్పుడు బాలిక ఒంటరిగా ఉన్న సమయంలో మేనమామతో పాటు వరసకు సోదరులైన ఇద్దరు యువకులు గంజాయి మత్తులో బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ విషయం బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారు. స్కూల్స్ రీఓపెన్ అయిన తర్వాత బాలిక మళ్లీ వసతీగృహానికి వెళ్లిపోయింది. అక్కడ ఫ్యాన్ తగిలి గాయాలు కావడంతో చికిత్స అనంతరం ఇటీవల మళ్లీ అమ్మమ్మ దగ్గరకు వచ్చింది. ఆ సమయంలో లైంగిక దాడికి సంబంధించిన విషయం బయటపడింది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు నిందితుల్లో ఒకరిని అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

Printed, Published & owned by Katta Raghavender Rao, Printed at S.V. Offset Printers, H. No. 4-6-65, S.T. Josephes High School,Kumarpalli Hanamkond, Warangal-01. Telangana State. & Published from, H.No.4-6-65, Opp. S.T. Josephes High School,kumarpalli, Hanamkonda, Warangal -506001. Telangana State.
Editor : Katta Raghavender Rao, RNI No. APTEL / 2005/15537. E-mail : netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999